



GST NO: 36ACPPF9587L2ZM TELTEL/2013/53323

# సమయజ్యోతి

ప్రతీ అక్షరం - ప్రజలకోసం

తెలుగు దిన పత్రిక

CELEBRATING 12TH YEAR ANNIVERSARY

సంపుటి : 12 సంచిక : 114 పేజీలు : 12 ఆదిలాబాద్ వెల రూ : 01 బుధవారం 09 జూలై 2025 ఎడిటర్ : ఫైసల్ ఖాన్







## శాంతియుతంగా బోనాల జాతర నిర్వహణ

### బోనాల ఉత్సవాలపై సమీక్షలో మంత్రి పొన్నం

హైదరాబాద్,జూలై8(సమయజ్యోతి ):

ఆషాఢ మాస బోనాల జాతర ఉత్సవాలు శాంతియుతంగా కొనసాగేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. హైదరాబాద్ అంబర్‌పేట్‌లో బోనాల జాతర ఉత్సవాలపై మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పొన్నం మాట్లాడుతూ.. పోలీసు, రెవెన్యూ, దేవాదాయశాఖ, జీహెచ్ఎంసీ, అగ్నిమాపక, విద్యుత్తు, జలమండలి ఇతర విభాగాల అధికారులు ఒక ప్రణాళికతో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు- పూర్తి చేయాలని సూచించారు. అంబర్‌పేట్‌లో నూతనంగా నిర్మించిన ÷-లఫై ఓవర్, సర్వీస్ రోడ్లపై ఏర్పడిన గుంతలను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జంట నగరాల్లో జరిగే బోనాల ఉత్సవాలకు ప్రభుత్వం తరఫున మంత్రులు పట్టు- వస్త్రాలు సమర్పిస్తారని తెలిపారు. దొంగతనాలు, శాని-టైజేషన్, మహిళల భద్రత కోసం ప్రత్యేక బృందాల ఏర్పాటు-కు మంత్రి ఆదేశించారు. ఈ సమీక్ష సమావేశంలో కాంగ్రెస్ సీనియర్ నేత వి హనుమంతరావు, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్, పోలీసు ఉన్నతాధికారులు, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

## నీట మునిగిన బ్యాంకుకు కాపలా



- బంగారం, నగదు దొంగల పాలుకాకుండా చర్యలు
- కుక్క అరుపుతో బతికిన పలువురు గ్రామస్థులు
- హిమాచల్‌లో వరదలతో అతలాకుతలం

సిమ్లా,జూలై8(సమయజ్యోతి ):


హిమాచల్‌లో కురుస్తోన్న భారీ వర్షాలతో మండి జిల్లా తీవ్రంగా ప్రభావితమైంది. కాగా.. రుతుపవనాల రాకతో జూన్ 20 నుంచి కురుస్తున్న వర్షాలకు హిమాచల్‌లో 70 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. పలువురి ఆచూకీ గల్లంతయిందని రాష్ట్ర విపత్తు నిర్వహణ విభాగం వెల్లడించింది. భారత వాతావరణ విభాగం రాష్ట్రంలోని పది జిల్లాలకు రెడ్, ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. ఇదిలాఉంటే.. మండి జిల్లాలోని తునాగ్ ప్రాంతంలోని కోఆపరేటివ్ బ్యాంక్‌ను వరద నీరు ముంచెత్తిన సంగతి తెలిసిందే. అందులో ఉన్న బంగారం, నగదు ఏమైందో..? అని ఆందోళన వ్యక్తమవుతోంది. దాంట్లో ఉన్న బంగారు ఆభరణాలు, ఇతర విలువైన వస్తువులు కొట్టు-కొనిపోకుండా, దొంగల చేతిలో పడకుండా గ్రామస్థులు కాపలా కాస్తున్నారు. భారీ వర్షాలు, ఆకస్మిక వరదలు, కొండచరియలు విరిగిపడుతుండటంతో హిమాచల్ ప్రదేశ్ ప్రజల జీవితం దుర్భరంగా మారింది. ఎంతోమంది అయినవాళ్లను కోల్పోయి అనాథలుగా మారిపోతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఒక కుక్క అరుపు.. 67 మంది ప్రాణాలను కాపాడింది.

## తమిళనాట ఘోర ప్రమాదం

### గేటు వద్ద స్కూల్ వ్యాన్ ను ఢీకొన్నరైలు

### ఇద్దరు విద్యార్థుల మృతి..పలువురికి తీవ్ర గాయాలు

చెన్నై,జూలై8(సమయజ్యోతి ):



తమిళనాడులో ఘోర ప్రమాదం చోటు-చేసుకుంది. కడలూరు జిల్లా చెమ్మంగుప్పంలో ప్రైవేట్ స్కూల్ వ్యాన్‌ను రైలు ఢీకొట్టింది. రైలు వెళ్లే సమయానికి గేటు- వేయక పోవడంతో ఈ ఘోరం జరిగినట్లు తెలుస్తోంది. ప్రమాదంలో ఇద్దరు విద్యార్థులు అక్కడికక్కడే మృతి చెందారు. ప్రాథమిక నివేదికల ప్రకారం 10 మందికి పైగా విద్యార్థులు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటనలో స్కూల్ వ్యాన్ నుజ్జునుజ్జు అయినట్లు- కనిపిస్తోంది. వెంటనే అప్రమత్తమైన స్థానికులు ఘటనపై అధికారులకు సమాచారం అందించారు. హుటాహుటినా రంగంలోకి దిగిన రెస్క్యూ సిబ్బంది గాయపడిన వారిని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి సహాయక చర్యలు చేపట్టారు. కాగా, ఈ ఘటనలో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం కనిపిస్తోంది. రైల్వే గేట్ కీపర్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు ప్రమాదానికి గల కారణాలపై విచారణ చేపట్టారు.

## అసత్యాలతో ప్రజలను మభ్య పెట్టలేరు

### మానుకోటలో పేదలకు ఇందిరమ్మ ఇళ్ల పట్టాల పంపిణీ

- కెటిఆర్ లెక్కలకు సమాధానం ఉంది
- అసెంబ్లీలో ఏ అంశమైనా చర్చిస్తాం
- కృష్ణా, గోదావరి జలాలపై చర్చకు సిద్ధమే
- కెటిఆర్ విమర్శలపై భట్టి ప్రతి విమర్శలు



మహబూబాబాద్,జూలై8(సమయజ్యోతి ):

బిఆర్ఎస్ అధినేత కెసిఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ లెక్కలు తీసుకొని అసెంబ్లీకి వస్తే ఏ అంశమైనా చర్చించడానికి సిద్దంగా ఉన్నామని డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క తెలిపారు. కృష్ణా, గోదావరి బేసిన్ జలాలపై చర్చకు ఎప్పుడైనా సిద్ధమేనని సవాల్ విసిరారు. కాళేశ్వరం నిర్మించి పది ఎకరాలకు కూడా నీళ్లు ఇవ్వలేదని, అసత్యాలు మానకపోతే.. బిఆర్ఎస్ కు డిపాజిట్లు రావని అన్నారు. నోరుందికదా అని కెటిఆర్ ఏది పడితే అది మాట్లాడమేనా? అని భట్టి ప్రశ్నించారు. సిఎం రేవంత్ రెడ్డి ఒకరికి సవాల్ విసిరితే మరొకరు బయటకు వచ్చారని అన్నారు. మహబూబాబాద్‌లో లబ్దిదారులకు ఇందిరమ్మ ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు భట్టి విక్రమార్క, తుమ్మల నాగేశ్వరరావు, కొండా సురేఖ, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి పాల్గొన్నారు.

2లో

## అధికారం లేకపోయేసరికి కెటిఆర్ నిలవడం లేదు

- డైరెక్ట్ ఎమెల్యే అయినోడికి రాజకీయాలు ఏం తెలుసు
- పదేళ్లు పాలన వెలగబెట్టిన వారి చరిత్ర ప్రజలకు తెలుసు
- రేవంత్‌ను గోకుడు ఎందుకు...తిట్టు తినడమెందుకు
- మీడియా సమావేశంలో జగ్గారెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు

హైదరాబాద్,జూలై8(సమయజ్యోతి ):

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌పై టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. కేటీఆర్ విదేశాల్లో చల్లదనం కోసం పోతున్నారని అన్నారు. నెలలో 20 రోజులు విదేశాల్లో కేటీఆర్‌కి ఏం పని అని ప్రశ్నించారు.







## నీళ్లు ఆంధ్రాకు...నిధులు ఢిల్లీకి.. నియామకాలు సొంతవారికి

- మాట తప్పడం రేవంత్‌కు అలవాటే
- ఆరు గ్యారెంటీలు..420 హామీలో మోసం
- ప్రెస్‌క్లబ్ వద్ద కెటిఆర్ బృందం హంగామా

హైదరాబాద్,జూలై8(సమయజ్యోతి ): 2లో

తెలంగాణ ఉద్యమం,పోరాటం నీళ్లు, నిధులు, నియామకాలకోసమే అన్నది అందరికీ తెలుసని, కాంగ్రెస్ కూడా ఇప్పుడు అదే అనుసరిస్తోందని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కెటిఆర్ ఎద్దేవా చేశారు. నీళ్లేమో ఆంధ్రాకు, నిధులు రాహుల్‌కు, నియామకాలు కొందరు తాబేదార్లకు అప్పగించారని మండిపడ్డారు. మాట తప్పడం సీఎం రేవంత్‌రెడ్డికి అలవాటేనని కేటీఆర్ అన్నారు. రైతు సంక్షేమం తదితర అంవాలపై చర్చకు సిద్ధమంటూ ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డికి సవాల్ విసిరిన కేటీఆర్ మంగళవారం ఉదయం ప్రెస్‌క్లబ్ వద్దకు వచ్చారు.



## ఢిల్లీలో బిజీగా సిఎం రేవంత్

- పలువురు కేంద్రమంత్రులతో భేటీ
- సరిపడా యూరియా విడుదల చేయాలని నడ్డాకు వినతి
- జహీరాబాద్ ఇండస్ట్రియల్ సిటీకి సహకరించాలని గోయల్‌కు అభ్యర్థన

2లో.

న్యూఢిల్లీ,జూలై8(సమయజ్యోతి ):

న్యూఢిల్లీలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటన బిజీ బిజీగా సాగుతోంది. ఈ పర్యటనలో భాగంగా పలువురు కేంద్ర మంత్రులతో సీఎం రేవంత్ వరుసగా భేటీ- అయ్యారు. అందులోభాగంగా జెపి నడ్డా, పీయూష్ గోయల్‌లతో భేటీ అయారు. తెలంగాణ రాష్ట్ర అవసరాలకు కేటాయించిన యూరియాను సకాలంలో సరఫరా చేయాలని కేంద్ర ఎరువులు, రసాయనాల శాఖ మంత్రి జె.పి.నడ్డాకు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. కేంద్ర మంత్రిని ఢిల్లీలోని ఆయన అధికారిక నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంగళవారం కలిశారు. వానా కాలం సీజన్‌కు సంబంధించి ఏప్రిల్-జూన్ నెలల మధ్య 5 లక్షల మెట్రిక్ టన్నులకు గానూ కేవలం 3.07 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే సరఫరా చేశారని కేంద్ర మంత్రి దృష్టికి సీఎం తీసుకెళ్లారు.

మొదటి పేజీ తరువాయి

# నీళ్లు ఆంధ్రాకు...నిధులు ఢిల్లీకి.. నియామకాలు సొంతవారికి

ఆయన వెంట మాజీమంత్రులు, ఎమ్మెల్యేలు, కార్యకర్తలు భారీగా తరలి వచ్చారు. చర్చ కోసం ఓ కే÷–చీలో సిఎం కోసం అంటూ ఖాళీగా పెట్టారు. ఈ సందర్భంగా కెటిఆర్ మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ అరాచక పాలనలో రైతులు ఇబ్బంది పడుతున్నారు. దాదాపు 600 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. ఆరు గ్యారంటీలు, 420 హామీలు అంటూ ప్రజలను మోసం చేశారు. బేసిన్ల నాలెడ్జ్, బేసిక్ నాలెడ్జ్ లేని సీఎం చర్చకు రావాలి. బహిరంగ చర్చకు రేవంత్‌రెడ్డి సవాలు విసిరితే మేం వచ్చాం. సవాలు విసిరిన సీఎం ఇక్కడకు ఎందుకు రాలేదు? సీఎం రాకపోతే మంత్రులైనా వస్తారని భావించాం. బహిరంగచర్చకు రావాలని సీఎంకు మరోసారి చెబుతున్నాం. కొత్త తేదీ, ప్రదేశం రేవంత్‌రెడ్డి చెబితే మేం తప్పకుండా వస్తాం. అసెంబ్లీలో చర్చించేందుకు కూడా మేం సిద్ధంగా ఉన్నాం. మైకులు కట్ చేయకుండా.. పూర్తిగా మాట్లాడే అవకాశం ఇస్తే అసెంబ్లీలో కూడా చర్చకు సిద్ధం అని కేటీఆర్ అన్నారు. 18 నెలలుగా రైతులను మోసం చేశారని ఆరోపించారు. ఎన్నికల్లో ఇచ్చిన ఒక్క హామీని కూడా నిలబెట్టుకోకుండా రంకెలేస్తున్నారని మండిపడ్డారు. రేవంత్‌కు రచ్చ చేయడం తప్ప.. చర్చ చేయడం రాదని ఎద్దేవా చేశారు. రేవంత్ సవాల్‌ను స్వీకరిస్తే ఆయన చర్చకు రాలేదని, రేవంత్ మాట తప్పుతారని తెలిసినా సవాల్‌ను స్వీకరించామని కేటీఆర్ అన్నారు. తెలంగాణ నిధులు ఢిల్లీకి పోతున్నాయని, రైతులపై సీఎం రేవంత్ రెడ్డికి గౌరవం లేదని ఆరోపించారు. సీఎం ఢిల్లీకి ఎందుకు వెళ్లారని అడిగితే ఎరువుల బస్తాల కోసమని చెబుతున్నారని కేటీఆర్ తెలిపారు. ఎవరికి బస్తాలు మోస్తున్నారో తెలియంది కాదని అన్నారు. రైతుబంధు అందరికీ ఇచ్చేశామని చెప్పుకుంటున్నారని, కొడంగల్‌లో ఎంతమంది రైతులకు రైతుబంధు పడలేదో జాబితా సిద్ధంగా ఉందని చెప్పారు. రైతుల మరణాల జాబితా కూడా తీసుకొచ్చామని, ఆనాటి ఎమర్జెన్సీ పరిస్థితి ఇప్పుడు తెలంగాణలో కనిపిస్తోందని విమర్శించారు. ఇందిరమ్మ రాజ్యమంటే సంక్షేమ పాలన అందిస్తారని అనుకున్నామని అన్నారు. కానీ పోలీస్ పాలన నడుస్తోందన్నారు. గురుకులాల్లో విద్యార్థులు మరణిస్తున్నా పట్టింపు లేదన్నారు. చర్చ కోసం రేవంత్ ఇంటికి రమ్మన్నా వెళ్తామని చెప్పారు. రేవంత్ స్థాయికి కేసీఆర్ అవసరం లేదని, తాము చాలని అన్నారు. కాంగ్రెస్ నేతలకు నిజాయితీ ఉంటే చర్చకు రావాలని, లేదంటే క్షమాపణ చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. రేవంత్ రెడ్డి ముక్కు నేలకు రాసి కేసీఆర్‌కు క్షమాపణ చెప్పాలన్నారు. కేటీఆర్‌తో చర్చకు వచ్చే సత్తా లేనప్పుడు.. రేవంత్ రెడ్డి మరోసారి సవాల్ చేయొద్దని చెప్పారు. రేవంత్ రెడ్డి ఢిల్లీ వెళ్ళింది యూరియా బస్తాల కోసం కాదని, ఏ బస్తాలు మోసి రేవంత్ ముఖ్యమంత్రి పదవిని కాపాడుకుంటున్నారో అందరికీ తెలుసని అన్నారు. రేవంత్ హయాంలో నీళ్ళు ఆంధ్రకు.. నిధులు ఢిల్లీకి.. నియామకాలు రేవంత్ తొత్తులకు దక్కుతున్నాయని అన్నారు. గురువు చంద్రబాబు కోసం తెలంగాణ నీళ్ళను ఆంధ్రకు పంపుతున్నారని ఆరోపించారు.రేవంత్ మోసాలు చేసి నాలుగు రోజులు తప్పించుకోవచ్చుని, కానీ ప్రజలు క్షమించరని కేటీఆర్ అన్నారు.సవాల్ విసిరి మాట తప్పడం సీఎం రేవంత్ రెడ్డికి అలవాటని ఆరోపించారు. 2018లో కొండగల్‌లో ఓడిపోతే రాజకీయ సన్యాసం తీసుకుంటానని చెప్పి, ఆ తర్వాత మాట తప్పాడని గుర్తుచేశారు. అందకుముందు తెలంగాణ భవన్ వద్ద ఆయన మీడియాతో మాట్లాడారు.కాంగ్రెస్ ఇచ్చిన హామీల అమలుపై ఈ ప్రభుత్వాన్ని 18 నెలలుగా నిలదీస్తున్నామని కేటీఆర్ అన్నారు. అభివృద్ధిపై చర్చకు రావాలని సీఎం రేవంత్‌రెడ్డిని ఎన్నో సార్లు ఆహ్వానించాం. అసెంబ్లీలో కాదంటే.. ప్రెస్‌క్లబ్‌లోనైనా చర్చకు రావాలని చెప్పా. రుణమాఫీ, రైతు బోనస్ వంటి అంశాలపై చర్చకు రావాలని ఆహ్వానించా. సీఎం రేవంత్‌రెడ్డి దిల్లీలో ఉన్నారని తెలిసింది... సీఎం రాకుంటే మంత్రులైనా రావాలి. సీఎం ఇవాళ హాజరుకాకుంటే.. మరో రోజు చర్చకైనా మేం సిద్ధం. సీఎం రేవంత్‌రెడ్డికి వీలైన తేదీ, ప్రదేశం చెప్పాలని అడుగుతున్నాం. అసెంబ్లీలో మైక్ కట్ చేయకుండా మాట్లాడిస్తామని హామీ ఇస్తే.. అసెంబ్లీలో కూడా సిద్ధం. ఈ ప్రభుత్వం ఒక్క హామీని కూడా నెరవేర్చలేదు. రేవంత్‌రెడ్డి తప్పుకొంటే.. అభివృద్ధి అంటే ఏంటో కేసీఆర్ చేసి చూపిస్తారని కేటీఆర్ అన్నారు. మీడియాతో మాట్లాడిన తర్వాత పార్టీ నేతలతో కలిసి సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌కు బయల్దేరారు.

మొదటి పేజీ తరువాయి

# అధికారం లేకపోయేసరికి కెటిఆర్ నిలవడం లేదు

కేసీఆర్ కోటాలో కేటీఆర్ డైరెక్ట్ ఎమ్మెల్యే అయిపోయాడని, రాజకీయ ఒడిదుడుకులు ఆయనకేం తెలుసని మండిపడ్డారు. తాము ఎన్నో వ్యవప్రయాసలతో రాజకీయ నేతలం అయ్యాం అని చెప్పారు. తమకున్న అనుభవాల ముందు కేటీఆర్ జీరో అని జగ్గారెడ్డి విమర్శించారు. 18 నెలలుగా అధికారం లేకపోయేసరికి కెటిఆర్‌కు మనసుకు పడతలేదన్నారు. గాంధీ భవన్‌లో జగ్గారెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డిపై కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపై మండిపడ్డారు. కేటీఆర్ ఈ మధ్య తెలంగాణలో ఉండటం లేదు. నెలకోసారి విదేశాలకు వెళుతున్నాడు. నెలలో పది రోజులు ఇక్కడ, 20 రోజులు విదేశాల్లో ఉంటాడు. కాబట్టి సీఎం రేవంత్ రెడీ షెడ్యూల్ ఆయనకు తెలియదు. విదేశాల్లో తిరిగే కేటీఆర్‌కి సీఎం రేవంత్ ఏం చేస్తున్నది ఎందుకు తెలుస్తుంది. పదేళ్లు మంత్రిగా నువ్వు, సీఎంగా మీ నాయన చేశాడు. ఢిల్లీకి ఎందుకు పోతారో ఆ మాత్రం తెలియదా కేటీఆర్ అని ప్రశ్నించారు. ఎరువులు, నిధులు, నీళ్ల పంచాయతీ కోసం సీఎం రేవంత్ ఢిల్లీ వెళ్లారు. కేసీఆర్ కుటుంబం ఢిల్లీకి లిక్కర్ దందా కోసం పోయింది. హరీష్ రావు, కేటీఆర్‌లు ఈడీ ఆఫీస్ల కోసం ఢిల్లీ వెళ్ళారు. మా సీఎం కేంద్రం చుట్టు తిరుగుతున్నారు. కేటీఆర్‌కి సిస్టర్ స్ట్రోక్ తగిలింది. కాంగ్రెస్ పార్టీకి పుట్టినిల్లు ఢిల్లీ. మీ లాగా మాది గల్లి పార్టీ కాదు కదా. కేటీఆర్.. నీ స్ట్రోక్‌ల లొల్లి మాకెందుకు రుద్దుతున్నావు' అని అడిగారు. సన్నాసులు అనే మాటలు స్టార్ట్ చేసింది మీ అయ్యనే. మీరు తిట్టిన మాటలను కాస్త పాలిష్ చేసి తిడుతున్నారు. మేము సత్రం నడపడం లేదు, మీరు తిడితే మేము తిడతం. సీఎం రేవంత్ రెడ్డిని గోకుడు ఎందుకు, తన్నించుకోవడం ఎందుకు?. తిట్ల పురాణం మీదే.. మీరు ఒకటి అంటే మేం పది తిడుతున్నాం. కేటీఆర్ అమెరికాలో చదివి.. పదేళ్లు మంత్రిగా చేసాడు. చర్చ అసెంబ్లీలో చేయాలా?, కల్లు కాంపౌండ్‌లోనా?. కల్లు కాంపౌండ్‌కు రా అంటే ఎట్లా?. వెయ్యి కోట్లు పక్క రాష్ట్రాల ఎన్నికల్లో పంపింది కేసీఆర్ కుటుంబం. కేటీ–ఆర్ అబద్ధాల కోరు. అందరికీ వడదెబ్బ తగిలితే.. ఆయనకు ఫ్యామిలీ దెబ్బలు తగులుతున్నాయి. కేటీఆర్‌కి అవగాహనలేక ఇబ్బందిపడుతున్నారని జగ్గారెడ్డి ప్రశ్నించారు.

# దమ్ముంటే ఫాతిమా కాలేజీపై చర్యకు దిగు

హైడ్రా వల్ల అనేక పేద కుటుంబాలు రోడ్ల పాలయ్యాయని.. పేదలకు ఒక న్యాయం, ఫాతిమా కాలేజ్ కు ఒక న్యాయమా? అని ప్రశ్నించారు. హైడ్రా కమిషనర్ రంగనాథ్ కు ఫాతిమా కాలేజ్ కూల్చడానికి ధైర్యం చాలడం లేదా అని నిలదీశారు.

గోషామహల్ ఎమ్మెల్యే రాజా సింగ్ బీజేపీకి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. పార్టీ అధ్యక్షపదవికి నామినేషన్ వెయ్యనివ్వలేదని అందుకే రాజీనామా చేస్తున్నట్లు– వెల్లడించారు. తన రాజీనామా లేఖను పూర్వ అధ్యక్షుడు కిషన్‌రెడ్డికి పంపించినట్లు– తెలిపారు. తెలంగాణలో బీజేపీ అధ్యక్షుడి నియామకంపై ఎమ్మెల్యే రాజాసింగ్ గతంలో సంచలన వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. రాష్ట్ర అధ్యక్షుడిగా ఒక వ్యక్తిని అధిష్ఠానం నిర్ణయించినట్లు ప్రచారం జరుగుతోందని, అధ్యక్షుడిని బూత్ కార్యకర్త నుంచి ముఖ్య నేత వరకు ఓటేసి ఎన్నుకోవాలని ఆయన అన్నారు. నావాడు, నీవాడు అంటూ నియమించుకుంటూ పోతే పార్టీకి తీవ్ర నష్టం కలుగుతుందని వ్యాఖ్యానించారు. తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావాలంటే ఎన్నిక నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ క్రమంలోనే ఆయన రాజీనామా చేశారు.

# కెటిఆర్ డ్రామాలు కట్టిపెట్టాలి

### చర్చించాలంటే అసెంబ్లీకి రావాలి

### దమ్ముంటే కెసిఆర్‌ను తీసుకుని రా

### కెటిఆర్ వ్యాఖ్యలపై మండిపడ్డ కాంగ్రెస్ నేతలు

**హైదరాబాద్,జూలై8(సమయజ్యోతి ):** కేటీఆర్‌పై కాంగ్రెస్ నేతలు మండిపడ్డారు. కెటిఆర్ డ్రామాలు ఆడడం ఆపేయాలని ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ అన్నారు. పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డితో కలిసి ఆయన మంగళవారం అసెంబ్లీ వద్ద విలేకరుతో మాట్లాడారు. కేటీఆర్ ప్రెస్‌క్లబ్‌కు వచ్చి మాట్లాడిన వ్యాఖ్యలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అసెంబ్లీకి వచ్చి చర్చించే దమ్ముంటే కేసీఆర్‌ను తీసుకుని రావాలని సవాల్ విసిరారు. కేటీఆర్ స్థాయికి తగ్గట్లుగా మాట్లాడాలని.. చిల్లర చేష్టలు మానుకోవాలని హెచ్చరించారు. కేసీఆర్ లెటర్ ఇస్తే అసెంబ్లీ సమావేశాలు నిర్వహించడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. సీఎం రేవంత్ రెడ్డి మాట ఇచ్చినట్లే ఏక కాలంలో రైతు రుణమాఫీ చేశామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే రైతు సంక్షేమ ప్రభుత్వమని చెప్పారు. కేటీఆర్‌వి చిల్లర ప్రయత్నాలు అని విమర్శించారు. కేటీఆర్‌ని చూస్తే జాలి వేస్తోందని ఎద్దేవా చేశారు. కేటీఆర్ చర్చించడానికి అసెంబ్లీ ఉందని గుర్తుచేశారు. కేసీఆర్ కంటే రేవంత్‌రెడ్డిది పెద్ద స్థాయి అని ఉద్ఘాటించారు. కేటీఆర్‌కి దమ్ముంటే కేసీఆర్‌ని అసెంబ్లీకి తీసుకురావాలని సవాల్ విసిరారు. తమకి అనుకూలంగా రాస్తే అందరి మీడియా, వ్యతిరేకంగా రాస్తే ఆంధ్రా మీడియానా అని ప్రశ్నించారు. ఆంధ్రజ్యోతి తెలంగాణ ఉద్యమానికి ఏం చేసిందో కేసీఆర్‌ని అడిగితే తెలుస్తోందని అద్దంకి దయాకర్ పేర్కొన్నారు. తెలంగాణ మీ జాగీరా?. సాగరహారం జరుగుతుంటే ఎక్కడ ఉన్నారు. సాగరహారం జరిగిన రోజుల్లో మీ మొహాలు ఎక్కడున్నాయి. తెలంగాణ ఉద్యమంలో కొట్లాడిన వాళ్లం మేము. సారా అమ్ముతారు జై తెలంగాణ అంటారు. ఫోన్ ట్యాపింగ్ చేస్తారు.. జై తెలంగాణ అంటారు. బీఆర్ఎస్ పేరు పెట్టుకున్నాక తెలంగాణతో మీకు సంబంధం ఏంటి?. నీ చెల్లి కవిత ఫోన్‌ని ట్యాపింగ్ చేసి అణగదొక్కావ్. మీ చెల్లి వేసిన ప్రశ్నలకు సమాధానం చెప్పే ధైర్యం ఉందా?. తెలంగాణ ప్రజలను మోసం చేసిన దొంగలు మీరు. రేవంత్‌రెడ్డితో పోలిక పెట్టుకోవడానికి అర్హతే లేదు మీకు. నమ్మించి మోసం చేయడమే మీ అయ్య సంస్కృతి. ఆంధ్రా తెలంగాణ అంటూ సెంటిమెంట్ రెచ్చగొడుతున్నారు. వాళ్లకి అనుకూలంగా ఉంటే మంచి మీడియానా? లేకపోతే చెడ్డ మీడియానా?. బీఆర్ఎస్ పార్టీని మీ నలుగురు తప్ప.. ఎవరూ సపోర్ట్ చేయడం లేదు. కేసీఆర్‌కి రావడం చేతకాక బచ్చగాడిని పంపుతారా. మాకు సానుభూతి ఉంది కాబట్టే హాస్పిటల్‌కి వెళ్లి కేసీఆర్‌ని పరామర్శిస్తున్నాం. బావ, బామ్మర్దులతో పాటు చెల్లి ఇప్పుడు పోటీలోకి వచ్చింది. అందరూ కలిసినా రేవంత్‌ని ఏం చేయలేకపోయారు. పిచ్చిమాటలు మాట్లాడితే మా తడాఖా చూపిస్తాం. మొన్నటి ఎన్నికల్లో కేటీ–ఆర్ ఫోన్ ట్యాపింగ్ చేయకపోతే కాంగ్రెస్ పార్టీకి 100 సీట్లు– వచ్చేవి' అని అద్దంకి దయాకర్ ధీమా వ్యక్తం చేశారు.

మొదటి పేజీ తరువాయి

# ఢిల్లీలో బిజీగా సిఎం రేవంత్

రాష్ట్రంలో ప్రాజెక్టులకు నీరు రావడం.. సాగు పనులు జోరుగా సాగుతున్నందున యూరియా సరఫరాలో ఆటంకాలు తలెత్తకుండా చూడాలని కోరారు. జులై నెలకు సంబంధించి 63 వేల మెట్రిక్ టన్నులు దేశీయంగా ఉత్పత్తి అయిన యూరియా, 97 వేల మెట్రిక్ టన్నుల విదేశాల నుంచి దిగుమతి చేసుకున్న యూరియా రాష్ట్రానికి సరఫరా చేయాల్సి ఉండగా ఇప్పటి వరకు కేవలం 29 వేల మెట్రిక్ టన్నుల యూరియా మాత్రమే చేశారని కేంద్ర మంత్రికి సీఎం తెలిపారు. దేశీయంగా ఉత్పత్తి అవుతున్న యూరియా కోటాను తెలంగాణకు పెంచాలని సీఎం కోరారు. యూరియా సరఫరాకు సంబంధించి రైల్వే శాఖ తగిన రేక్‌లు కేటాయించడం లేదని... వాటి సంఖ్య పెంచాలని విజ్ఞప్తి చేశారు. కేంద్రమంత్రితో సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ క్రీడా సలహాదారు ఏపీ జితేందర్ రెడ్డి, ఎంపీలు డాక్టర్ మల్లు రవి, చామల కిరణ్ కుమార్ రెడ్డి, ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, రాష్ట్ర వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్‌రావు, కేంద్ర పథకాల సమన్వయ కార్యదర్శి డాక్టర్ గౌరవ్ ఉప్పల్ తదితరులు పాల్గొన్నారు. అలాగే కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్‌తో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్రాభివృద్ధికి సహాయ, సహకారాలు అందించాలని ఆయనకు సీఎం వినతి పత్రం అందజేశారు. ఉమ్మడి మెదక్ జిల్లాలోని జహీరాబాద్ ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీ– అభివృద్ధికి సహకరించాలని కోరారు. అందులోభాగంగా జాతీయ పారిశ్రామిక కారిడార్ అభివృద్ధి, అమలు ట్రస్ట్ ఆమోదించిన రూ. 596. 61 కోట్లను త్వరగా విడుదల చేయాలని కేంద్ర మంత్రికి ఆయన విజ్ఞప్తి చేశారు. స్మార్ట్ సిటీకి అవసరమైన నీటి సరఫరా, విద్యుత్ తదితర మౌలిక సదుపాయాలకు ఆర్థిక సహాయం అందించాలని అడిగారు. హైదరాబాద్ - వరంగల్ పారిశ్రామిక కారిడార్‌లో భాగంగా వరంగల్ విమానాశ్రయానికి నిధులు మంజూరు చేయాలని కేంద్ర మంత్రిని ఈ సందర్భంగా సీఎం రేవంత్ అభ్యర్థించారు. హైదరాబాద్ - బెంగళూరు ఏరో డిఫెన్స్ కారిడార్ మంజూరు చేయాలని కోరారు. అలాగే హైదరాబాద్ - విజయవాడ పారిశ్రామిక కారిడార్ ఫిజిబిలిటీని అధ్యయనం చేస్తున్నట్లు కేంద్ర మంత్రి దృష్టికి ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి తీసుకెళ్లారు. ఆదిభట్లలో అత్యుత్తమ మౌలిక సదుపాయాలతో ప్రత్యేక రక్షణ, ఏరోస్పేస్ పార్కును తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు– చేసిందని.. ఈ నేపథ్యంలో హైదరాబాద్ - బెంగళూరు పారిశ్రామిక కారిడార్‌ను ఏరో–డిఫెన్స్ కారిడార్‌గా మంజూరు చేయాలని కేంద్ర మంత్రికి సీఎం విజ్ఞప్తి చేశారు. పెట్టుబడులకు సిద్ధంగా ఉన్న వంద ప్లగ్ అండ్ ప్లే పారిశ్రామిక పార్కుల అభివృద్ధికి సంబంధించిన ప్రతిపాదనలు సమర్పిస్తామని.. వాటికి సైతం మోదీ ప్రభుత్వం మద్దతుగా నిలవాలని ఈ సందర్భంగా కేంద్ర మంత్రి పీయుష్ గోయెల్‌ను సీఎం రేవంత్ రెడ్డి కోరారు.

మొదటి పేజీ తరువాయి

# నీట మునిగిన బ్యాంకుకు కాపలా

అక్కడి సియతి గ్రామంలో జూన్ 30న అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో పెద్ద కొండచరియ విరిగిపడింది. ఆ గ్రామస్థుడు ఒకరు మాట్లాడుతూ.. 'మా ఇంటి రెండోఅంతస్తులో ప్రతిరోజు ఓ శునకం నిద్ర పోతుంది. అయితే ఆరోజు ఉన్నట్టుండి అది విపరీతంగా అరవడం మొదలుపెట్టింది. మరోవైపు కుంభవృష్టి వర్షం కురుస్తోంది. ఆ అరుపుల శబ్దానికి నేను లేచి దాని దగ్గరకు వెళ్లాను. పైకి వెళ్లగా ఇంటిగోడకు పగుళ్లు కనిపించాయి. ఇంట్లోకి నీరు రావడం మొదలైంది. దాంతో వెంటనే కుక్కను కూడా కిందికి తీసుకెళ్లి, అందరినీ నిద్ర లేపాను. ఇంటి చుట్టుపక్కల వాళ్ల ఇళ్లకు వెళ్లి వారిని కూడా లేపి, సురక్షిత ప్రాంతానికి వెళ్లమని చెప్పాను. అలా దూరంగా వెళ్లామో, లేదో.. మా గ్రామంపై కొండచరియ విరిగిపడింది. పదుల సంఖ్యలో ఇళ్లు దానికింద నేలమట్టం అయ్యాయి. ఒక నాలుగైదు ఇళ్లు మాత్రం దెబ్బతినకుండా కనిపించాయని ఆయన వెల్లడించారు. ఇళ్లు ధ్వంసం కావడంతో గ్రామస్థులంతా తియంబాలా గ్రామంలోని నైనాదేవి ఆలయంలో ఆశ్రయం పొందుతున్నారు. సర్వం కోల్పోవడంతో అంతా నిరాశలో మునిగిపోయారు. కొందరు హైబీపీతో బాధ పడుతున్నారు

# మభ్య పెట్టలేరు

మొదటి పేజీ తరువాయి

ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ.. రూ. లక్ష రుణమాఫీ విషయంలో మాజీ సిఎం కెసిఆర్ రెండుసార్లు మోసం చేశారని మండిపడ్డారు. తొలిసారి రుణమాఫీ పూర్తి చేసేందుకు ఐదేళ్ల సమయం తీసుకున్నారని విమర్శించారు. బిఆర్ఎస్ నేతలు పదేళ్లలో రూ.లక్ష కోట్లు– దోచుకున్నారని ధ్వజమెత్తారు. రాష్ట్రం వాళ్ల సొత్తు అన్నట్లు– కేసీఆర్ కుటుంబం వ్యవహరిస్తోందని సీఎం రేవంత్ రెడ్డి సలహాదారు, మాజీ ఎమ్మెల్యే వేం నరేందర్ రెడ్డి మండిపడ్డారు. 'తెలంగాణలో సంక్షేమ పనులు అభివృద్ధిని చూడలేని గత పాలకులు అవాకులు చెవాకులు పేలుతున్నారు. పేదలు తినే ప్రతి బుక్కలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం కనబడుతుంది. గత పదేళ్లలో ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదు. 14వ తేదీన 40 లక్షల మందికి రేషన్ కార్డులు ఇస్తున్నాం. కాంగ్రెస్ ప్రభుత్వం కష్టపడి పని చేస్తుంది. ప్రతీ కాంగ్రెస్ కార్యకర్త గర్వంగా గల్లా ఎగిరేసుకోవచ్చని నరేందర్ రెడ్డి పేర్కొన్నారు. మహబూబాబాద్ జిల్లాలో 'ప్రజాపాలన ప్రగతిబాట' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మున్సిపాలిటీ– కేంద్రంలో ప్రజాపాలన ప్రగతిబాట బహిరంగ సభలో మంత్రి సీతక్క మాట్లాడుతూ... 'ద్వాక్రా మహిళలకు 25 వేల కోట్ల రూపాయలు వడ్డీలేని రుణాలు అందజేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిది. మహబూబాబాద్ నగరంలో మహిళ శక్తి భవనాన్ని ఏర్పాటు– చేస్తున్నాం. మహిళల కోసం 500 రూపాయలకు గ్యాస్ ఇస్తున్నాం. మహిళల సంక్షేమం ఇందిరమ్మ రాజ్య లక్ష్యం. ఆడబిడ్డలు సంతోషంగా ఉంటే ఆ ఇళ్ళు, ఊరు బాగుంటు–ంది. పేదలు కరెంట్ బిల్లులు కట్టలేదని విద్యుత్ సరఫరా నిలిపివేసిన చరిత్ర గత బీఆర్ఎస్ ప్రభుత్వానిది. మా ప్రభుత్వం అదే పేదలకు ఉచిత విద్యుత్ ఇస్తుందని పేర్కొన్నారు. ప్రతిపక్షాలు తప్పుడు ప్రచారం చేస్తున్నాయి. కాంగ్రెస్ చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక పోతున్నాయి. గత పాలకుల కుటుంబాలు కోటీశ్వరులు అయ్యారు తప్ప.. పేదల బతుకులు బాగుపడలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలు గుర్తు పెట్టుకోవాలి. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ఆశీర్వదించాలని మంత్రి కొండా సురేఖ అన్నారు.

# జులై 9, 2025న జరిగే దేశవ్యాప్త సమ్మెకు తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అసోసియేషన్ సభ్యుల సహభాగితా పిలుపు

**సమయజ్యోతి న్యూస్ అదిలాబాద్**

దేశవ్యాప్తంగా జులై 9, 2025 న జరగనున్న సమ్మెలో తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అసోసియేషన్‌కు చెందిన అన్ని శాఖల సభ్యులు తప్పనిసరిగా పాల్గొనాలని పిలుపునిచ్చారు.రాష్ట్రశాఖ పిలుపు మేరకు, ఆదిలాబాద్ జిల్లా పెన్షనర్స్ సంఘం, ఆదిలాబాద్ అధ్యక్షులు శ్రీ ఎస్. శశికాంత్ గారు సభ్యులు మరియు అభిమానులు సమ్మెకు పూర్తి స్థాయిలో మద్దతు తెలపాలని, విజయవంతం చేయాలని కోరారు. ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం కార్మికులు మరియు పెన్షనర్లకు వ్యతిరేకంగా, కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా విధానాలు అమలు చేస్తోందని ఆయన విమర్శించారు. అలాంటి విధానాలకు వ్యతిరేకంగా ఈ సమ్మెలో పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు.సంఘం ప్రధానంగా పాత పెన్షన్ విధానాన్ని తిరిగి అమలు చేయాలని, కనీస పెన్షన్‌ను రూ.13,000కి పెంచాలని, పెండింగ్‌లో ఉన్న డి.ఏ.లను విడుదల చేయాలని, సీనియర్ సిటిజన్లకు రైల్వేలో 50% రాయితీ మళ్లీ కల్పించాలని, కార్పొరేట్ ఆసుపత్రుల్లో పెన్షనర్లకు %జు.న.వా%. ద్వారా వైద్య సౌకర్యాలు అందించాలని, రిటైర్డ్ పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్నారు.ఈ పిలుపును జిల్లా అధ్యక్షులు ఎస్. శశికాంత్, కార్యదర్శి జగన్మోహన్, గౌరవాధ్యక్షులు నూతుల దయాకర్ రెడ్డి, బాపురావు, అశోక్ వైద్య, గాలిపెల్లి దేవీదాస్, సామల రాజవర్ధన్, ఉమాకాంత్, కాళ్ల పురుషోత్తం తదితరులు సంయుక్తంగా ఇచ్చారు.

దక్షిణ మధ్య రైల్వే
Follow us on X @SCRailwayindia
ద.మం. రైల్వే యొక్క టెండరు ప్రకటనల వివరాలను మా వెబ్‌సైట్ www.scr.indianrailways.gov.in పై చూడవచ్చును

నం NW / 148 / WLLL / టెండర్ నోటీసు/ 2025-26, తేదీ: 05.07.2025
PUB/0818/25

ఇప్పటికే www.ireps.gov.in వద్ద అప్‌లోడ్ చేయబడిన టెండర్ వివరాలు

Sl. నం: 1, టెండర్ నెం.: టి -202526-1-038, అధికారం: కో-ఆర్డ్, టెండర్ విలువ రూ.: 16,40,37,888.00, ఎర్నెస్ట్ డబ్బు 9,70,200.00 పూర్తి కాలం: అరవై ఆరు (66) నెలలు, పని యొక్క వివరణ: నాండెడ్ డివిజన్: - వక్రతలపై ట్రాక్ మౌంటెడ్ ఆటోమేటిక్ గేజ్ ఫేస్ కందెనల సంస్థాపన - 120 సంఖ్యలు (అనుబంధం ప్రకారం స్థానాలు). IRPSM ప్రాజెక్ట్ ID: 11.04.31 .23.1.53 .010 మరియు 2023-24 యొక్క పిబి నం 904/ ఎస్ఆర్), టెండర్ రూపం రూ .: 0

Sl. నం: 1, టెండర్ నెం.: టి -202526-1-038, పని యొక్క సారూప్య స్వభావం (50 లక్షల కంటే ఎక్కువ ఖర్చు చేయడానికి): సారూప్య సేవల యొక్క గత అనుభవం (సాంకేతిక అర్హత ప్రమాణాలు): ఫైనాన్స్ డైరెక్టరేట్కు అనుగుణంగా బోర్డు (MI), "ట్రాక్ బేస్డ్ లొంగిపోయేట" సేవా టెండర్ కోసం సేవలకు కాంట్రాక్టు యొక్క సాధారణ పరిస్థితులలో ఇవ్వబడిన కనీస అర్హత ప్రమాణాలతో పంపిణీ చేయాలని నిర్ణయించింది. ఏదేమైనా, రైల్వే బోర్డ్ లెటర్ నెం: 2023/ట్రాక్- I (పి)/RDSO తేదీ 17.02.2023 మరియు 12.03.2024 ప్రకారం సేవల కోసం కాంట్రాక్ట్ యొక్క ప్రామాణిక సాధారణ పరిస్థితులలో ఇచ్చిన ఆర్థిక అర్హత ప్రమాణాలు మారవు. టెండరర్ "ఆటోమేటిక్ గేజ్ ఫేస్ కందెనలపై వక్రత (ఎలక్ట్రానిక్ రకం)" కోసం RDSO ఆమోదానికి సంబంధించిన పత్రాలను సమర్పించాలి.

పై టెండర్ 28/07/2025 న 15:00 గంటలకు మూసివేయబడుతుంది.
sr. డెన్ / కో - ఆర్డ్ / నాండెడ్

నం NW / 148 / WLLL / టెండర్ నోటీసు/ 2025-26, తేదీ: 07.07.2025
PUB/0820/25

ఇప్పటికే www.ireps.gov.in వద్ద అప్‌లోడ్ చేయబడిన టెండర్ వివరాలు

Sl. లేదు.: 1, టెండర్ నెం: టి -202526-3 - 030, అధికారం: కో- ఆర్డ్, టెండర్ విలువ రూ.5000000.00 రూ. 100000.00 పూర్తి కాలం: పన్నెండు నెలలు, పని యొక్క వివరణ: వంతెన జోనల్ సీనియర్ ఎన్/వెస్ట్/నెడ్ అధికార పరిధిలో పనిచేస్తుంది. సెక్షన్ MMR-PBN (మన్మాడ్ మరియు పర్భా ని మినహా), రూ .0 లో టెండర్ రూపం ఖర్చు

Sl. లేదు.: 2, టెండర్ నెం: టి -202526-3 - 031, అధికారం: కో-ఆర్డ్, టెండర్ విలువ రూ. 5000000.00, రూ. 100000.00 పూర్తి కాలం: పన్నెండు నెలలు, పని యొక్క వివరణ: వంతెన జోనల్ అడెన్/పావు అధికార పరిధిలో పనిచేస్తుంది., టెండర్ రూపం యొక్క ఖర్చు రూ .: 0

Sl. నం 3, టెండర్ నెం. టి -202526-1-032, అథారిటీ. కో-ఆర్డ్, టెండర్ వాల్యూన్ రూ. 5000000.00 రూ. 100000.00 పూర్తి కాలం: పన్నెండు నెలలు,పని యొక్క వివరణ: జోన్ వర్క్స్ - స్పేబ్రి/పావు సెక్షియన్ కింద నాండెడ్ డివిజన్ యొక్క వార్షిక విభాగం కాంట్రాక్ట్స్., టెండర్ రూపం యొక్క ఖర్చు రూ .: 0

Sl. లేదు.: 4, టెండర్ నెం: టి -202526-3-033, అధికారం: కో-ఆర్డ్, టెండర్ విలువ రూ .1,78,47,999.93, రూ. 2,39,200.00,పూర్తి కాలం పన్నెండు నెలలు,పని యొక్క వివరణ. జోన్ వర్క్స్ - 2025-26 సంవత్స-రానికి నాండెడ్ డివిజన్ యొక్క వార్షిక విభాగం కాంట్రాక్టులు - పూర్ణ స్టేషన్, సర్వీస్ బిల్డింగ్ మరియు కాలనీల కోసం జోనల్ వర్క్స్., టెండర్ రూపం యొక్క ఖర్చు రూ. 0

Sl. నెం: 5, టెండర్ నెం: టి -202526-3-034, అధికారం: కో-ఆర్డ్, టెండర్ విలువ రూ : 23227999.82 లో ఎర్నెస్ట్ డబ్బు రూ: 266100.00 పూర్తి కాలం: పన్నెండు నెలలు పని యొక్క వివరణ: మన్మాడ్ కోసం జోనల్ వర్క్స్ టు కర్మద్ (నాండెడ్ డివిజన్ యొక్క మన్మాడ్ వద్ద సిబ్బంది క్వార్టర్స్ మరియు సేవా భవనాలతో సహా), స్టేషన్, స్టాఫ్ క్వార్టర్స్ మరియు సేవా భవనాలు., టెండర్ ఫారం ఖర్చు .: 0

Sl. నం.: 6, టెండర్ నెం: టి -202526-3-035, అధికారం: కో-ఆర్డ్, టెండర్ విలువ రూ. 14273999.66 లో ఎర్నెస్ట్ మనీ. రూ .221400.00 పూర్తి కాలం: పన్నెండు నెలలు, పని యొక్క వివరణ: జోన్ వర్క్స్ - 2025-26 సంవత్సరానికి నాండెడ్ డివిజన్ యొక్క వార్షిక విభాగం కాంట్రాక్టులు - పూణకు మాల్సాయిలు (పూర్నా మినహా మరియు మాల్సెలు మినహా) స్టేషన్, సేవా భవనం మరియు కాలనీలకు జోనల్ వర్క్స్. రూ .: 0 లో టెండర్ రూపం ఖర్చు

Sl. నం.: 7, టెండర్ నెం: టి -202526-3-036, అధికారం: కోఆర్ ఆర్డ్, టెండర్ విలువ రూ. 13387999.82, ఎర్నెస్ట్ డబ్బు రూ. 21 -6900.00 పూర్తి కాలం: పన్నెండు నెలలు, పని యొక్క వివరణ: ప్యూమా-పార్భా ని-పార్లీ వైజ్నాథ్ (పర్భానితో సహా పూణను మినహాయించి, పార్లీ వైజనాథ్ మినహా) స్టేషన్, సేవా భవనం మరియు కాలనీల కోసం జోనల్ వర్క్స్., టెండర్ రూపం .: 0

Sl. నం.: 8, టెండర్ నెం: టి -202526-3-037, అధికారం: కో-ఆర్డ్,టెండర్ విలువ రూ .23327999.72 లో , ఎర్నెస్ట్ డబ్బు రూ .266600.00 లో పూర్తి కాలం: పన్నెండు నెలలు, పని యొక్క వివరణ: జోన్ వర్క్స్ - 2025-26 సంవత్సరానికి నాండెడ్ డివిజన్ యొక్క వార్షిక విభాగం కాంట్రాక్టులు: కర్మద్ కోసం పర్భా ని నుండి జోనల్ వర్క్స్ (కర్మద్ మరియు పర్భా ని మినహా) స్టేషన్, సేవా భవనం మరియు కాలనీలు, టెండర్ రూపం రూ. 0

Sl. నం.: 1,2,3 టెండర్ నెం: టి -202526-3- 030, టి -202526-3-031, టి -2025 26 -1-032, పని యొక్క సారూప్య స్వభావం (50 లక్షల కంటే ఎక్కువ ఖర్చు చేయడానికి) పై పని రూ. 50.00 లక్షలు, అందువల్ల అర్హత ప్రమాణాలు అవసరం లేదు

Sl. నెం: 4,5,6,7,8, టెండర్ నెం: టి- 202526-3-033 , 202526-3-034, 202526-3-035, 202526-3-036, 202526-3-037, పని యొక్క సారూప్య స్వభావం ( 50 లక్షల కంటే ఎక్కువ ఖర్చు చేయడానికి) ఏదైనా సివిల్ ఇంజనీరింగ్ పని/జోనల్ నిర్వహణ పనులు

పై టెండర్ 31.07.2025 న 15.00 గంటలకు మూసివేయబడుతుంది.
A1017 Sr. డెన్ / కో - ఆర్డ్ / నాండెడ్

మరింత టెండర్ షరతులు/వివరాల కోసం మరియు టెండర్ పత్రాలను డౌన్ లోడ్ చేయడానికి, దయచేసి వెబ్‌సైట్‌ను https://www.ireps.gov.in లేదా www.scr.indianrailways.gov.in వద్ద సందర్శించండి

# బాధితులకు సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత

**సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి బాల్కొండ**

బాల్కొండ మండల కేంద్రంలో మంగళవారము బిఆర్ఎస్ మండల అధ్యక్షులు బద్దం ప్రవీణ్ రెడ్డి, పట్టణ అధ్యక్షులు సిరికంటి సాగర్ యాదవ్, మండల యూత్ అధ్యక్షులు గాండ్ల రాజేష్ చేతుల మీదుగా ఐదుగురి బాధితులకు 92,000 విలువైన సీఎంఆర్ఎప్ చెక్కులను అందజేశారు. దీనికి చొరవ తీసుకున్న ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు షాహిద్, మాజీ ఎంపీటీసీ రాంరాజ్ గౌడ్, కన్న పోశెట్టి, సొసైటీ డైరెక్టర్ ప్రసాద్ గౌడ్, మాజీ మార్కెట్ వైస్ చైర్మన్ వేంపల్లి చిన్న రాజేశ్వర్, కాల గంగారాం, హాస్టల్ రియాజ్ పాల్గొన్నారు.



# వైయస్ రాజశేఖర్ రెడ్డి సేవలు చిరస్మరణీయం

## : వక్తలు తాహెర్ బిన్, కేశవ వేణు, రాంభూపాల్

**సమయజ్యోతి న్యూస్ నిజామాబాద్ బ్యూరో**

దివంగత సీఎం వైయస్ రాజశేఖర్ రెడ్డి సేవలు చిరస్మరణీయమని బడుగు బలహీన వర్గాల ప్రజలకు ఎన్నో సంక్షేమ పథకాల అమలు చేశారని, రాష్ట్ర అభివృద్ధి కోసం ఎంతో కృషి చేశారని వక్తలు ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, నూడా చైర్మన్ కేశ వేణు, రామ్ భూపాల్ పేర్కొన్నారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారము నగర కాంగ్రెస్ ఆధ్వర్యంలో దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతి వేడుకలను నిర్వహించిన సందర్భంగా వారు ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. దీనికి ముందుగా వైఎస్ చిత్రపటానికి పూలమాలలు సమర్పించి నివాళులు అర్పించారు. దేశంలోనే వినుత్న రీతిలో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారని, అభివృద్ధి పనులు చేపట్టారని, రైతులకు వెన్నుదన్నుగా నిలిచారని,పంట రుణాల మాఫీ, విద్యుత్ బకాయిల మాఫీ, ఉచిత విద్యుత్, ఉన్నత చదువుల కోసం రియంబర్స్మెంట్, ఐటీ రంగానికి ప్రోత్సాహం అందించారని, జిల్లాకు ఎత్తిపోతల ద్వారా సాగు తాగు నీరు అందించారని కొనియాడారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎన్ ఎస్ యుఐ ప్రధాన కార్యదర్శి వేణు రాజ్, జిల్లా ఎస్టి సెల్ అధ్యక్షులు యాదగిరి, సేవాదళ్



అధ్యక్షులు సంతోష్, జిల్లా మత్స్య సహకార చైర్మన్ శ్రీనివాస్, నగర ఎస్సీ సెల్ అధ్యక్షులు వినయ్, జిల్లా ప్రతినిధి లవంగ ప్రమోద్, స్వామి గౌడ్, ముశ్షు పటేల్, సంగెం సాయిలు పాల్గొన్నారు.

# ఎస్సై శైలేంద్రకు సన్మానం

**సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి బాల్కొండ**

బాల్కొండ మండల కేంద్రంలో మంగళవారం ఎస్సై కే.సైలేంద్రను పట్టణ అధ్యక్షుడు సంజీవ్ గౌడ్, యూత్ మండలాధ్యక్షుడు తౌట్ అరవింద్, యూత్ మండల ఉపాధ్యక్షుడు వివేక్ విక్కీ, మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు కుందారం శ్రీనివాస్, మొహమ్మద్యునుస్, సంతోష్ గౌడ్, పిట్ల తేజ, గోపు ఉషన్న, సన్నిత్ యాదవ్, వినేష్, నవీన్ కుమార్, సయ్యద్ ఇంతియాజ్, షేరు పాల్గొన్నారు



# లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కంటి వైద్య శిబిరం

**సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి బాల్కొండ**

బాల్కొండ మండలం కిసాన్ నగర్ లోని లయన్స్ భవన్ లో మంగళవారం బాల్కొండ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. నిజామాబాద్ లయన్స్ కంటి ఆసుపత్రి వైద్యురాలు డాక్టర్ ప్రవల్లిక 20 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. మోతి బిందు ఉన్నవారిని గుర్తించి శస్త్ర చికిత్సల కోసం ఆర్మూర్ లయన్స్ కంటి ఆసుపత్రికి తరలించారు. లయన్స్ క్లబ్ జిల్లా చైర్మన్ చాకులింగం, బాల్కొండ అధ్యక్షుడు దినేష్ పటేల్, జ్ఞాన సాగర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# స్థానికుల సమస్యలను పరిష్కరించండి

## కార్పొరేటర్ పుష్పానగేష్

**సమయజ్యోతి న్యూస్ రామచంద్రాపురం**

రామచంద్రపురం డివిజన్ శ్రీనివాస్ నగర్ కాలనీ 10 వ బ్లాక్ వాసుల సమస్యలను పరిష్కరించమని కార్పొరేటర్ పుష్పానగేష్ అన్నారు 10 వ బ్లాక్ లో నూతనంగా వేసిన సీవరేజ్ పైప్ లైన్ లో పలు చోట్ల సరిపోయే మాన్హోల్ వెయ్యలేరని స్థానికుల వినతి మేరకు మంగళవారం జలమండలి అధికారులతో కలిసి పర్యటించి స్థానికుల సమస్యలు పరిష్కరించాలని అన్నారు త్వరలోనే రోడ్ పనులు ప్రారంభం కానున్నాయని అందరు త్వరత్వరగా తమతమ ఇంటర్నల్ లైన్ లను నూతనంగా వేసిన కొత్త పైప్ లైన్ లో కలుపుకోవాలని జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ సభ్యులు స్థానిక రామచంద్రపురం కార్పొరేటర్ బూరుగడ్డ పుష్పనగేష్ తెలిపారు వారితో స్థానికులు పాల్గొన్నారు



# జిల్లా వైద్యాధికారి.. ప్రతిపాదిత నూతన ఆసుపత్రి స్థలా పరిశీలన

**సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి బాల్కొండ**

నిజామాబాద్ జిల్లా వైద్యాధికారిని డా.రాజశ్రీ, ముప్కాల్ లో ప్రతిపాదిత నూతన హాస్పిటల్ స్థలాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా ఉపవైద్యాధికారి రమేష్, వైద్యాధికారులు రాజు, రాకేష్, ఈఈ రాజేశ్వర్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు,



# బీడు భూముల సస్యశ్యామలం వైఎస్ వల్లే..

**సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి వనపర్తి**


బీడు భూములు సస్యశ్యామలం అయ్యాయని వైయస్ చొరవతోనే ఉమ్మడి పాలమూరు జిల్లాల బీడు భూములు సస్యశ్యామలం అయ్యాయని వనపర్తి జిల్లా కాంగ్రెస్ కిసాన్ అధ్యక్షులు వేముల శ్రీనివాసరెడ్డి, జిల్లా కేంద్రంలో మంగళవారం వైఎస్ఆర్ జయంతి సందర్భంగా పేర్కొన్నారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలో 8 లక్షల ఎకరాలకు సాగునీరు లక్ష్యంగా కల్వకుర్తి, బీమా ఎత్తిపోతల పథకం, నెట్టెంపాడు, కోయిల్ సాగర్, శంకర్ సముద్రం, రంగసముద్రం, సంగం బండ రిజర్వాయర్ల నిర్మాణాలు పూర్తి చేసి, పసిడి పంటలు పండిస్తున్నారని, వైద్య విద్య ఉపాధి రంగాలకు అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలు అమలు చేశారని పేర్కొన్నారు.



# బోథ్ ప్రభుత్వ సామాజిక ఆసుపత్రి ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ రాజర్షి షా

**సమయజ్యోతి న్యూస్ జూలై 08 బజార్ హత్నూర్ బోథ్**

బోథ్ ప్రభుత్వ సివిల్ ఆసుపత్రి ని జిల్లా కలెక్టర్ రాజర్షి షా ఆకస్మికంగా తనిఖీ చేసి ఆసుపత్రి లో పలు రికార్డులు పరిశీలించి సిబ్బంది సమయ పాలన పాటించని వారి పై ఆగ్రహం వ్యక్తం చేశారు.నిర్మాణం లో ఉన్న ఆసుపత్రి భవనాన్ని పరిశీలించి సదరు గుత్తేదరుతో మాట్లాడి తొందరగా పనులు పూర్తి చేయాలనీ ఆదేశించారు.అనంతరం ఆసుపత్రి లోని రోగులను పలకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రోగులకు మెరుగైన వైద్యం అందించాలని ఆసుపత్రి డాక్టర్ ఆదేశించారు అనంతరం ల్యాబ్ ను సందర్శించి సీజనల్ వ్యాధులు వర్ష కాలం వస్తాయని ల్యాబ్ సిబ్బంది అప్రమత్తం గా ఉండాలని, సమయ పాలన పాటించాలని మూడు షిఫ్ట్ లుగా విధులు నిర్వహించాలని ఆదేశించారు, బయోమెట్రిక్ విధానం అమర్చాలామి సూచించారు,అంతే కాకుండా ఇంకా నూతన ల్యాబ్,బ్లడ్ బ్యాంకు సోకార్యం కోసం, ఇతర సౌకర్యాలు కల్పన కోసం7కోట్ల నిధులు కేటాయించామని వాటికి త్వరలోనే టెండర్ లు పిలుస్తామని అన్నారు ముఖ్యంగా గిరిజనులు ఉండే ప్రాంతం కావున వైద్యులు అప్రమత్తం గా ఉండాలని,మరియు వార్డులో బయట సీసీ కెమెరాలు అమర్చాలని స్థానిక ఏస్ఐ కి సూచించారు ఈ కార్యక్రమం లో బోథ్ మార్కెట్ కమిటీ చేర్మెన్ బొడ్డు గంగారెడ్డి,ఆత్మ కమిటీ చేర్మెన్ గొర్ల రాజు యాదవ్,కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి పసుల చంటి తదితరులు పాల్గొన్నారు



# మానవతా మూర్తి..

## 2.48 లక్షల నగదు అప్పగింత

**సమయజ్యోతి న్యూస్ నిర్మల్ బ్యూరో జూలై 08.**

నిర్మల్ పట్టణం లోని ఆదర్శనగర్ కి చెందిన విజయ్ కుమార్ అనే వ్యక్తి తన నిజాయితీతో అందరికీ ఆదర్శంగా నిలిచారు. తను బస్టాండ్ నుండి ఇంటికి వెళ్తున్న సమయంలో జిల్లాలోని కోర్టు వద్ద హెూండా షైన్ బైక్పై వెళ్తున్న ఓ వ్యక్తి అనుకోకుండా రెండు లక్షల నలభై ఎనిమిది వేల రూపాయల నగదును కింద పడేసుకున్నారు. ఈ విషయాన్ని గమనించిన విజయ్ కుమార్ వెంటనే ఆ వాహనదారుని పలుమార్లు పిలిచినా, ఆయన పట్టించుకోకుండా ముందుకు వెళ్లిపోయారు.దీంతో ఆయన వెంటనే ఈ విషయాన్ని ఇంటలిజెన్స్ ఎస్ఐ సాయన్ రావ్ కు తెలియజేసి, దొరికిన నగదును అప్పజెప్పాడు.ఈ నిజాయితీతో కూడిన చర్యను జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల హర్షిస్తూ విజయ్ కుమార్‌ను ప్రత్యేకంగా అభినందించారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డా: జి. జానకి షర్మిల మాట్లాడుతూ.."ఇలాంటి నిజాయితీ గల వ్యక్తులు సమాజానికి ఆదర్శం, సమాజం లో ప్రతి ఒక్కరు అన్ని విషయాల్లోనూ బాధ్యతగా ప్రవర్తించాలి, ఇలాంటి వారి వల్లే మంచి విలువలు చిరస్థాయిగా నిలిచిపోతాయి," అని పేర్కొన్నారు.



# పట్టణంలో వైయస్ రాజశేఖర్ రెడ్డి జయంతి జరుపుకున్న కాంగ్రెస్ శ్రేణులు

**సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి మందమర్రి**

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి 76వ జయంతిని పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు కేక్ కట్ చేసి మిఠాయిలు పంచుకుంటు నిర్వహించుకోవడం జరిగింది. ఈ సందర్భంగా సీనియర్ నాయకులు సొతుకు సుదర్శన్, పైడిమల్ల నర్సింగ్ లు మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా వైయస్ రాజశేఖర్ రెడ్డి ఎన్నో సంక్షేమ పథకాలను తీసుకురావడం జరిగిందని ముఖ్యంగా ఎల్లంపల్లి జైపూర్ పవర్ ప్లాంట్. 108 రాజీవ్ ఆరోగ్యశ్రీ. ఫీజు రియంబస్ మెంట్, ఇందిరమ్మ ఇల్లు. 200 రూపాయలు పెన్షన్, రేషన్ కార్డులు, పేదలకు 9 రకాల నిత్యవసర సరుకులు, ఉపాధి కల్పన, ఎన్నో సంక్షేమ పథకాలను తీసుకువచ్చిన ఘనత వైయస్సార్ ది అని అన్నారు. వైయస్సార్ లాంటి నాయకులు చాలా అరుదుగా ఉంటారని అలాంటి నాయకులు మన మధ్య లేనందుకు బాధాకరమని ఆయన అడుగుజాడలో ప్రతి కార్యకర్త నడవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సి, సేవాదళ్ పట్టణ అధ్యక్షులు నెరువట్ల శ్రీనివాస్, సొతుకు ఉదయ్ కుమార్, సీనియర్ నాయకులు కడలి శ్రీనివాస్, మాయ తిరుపతి యాదవ్, ఆలం శంకర్, గోగుల రాజయ్య, ఎర్ర రాజు, ముడారపు శేఖర్, విజయ్, ఎండి షరీఫ్, రాచర్ల రవి, బీరం శ్రీనివాస్, పోలు సంపత్, రాకం సంతోష్, రంజిత్, వేణుగోపాల చారి, రాం రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



సమయజ్యోతి తెలుగు దినపత్రిక

## సంపాదకీయం

# ఎన్‌డిఏ పక్షాల డమ్మీ పాత్ర!

పేరుకే ఎన్‌డిఎ పాలన అయినా..కేవలం మోడీ పాలనే సాగుతోంది. వరుసగా మూడో దఫా మోడీ ప్రధాని కావడానికి ఎన్‌డిఎ పక్షాల మద్దతు అవసరం అయినా...పాలనా పగ్గాలు మోడీ చేతుల్లోనే ఉన్నాయి. మోడీ కనుసన్నల్లోనే పాలన సాగుతోంది. ఎన్‌డిఎ భాగస్వామ్య పక్షాలతో ఏ విసయంలోనూ చర్చలు సాగడం లేదు. గతంలో వాజ్‌పేయ్ హయాంలో తరచూ ప్రధాన అంశాలపై చర్చించేవారు. కానీ ఇప్పుడు పదేళ్లలో ఎలా ఉండే ఇప్పుడూ అలానే ఉంది. ఎన్‌డిఎ పక్షాలు కూడా ఇదేమిటని అడిగే ధైర్యం చేయడం లేదు. ప్రధాన సమస్యలపైన చర్చకు పట్టపబట్టడం లేదు. చంద్రబాబు లౌక్యంగా ఎపి వరకే పరిమితం అయ్యారు. నితీశ్ కుమార్ బీహార్‌కు పరిమితం అయ్యారు. ఎపిలో మిర్చి, మామిడి, ధాన్యం ధరల సమస్యలు వస్తున్నా జాతీయ విధానం గురించి చర్చించే ఆలోచన చేయడం లేదు. కొత్తగా ఏర్పడ్డ ఎన్‌డి కూటమినేతలు ఈ విషయంలో ఆలోచన చేయాలి. మోడీ నిర్ణయాలకు తలూపకుండా క్షేత్రస్థాయిలో సమస్యలు తెలుసుకుని, అందుకు పరిష్కార మార్గాలను కనుగొనాలి. ఇలా విద్య,వైద్యం, మౌళిక వసతులు, రోడ్లు తదితర అంశాల పై జాతీయస్థాయిలో చర్చించి ప్రజలకు అనువైన నిర్ణయాలు తీసుకోవాలి. కానీ ఎన్‌డిఎ భాగస్వామ్య పక్షాలు కేవలం డమ్మీ పాత్ర పోషిస్తున్నాయి. విద్యారంగంలో మార్పులు రావాల్సి ఉంది. ఇప్పుడున్న విద్యావిధానం ఉద్యోగాలను, ఉపాధిని చూపడం లేదు. విదేశాలకు వెళ్లి చదువుకుందామనుకుంటే ఖరీదైనదిగా ఆమరింది. దేశంలో విద్య ఖరీదైనదిగా మారింది. విదేశీ విద్య కూడా ఖరీదీయినదిగా మారింది. ఈ క్రమంలో విద్యారంగ సంస్కరణలు రావాలి. విదేశాలకు వెళ్లి చదువుకునే వారికి ఇతోధికంగా రుణాలు ఇవ్వాలి. పెరిగిన డాలర్ విలువ, రూపాయి పతనంతో వదేశీ మారకం కోసం విద్యార్థులు, టూరిస్టులు అధికంగా రూపాయలు ఖర్చు చేయాల్సి వస్తోంది. బేటీపడావో బేటీ బచావో అంటున్న ప్రధాని మోడీ కనీసం ఆడపిల్లల చదువుల ఖర్చుల గురించి ఆలోచించడం లేదు. ఆడపిల్లలను చదివించడం కూడా భారంగా మారుతోంది. దేశీయంగా కూడా చదువులు భారంగా మారాయి. విదేశాలకు వెళుతున్న ఆడపిల్లలకు కనీసం వడ్డీ మాఫీ పథకం వర్తింప చేయాలన్న డిమాండ్ పట్టించు కోవడం లేదు. ప్రస్తుత ఆర్థిక పరిస్థితుల్లో వడ్డీలేని రుణాలను లేదా నామమాత్రం వడ్డీతో దేశీయంగా, విదేశాల్లో ..ఉన్నత చదువులకు ఆర్థిక సాయం అందించే లా పథకాలు రూపొందాల్సి ఉంది. కార్పోరేట్ కంపెనీలకు వేలకోట్లు పందేరం చేస్తున్న ప్రభుత్వం విద్యారంగంలో మాత్రం వెసలుబాటు చూపడం లేదు. ఇక్కడ ఉన్నత చదువులకు, విదేశాల్లో ఉన్నత చదువులకు ఖర్చు తడిసి మోపెడు అవుతోంది. దీనిపై కేంద్రం ఎక్కడా చర్చించడం లేదు. బ్యాంకులు ఉదారంగా, తక్కువ వడ్డీ రుణాలు అందించడం లేదు. విదేశీ విద్యకోసం రుణాలకు వెళ్లే వారికి నేరుగా రుణాలు లభ్యం కావడం లేదు. సవాలక్ష కొర్రీలు పెట్టి బ్యాంకులు తిరస్కరిస్తున్నాయి. మరోవైపు భారత ఆర్థికవ్యవస్థ కుదేలు కావడంతో పాటు,ద్రవ్యోల్బణం పెరగడంతో నిత్యావసర వస్తువుల ధరలు అమాంతంగా పెరుగుతున్నాయి. బంగారం ధరలు అందకుండా పోగుతున్నాయి. బంగారం అడ్డూఅదుపు లేకుండా పెరిగి పోతున్నా కారణాలు పట్టించుకుని చర్చించడం లేదు. వైద్య సేవల ధరలు భరించలేనంత విపరీతంగా పెరిగాయి. కార్పోరేట్ ఆస్పత్రుల దోపిడీతో సామాన్యులు కుదేలవుతున్నారు. వారిని ఎవ్వరూ పట్టించు కోవడం లేదు. మందుల ధరలు విపరీతంగా పెంచేస్తున్నా పట్టించుకోవడం లేదు. అలాగే పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు కూడా ఎప్పటికప్పుడు పెంచడంతో సామాన్యుల బతుకు భారంగా మారుతోంది. దీంతో సామాన్యులకు ఊరడింపు దక్కడం లేదు. పన్నుల భారం మోయలేక ప్రజల నడ్డి విరుగుతున్నది. కేంద్రం లోని నరేంద్రమోదీ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు ఆర్థికరంగాన్ని నిలబెట్టేలా లేవు. ఎడాపెడా పన్నులు విధించడంలో ఆర్థిక వ్యవస్థ ఇప్పుడు ఊపిరాడని స్థితికి చేరింది. ఇదంతా ఒక ఎత్తయితే విదేశీ విద్య చదువుకోవాలనే విద్యార్థులకు డాలర్ మారకం తీరని భారంగా మారింది. ఉన్నత చదువులకు వెళ్లాల నుకునే వారికి డాలర్ మారకం 86 రూపాయలకు పైనే కావడంతో తట్టుకోలేక పోతున్నారు. ఫీజులను డాలర్లలో చెల్లించాల్సి ఉంటుంది. దీంతో ఫీజలు భారం తడిసి మోపెడు అవుతోంది. ఏటా వేలాది మంది మనదేశం నుంచి అమెరికా, లండన్, ఆస్ట్రేలియా, కెనడా వంటి దేశాలకు వెళుతుంటారు. వీరికి డాలర్ ఒక్కటే శరణ్యం. డాలర్ రేటు పెరగడం వల్ల ప్రతి ఒక్క విద్యార్థిపై అదనపు భారం పడుతోంది. చదువుకుని తమకాళ్లమీద తాము నిలబడాలన్న లక్షలాది మంది విద్యార్థులకు ప్రభుత్వాల విధానాలు గుదిబండగా మారాయి. ఉన్నత చదువులు భారంగా మారుతున్నాయి. విదేశాలకు వెళ్లాలనుకున్న వారికి సవాల్‌గా మారింది. డబ్బున్నవాళ్లే చదువుకునేలా ప్రభుత్వ విధానాలు ఉన్నాయి. పేదలు, మధ్య తరగతి వాళ్లు ఎలాంటి ఒడిదుడుకులు లేకుండా విదేశాలకు వెళ్లి చదువుకునే పరిస్థితితులు కానరావడం లేదు. ఇవన్నీ కూడా ఎన్‌డిఎ పక్షాలు చర్చించాలి. మోడీతో చర్చించి తగు నిర్ణయాలు తీసుకోవాలి. ఇక్కడ ఇంజనీరింగ్, మెడిసిన్ పూర్తి చేసి లేదా ఇతర డిగ్రీలతో విదేశాలకు వెళ్లాలనుకున్న వారికి ప్రధానంగా రెండు సమస్యలు ఎదురవుతున్నాయి. ఒకటి రుణాల కోసం బ్యాంకుల చుట్టూ తిరగాల్సి వస్తోంది. బ్యాంకులు సజావుగా స్పందించడం లేదు. నానా కొర్రీలు పెట్టడంతో యాతన పడాల్సి వస్తోంది. డబ్బున్న వారికి రుణాలు అందుతున్నాయి. కానీ పేదలు, మధ్య తరగతి వారికి రుణాలు ఇవ్వడం లేదు. ఇకపోతే రుణం పొందినా.. దాని వడ్డీ తడిసి మోపెడు అవుతోంది. విదేశాలకు వెళ్లి, చదువు పూర్తి చేసుకుని, ఉద్యోగం సంపాదించి వచ్చే సరికి రుణభారం మోయలేనంతగా పెరుగుతోంది. దీంతో సంపాదన అంతా చదువుకోసం తీసుకున్న రుణాన్ని వడ్డీతో సహా చెల్లించడానికే సరిపోతుంది. దీనికి తోడు విదేశీయానం కూడా భారంగా మారింది. ఇంధన ధరల వల్ల విమానరంగం టిక్కెట్లను అమాంతంగా పెంచేసింది. దీంతో అమెరికా తదితర దేశాలకు వెళ్లాలనుకున్న వారికి టిక్కెట్లు భారంగా మారాయి. విదేశీ విద్య కావచ్చు, దేశీయంగా చదువుకునే విద్య కావచ్చు..సామాన్యులకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలి. విద్యార్థులు స్వశక్తిమీద బతికేలా చేయాలి. విదేశాలకు వెళ్లే విద్యార్థులకు రుణాలను ఉదరాంగా ఇచ్చేలా చూడాలి. అప్పుడే మన యువత తమకాళ్లమీద తాము నిలబడగలుగుతారు.దేశీయంగా ఉన్నత చదువులు చదివే వారికి, విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించేందుకు వెళ్లేవారి కోసం ప్రత్యేక నిర్ణయాలు తీసుకోవాలి. బ్యాంకులు నామమాత్రపు గ్యారెంటీతో,నామమాత్రపు వడ్డీతో రుణాలు ఇచ్చేలా విధానాలు సరళీకరించాలి. అందుకు కేద్రం వడ్డీ భరించే పథకాన్ని ప్రవేశ పెడితే మరీ మంచిది. ఈ అంశాలను చర్చించే ధైర్యం ఎన్‌డిఎ పక్షాలు చేయకపోవడం దారుణం కాక మరోటి కాదు.

# చాక్లెట్ కథ తెలుసుకుందాం




సమయజ్యోతి ప్రత్యేకం తెలుగు దినపత్రిక

చాక్లెట్ అనగానే చిన్న పిల్లలతో మొదలుకొని పెద్దల వరకూ అందరూ ఇష్టపడతారు.ఏ షాపుకు ఎక్కడికి వెళ్లినా దర్శనమిస్తుంది చాక్లెట్.మనోల్లాసంతోపాటు అద్భుతమైన ఆరోగ్యాన్ని ఇస్తుందని పరిశోధనల ద్వారా తేల్చి చెప్పారు.ఆలుమగలైనా, అత్తాకోడళ్ళైనా, ఆఫీసులో బాస్ కొలీగ్‌గైనా చాక్లెట్లవైపు మొగ్గు చూపిస్తే రోజంతా ఆరోగ్యం, ఆనందమే.

యూరోపియన్లకు చాక్లెట్లంటే తెగ ఇష్టం. ప్రపంచం మొత్తంలో సగం చాక్లెట్ల వినియోగం ఐరోపాలోనేజరుగుతుంది.ప్రపంచ వ్యాప్తంగా క్యాడ్బరీ, మార్స్, నెస్లే, ఫెరోరీ, హేర్షేస్, లిండిట్, ఎజిస్టాక్స్, ఆర్కార్, మెర్జీ, ఇడ్జీజీ కంపెనీలు టాప్ టెన్గా గుర్తింపు పొందాయి. ప్రపంచ వ్యాప్తంగా ఏటా పది లక్షల కోట్ల రూపాయల విలువైన చాక్లెట్ ఉత్పత్తులను వినియోగిస్తున్నారు.'అసోచామ్' సంస్థ గణాంకాల ప్రకారం మనగ్రామీణప్రాంతాల్లో చాక్లెట్ వ్యాపారం విలువ 750కోట్ల రూపాయలట సంవత్సరానికి. ఎందుకంటే చాక్లెట్ల రుచుల్లో సుమారు 600 రకాలు ఉంటాయట.

చాక్లెట్లు మొదటిసారిగా పరిచయం ఐరోపాలో 1550 జూలై 7న జరిగింది. అందుకే ఈ రోజును 'చాక్లెట్ డే'గా కేటాయించారు. 2009 నుంచి ప్రపంచ వ్యాప్తంగా ఈ వేడుకల్ని ఘనంగా చేసుకుంటున్నారు. చాక్లెట్ అంటే చాలు ముఖంపై చిరునవ్వు రావాల్సిందే. చాక్లెట్టున్న ఆరోగ్య ప్రయోజనాలు గుర్తించి కాబోలు జూలై 7ను ప్రపంచ చాక్లెట్ డేగా పాటిస్తున్నారు. రోజూ ఓ చిన్న చాక్లెట్ తింటే ఎలాంటి హాని ఉండదు సరికదా ఆరోగ్యానికి మంచిదే అంటూ అనేక పరిశోధనలు తేల్చి చెబుతున్నాయి.

కకోవాలోని టానిన్లు దంతాలమీద పాచిని తొలగిస్తాయి. కకోవాలో ప్రోటీన్లు, కాల్షియం, కాపర్, ఐరన్, పొటాషియం, మెగ్నీషియం, బి1, బి2, డి, ఇ విటమిన్లు పుష్కలంగా వుంటాయట. చాక్లెట్లలోని ఓలియాన్ ఆమ్లం గుండె జబ్బుల్ని రానివ్వదు. మెదడులో న్యూరోట్రాన్స్మి టర్లుగా పనిచేసే సెరిటోనిన్, డోపమైన్ వంటి రసాయనాల విడుదలకు సహకరించడం వల్ల మనసుకు ఆహ్లాదాన్ని అందిస్తుంది. అయితే బరువు ఎక్కువగా ఉన్న వాళ్లు మాత్రం క్యాలరీలను లెక్కించుకుని తినాల్సిందే. చాంపియన్ ఆఫ్ యాంటీ ఆక్సిడెంట్'గాను దీనికి పేరుంది. చాక్లెట్లు తినడానికి ముందు ఎంపికలో జాగ్రత్తపడాలి. చాక్లెట్లు తింటే సంతోషం కలుగుతుంది. 1840 సంవత్సరంలో క్యాడ్బరీ చాక్లెట్ కంపెనీ ప్రారంభమైంది. 1947లోమొదటి చాక్లెట్ బార్ని జోసెఫ్ ఫ్రై కనిపెట్టారు. మిల్క్ చాక్లెటంటే ప్రపంచ వ్యాప్తంగా మోజుపడతారు. కానీ మగవారు మాత్రం డార్క్ చాక్లెట్ అంటే ఇష్టపడతారని తేలింది.నిన్నమొన్నటివరకూ చాక్లెట్ అంటే అందరికీ దీర్ఘచతురస్రాకారంలోనే గుండ్రంగానూ,హృదయాకారంలోనూ, త్రికాణాకారంలోనూ ఉన్నవి మాత్రమే తెలుసు. కానీ ఇపుడు చాక్లెట్లలో దొరకని రూపం లేదు. డార్క్ చాక్లెట్లో యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. వయసు మీదపడుతున్న సమయంలో కనిపించే లక్షణాలను ఇవి నియంత్రించి యవ్వనంగా కనిపించేలా చేయగలవు. కానీ రోజంతా నచ్చినపుడల్లా డార్క్ చాక్లెట్ను తీసుకుంటే బరువు పెరగడానికి కారణం అవుతుంది. చాక్లెట్ తింటే కోపం, ఒత్తిడి మాయం. మెదడు చురుకుగా ఉంటుందట. ఆలోచనా ప్రక్రియ మెరుగుపడుతుందని అమెరికన్ విశ్వవిద్యాలయం, దక్షిణ ఆస్ట్రేలియా విశ్వవిద్యాలయం, లగ్జెంబర్గ్ ఆరోగ్య సంస్థవారు సంయుక్త పరిశోధనలో వెల్లడించింది. చాక్లెట్స్ తరుచుగా అధికంగా తీసుకునే వారి జ్ఞాపకశక్తి, పరిశీలన, సామర్థ్యం, సమన్వయం తదితర అంశాల్లో మంచి ప్రతిభ చూపారని తెలిపింది. పొట్ట తగ్గడానికి రోజుకో డార్క్ చాక్లెట్ తినాలట. కోకో శరీరంలో కొవ్వును ఖర్చు చేస్తుంది. రోజుకో చాక్లెట్ తింటే గుండె జబ్బులు వచ్చే అవకాశాలు గణనీయంగా తగ్గుతాయని వైద్యులు చెబుతున్నారు. చాక్లెట్లలో వుండే కాల్షియం, మెగ్నీషియం, ఎముకల దృఢత్వాన్ని కల్గిస్తాయి. రక్తంలో షుగర్ శాతం తగ్గినట్లయితే చాక్లెట్ తినడం మంచిది. దంతాలు చెడిపోతాయని భయంతో చాక్లెట్లు తినరు. ఇందులో కొంత వాస్తవం లేకపోలేదు.

రుచి కోసం తొందరపడి చాక్లెట్లు అతిగా తినడం వలన జీర్ణ సమస్యలు వస్తాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. పిల్లలకు వీటిని ఎక్కువగా తినిపిస్తే మరీ ప్రమాదం. కొందరికి వీటి వల్ల కడుపు ఉబ్బరం, మలబద్ధకం, కడుపు తిమ్మిరి వంటి జీర్ణ సమస్యలు వస్తాయి. వీటిల్లో అధిక స్థాయిలో కొవ్వు, చక్కెర, కెఫిన్‌లను కలిగి ఉంటాయి. ఇది ఎక్కువ పరిమాణంలో తినేటప్పుడు జీర్ణ అసౌకర్యానికి దారితీస్తుంది. చాక్లెట్‌లోని అధిక చక్కెర కంటెంట్ పేగులో హానికరమైన బ్యాక్టీరియా పెంచి పోషిస్తుంది.అందుకే ఏదైనా పరిమితంగా తింటే ఆరోగ్యానికి మంచిది.

**కామిడి సతీష్ రెడ్డి**
**భూపాల్ పల్లి జిల్లా**

# నేనే స్వయంగా ఇంటింటికి మందులు పంపిణీ చేస్తా

## కార్పొరేటర్ పుష్పానగేష్

**సమయజ్యోతి న్యూస్ రామచంద్రాపురం**



రామచంద్రాపురం డివిజన్ మయూరి నగర్ మండల్ తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం రామచంద్రాపురం ప్రైమరీ హెల్త్ సెంటర్ డాక్టర్ కల్పన వారి హెల్త్ డిపార్ట్మెంట్ సభ్యులు ఏర్పాటు చేసిన మండల స్థాయి టాస్క్ ఫోర్స్ కమిటీ లో ఎంఆర్ఓ సంగ్రామ్ రెడ్డి డిప్యూటీ కమీషనర్ సురేష్ జిహెచ్ఎంసి ఎంటమాలజీ ఏఈ తిరుపతయ్య లతో కలిసి ముఖ్య అతిథిగా పాల్గొన్న జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ సభ్యులు రామచంద్రాపురం కార్పొరేటర్ బూరుగడ్డ పుష్పనగేష్ ఈనెల 10 నుండి 25 వరకు జాతీయ పైలేరియా మరియు నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా ఇంటి ఇంటికి వచ్చి ఉచిత మాత్రలు పంపిణీ చెయ్యనున్నట్లు తెలిపారు ప్రతి ఒక్కరూ వ్యాధి బారిన పడకుండా మాత్రలు వేసుకోవాలని సూచించారు కార్పొరేటర్ తనే స్వయంగా బస్తీ లలో కాలనీ లలో ప్రజలు వద్దకు వచ్చి వారితో మాట్లాడి వారికి భరోసా ఇస్తా అని హామీ ఇచ్చారు

# ప్రభుత్వ పాఠశాలలను సెమీ రెసిడెన్షియల్ పాఠశాలలుగా మార్చాలి.

## టిపిటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నన్నెబోయిన తిరుపతి.

**సమయజ్యోతి న్యూస్ కమలాపూర్.**



హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలంలోని అంబాల,శ్రీరాములపల్లి,మాదన్నపేట , శనిగరం,మర్రిపల్లిగూడెం,గుండేడు ,కన్నూరు, భీంపల్లి తదితర గ్రామాల్లోని ఉన్నత మరియు ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులతో తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ కమలాపూర్ మండల శాఖ ఆధ్వర్యంలో సమావేశాలను నిర్వహించి ఉపాధ్యాయ, విద్యారంగ ఉద్యమాల పై చర్చించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న టి పి టి ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నన్నెబోయిన తిరుపతి మాట్లాడుతూ ఉపాధ్యాయ విద్యారంగ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని,ప్రభుత్వ పాఠశాలలన్నింటినీ సెమీ రెసిడెన్షియల్ పాఠశాలలుగా మార్చాలని, వివిద యాజమాన్యాల కింద కొనసాగుతున్న పాఠశాలలు అన్నింటినీ ఒకే గొడుగు కిందకి తీసుకువచ్చి కామన్ స్కూల్ విద్యా విధానాన్ని అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల ప్రమోషన్ల మరియు బదిలీల ప్రక్రియను వెంటనే ప్రారంభించాలని కోరారు. పెండింగ్ లో ఉన్న ఉపాధ్యాయుల వివిధ రకాల బిల్లులను విడుదల చేయాలని, పిఆర్సీ ని ప్రకటించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని ప్రాథమిక పాఠశాలలన్నింటికీ పదివేల ప్రధానోపాధ్యాయుల పోస్టులను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.పూర్వ ప్రాథమిక తరగతులను ప్రాథమిక పాఠశాలలకు అనుసంధానం చేసి ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని, రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి 20 శాతం బడ్జెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు.టి పి టి ఎఫ్ జిల్లా అధ్యక్షులు బత్తిని శ్రీరామాంజనేయులు మాట్లాడుతూ కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని వెంటనే రద్దు పరచి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమగ్రశిక్ష ఉద్యోగుల సమ్మెకాలపు జీతాలను వెంటనే విడుదల చేయాలని, 2008 డీఎస్సీ కాంట్రాక్టు టీచర్లకు 12 నెలల జీతాన్ని విడుదల చేయడంతో పాటుగా వారికి పే స్కేలు వర్తింప చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు మరియు టిపిటిఎఫ్ కమలాపూర్ మండలం అధ్యక్షులు ఉజ్జేతుల రాజు ప్రధాన కార్యదర్శి లకుం భాస్కర్, జిల్లా ఉపాధ్యక్షులు చంద్రగిరి లక్ష్మయ్య , గొడిశాల రమేష్, నిగ్గుల బిక్షపతి, అత్తే శ్రీనివాస్, శ్రీరాములు, గుమ్మడి ప్రసాద్ , భద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

# పాత్రికేయుడి కుటుంబానికి అండగా ఉంటాం..

**సమయజ్యోతి న్యూస్ ముస్తాబాద్**

పాత్రికేయుడు గర్దాసు ప్రసాదు కుటుంబానికి అండగా ఉంటామని కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంట్ కో- కన్వీనర్ కనమేని చక్రధర్ రెడ్డి పేర్కొన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో మంగళవారం బాధిత కుటుంబాన్ని క్షేత్రస్థాయిలో పరామర్శించి ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. తన వంతుగా 5000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. జిల్లా పార్టీ కార్యదర్శి సత్తు శ్రీనివాస్ రెడ్డి, అన్నాల్దాస్ భాను, ఆరుట్ల మహేష్ రెడ్డి పాల్గొన్నారు.



# భూతాయి(కే)లో వైద్య శిబిరం ఏర్పాటు చేసి చికిత్సలు.

**సమయజ్యోతి న్యూస్ జూలై 08 బజార్ హత్నూర్,**

బజార్ హత్నూర్ పి ఎచ్ సి పరిధిలో గల బుతాయి (కే) గ్రామంలో మంగళవారం నాడు బజార్ హత్నూర్ పి ఎచ్ సీ డాక్టర్ కుర్సెంగే భీంరావ్ అద్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి అక్కడి జనానికి వైద్య చికిత్స లు అందించారు.వాన కాలంలో వచ్చే సీజనల్ వ్యాధులైనమలేరియా,టైపాయిడ్,డయేరియా పట్ల జాగ్రత్తగాఉండాలని, పరిసరాల శుభ్రత, వ్యక్తి గత శుభ్రతలు పాటించి ఆరోగ్యం కాపాడుకోవాలని వ్యాధులు,వాటిలక్షణాలు,తీసుకోవల్సిన శ్రద్ధ, జాగ్రత్తలను రోగులకు వైద్యులుఅవగాహనకల్పించారు.వైద్య శిబిరం కు వచ్చిన రోగులకు బీపీ, షుగర్, జ్వరం, తదితర రోగాలకు పరీక్షలు చేసి తగు మందులు, మాత్రలు ఇచ్చారు. ఈకార్యక్రమంలో డాక్టర్భీంరావ్,ఎంఎల్ఎచ్పిఅభిషేక్,హెల్త్ అసిస్టెంట్ గాజులరమేష్,ఆరోగ్య కార్యకర్తలు అన్నపూర్ణ, శ్రీలత, ఆశా కార్యకర్త పద్మ, తదితరులు పాల్గొన్నారు.



# వైయస్సార్ జయంతి వేడుకలు

**సమయజ్యోతి న్యూస్ ముస్తాబాద్**

దివంగత ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి చిరస్మరణీయులని రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండల అధ్యక్షుడు ఏళ్ల బాల్రెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలో మంగళ వారము వైఎస్ జయంతి వేడుకల్లో భాగంగా చిత్రపటానికి పూలమాల సమర్పించి, నివాళులు అర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ శ్రేణులు కొండం రాజిరెడ్డి, వెల్మల రాంరెడ్డి, పెద్దిగారి శ్రీనివాస్, రాజేశం, ప్రశాంతు, భాను, నరేష్, ఉచ్చిడి బాల్రెడ్డి, శ్రీధర్ రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.



# హామీల మేర పథకాల అమలు లేదు

**సమయజ్యోతి న్యూస్ ముస్తాబాద్**

ఎన్నికల ముందు ఇచ్చిన మేరకు హామీలు పూర్తిస్థాయిలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం అమలు చేయడం లేదని మంగళవారం రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండల కేంద్రంలో బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు బొంపల్లి సురేందర్ రావు, పట్టణ అధ్యక్షుడు నరసింహారెడ్డి, సెస్ డైరెక్టర్ సందు పట్ల అంజిరెడ్డి, పార్టీ శ్రేణులు సర్వర్ పాషా, కొమ్ము బాలయ్య గూడూరి భరత్ పేర్కొన్నారు. పథకాలను అరకొరగా అమలు చేస్తూ ప్రజలను అవస్థ పెడుతున్నట్లు ఆరోపించారు.



# మోదీ కానుకగా బండి సంజయ్ కుమార్.. 20 వేల సైకిళ్ల పంపిణీ షురూ..

**సమయజ్యోతి న్యూస్ ముస్తాబాద్**

కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కరీంనగర్ వేదికగా మరో మహత్తరమైన కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో 10వ తరగతి చదివే విద్యార్థిని, విద్యార్థులందరికీ రేపటి నుండి ఉచితంగా సైకిళ్లను అందించనున్నారు. మొత్తం 20 వేల సైకిళ్లను పంపిణీ చేయాలని బండి సంజయ్ లక్ష్యంగా పెట్టుకొని, బ్రాండెడ్ సైకిల్ కంపెనీకి ఆర్డర్ కూడా ఇచ్చారు. సీఎస్సార్ (కార్పొరేట్ సోషల్ రెస్పాన్స్ బిలిటీ) ఫండ్స్ ను చెల్లించి ఈ మొత్తం సైకిళ్లను కొనుగోలు చేశారు. ఒక ప్రజా ప్రతినిధి తన నియోజకవర్గ పరిధిలో 20 వేల సైకిళ్లను పంపిణీ చేయడం ఇప్పటి వరకు ఎక్కడా జరగలేదు. ఆ క్రెడిట్ బండి సంజయ్ కే దక్కబోతోంది. ఈ సైకిళ్ల పంపిణీ ప్రారంభ కార్యక్రమానికి కరీంనగర్ అంబేద్కర్ స్టేడియం వేదిక కాబోతోంది. ఇందుకోసం స్టేడియంలో అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. తొలుత కరీంనగర్ టౌన్ లో టెన్త్ చదువుతున్న విద్యార్థిని, విద్యార్థులకు రేపు ఉదయం 11 గంటలకు తన చేతుల మీదుగా సైకిళ్లను అందజేయబోతున్నారు. మొత్తం 21 స్టాల్స్ ను ఏర్పాటు చేసి రంగు రంగుల బెలూన్లు, షామియానాలతో వాటిని అందంగా ముస్తాబు చేశారు. ఈ కార్యక్రమానికి కేంద్ర మంత్రితోపాటు జిల్లా కలెక్టర్ పమేల సత్పతి, నగర పోలీస్ కమిషనర్ గౌస్ ఆలంసహా పలువురు ఉన్నతాధికారులు, జిల్లా విద్యాశాఖ అధికారులు హాజరుకానున్నారు. మరోవైపు ప్రతి విద్యార్థికి ఈ సైకిల్ ను అందించాలనే ఉద్దేశంతో సైకిళ్ల పంపిణీ బాధ్యతను జిల్లా కలెక్టర్ కు అప్పగించారు. కలెక్టర్ ద్వారా డీఈఓ, ఎంఈవో స్కూళ్ల వారీగా ఎంత మంది విద్యార్థులున్నారనే జాబితాను సిద్ధం చేసిన అధికారులు ఆ మేరకు సైకిళ్లను ఆయా అసెంబ్లీ నియోజకవర్గాలు, మండలాలు, గ్రామాల వారీగా సైకిళ్లను పంపిణీ చేయనున్నారు. నెల రోజుల్లో ఈ సైకిళ్ల పంపిణీ పూర్తి చేయాలని, ప్రభుత్వ పాఠశాలల్లో టెన్త్ చదువుకునే ప్రతి విద్యార్థినీ, విద్యార్థికి ఈ సైకిల్ ను అందజేయాలని కలెక్టర్ ను కోరారు.

**టెన్త్ విద్యార్థుల కష్టాలను తొలగించేందుకే సైకిళ్ల పంపిణీ...**

ప్రభుత్వ స్కూళ్లలో చదువుకునే పిల్లలు పేద కుటుంబం నుండి వచ్చిన వాళ్లే ఉంటారనే విషయం తెలిసిందే. తమ ఇంటి నుండి స్కూల్ దాకా వెళ్లడానికి తగిన రవాణా సౌకర్యాల్లేక, ఆటోలు, బస్సులు వెళ్లే స్తోమత లేక ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా టెన్త్ క్లాస్ విషయానికొచ్చే సరికి స్కూల్ వేళలు ముగిసిన తరువాత కూడా స్పెషల్ క్లాస్ లకు హాజరు కావాల్సి ఉంటుంది. దీనివల్ల పొద్దుపోయేదాకా స్కూళ్లోనే ఉండాల్సి వస్తుంది. దీనిని దృష్టిలో ఉంచుకుని టెన్త్ బాలబాలికలకు రవాణా సౌకర్యం లేక ఇబ్బంది పడుతున్నారనే విషయం బండి సంజయ్ కుమార్ దృష్టికి వచ్చింది. వేల రూపాయలు వెచ్చించి సైకిళ్లు కొనే స్తోమత ప్రభుత్వ స్కూళ్లలో చదివే పిల్లలకు లేదని గ్రహించిన బండి సంజయ్ సీఎస్సార్ ఫండ్స్ ను సేకరించి 20 వేల సైకిళ్లను కొనుగోలు చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ కానుక పేరుతో ప్రతి ఒక్కరినీ సైకిళ్లను పంపిణీ చేసేందుకు సిద్ధమయ్యారు.

**బండి రూట్ సపరేట్**

వాస్తవానికి రాజకీయ నాయకులు తమ బర్త్ డే వస్తుందనగానే కేకులు కట్ చేయించడం, ఊరూవాడా సంబురాలు చేయడం, మందు పార్టీలు ఏర్పాటు చేయడం నిత్య కృత్యంగా జరిగే తంతు. బండి సంజయ్ మాత్రం వీటికి భిన్నంగా గత కొన్నేళ్లుగా తన పుట్టిన రోజును సైతం పేద వర్గాలకు మరింత సేవ చేసేలా కార్యక్రమాలు చేపడుతున్నారు. ముఖ్యంగా పేదలకు వైద్య, విద్యం అందని ద్రాక్షలా మారడంతో ఆయా రంగాల ద్వారా పేదలను ఆదుకునే విధంగా వైవిధ్యమైన సేవా కార్యక్రమాలను చేపడుతుండటం విశేషం.



**ఏరియా ఆసుపత్రులకు రూ.5 కోట్ల విలువైన ఆధునాతన మెడికల్ ఎక్విప్ మెంట్స్ అందజేత**

అట్లాగే ఇటీవల వేములవాడ, హుజూరాబాద్, హుస్నాబాద్, జమ్మికుంట ఏరియా ఆసుపత్రుల్లో ఆధునాతన పరికరాల కొరతతో రోగులు ఇబ్బంది పడుతున్నారని, ఆర్థిక స్తోమత లేకపోవడంతో వివిధ రకాల టెస్ట్ ల కోసం ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయించలేక తనువు చాలిస్తున్నారని తెలుసుకున్న బండి సంజయ్ దాదాపు రూ.5 కోట్ల రూపాయల సీఎస్సార్ ఫండ్స్ ను సేకరించి ఆయా ఆసుపత్రులకు అవసరమైన ఆధునాతనమైన మెడికల్ ఎక్విప్ మెంట్స్ ను అందించడం విశేషం.

**వైద్య, విద్యా రంగాలపైనే ఫోకస్...**

గతంలోనూ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రులతోపాటు 7 అసెంబ్లీ సెగ్మెంట్లలోని ఆసుపత్రుల్లోనూ రోగులకు మెరుగైన సేవలందించాలనే ఉద్దేశంతో తన సొంత ఖర్చుతో 2 కోట్ల విలువైన మెడికల్ ఎక్విప్ మెంట్ ను బండి సంజయ్ అందించారు. అంతకుముందు 'సంజయ్ సురక్షా' పేరుతో అంబులెన్స్ లను అందించారు. ఇవిగాకుండా మెడిసిన్స్, ఫ్రీజర్స్ సహా ఆసుపత్రులకు అవసరమైన మెడికల్ ఎక్విప్ మెంట్ ను సైతం అందించారు. కరోనా సమయంలో ప్రాణాలకు తెగించి రోగుల వద్దకు నేరుగా వెళ్లి పరామర్శించడమే కాకుండా అవసరమైన అన్ని రకాల మెడిసిన్స్, ఇంజక్షన్స్, గ్లౌజులు, మెడిసిన్స్ వంటివి అందించి అండగా తానున్నానంటూ భరోసా ఇస్తూ రోగులకు మనోధైర్యం నింపారు.

# తల్లిదండ్రులు విద్యార్థుల కోసం చదివే మూల ఏర్పాటు చేయాలి

## ప్రధానోపాధ్యాయులు నల్లే శివరాజ్

**సమయజ్యోతి న్యూస్ కృష్ణ... నారాయణ పేట జిల్లా**

మండలంలోని కుస్నీ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం విద్యార్థుల తల్లిదండ్రుల మరియు ఉపాధ్యాయుల సమావేశం ప్రధానోపాధ్యాయులు నల్లే శివరాజ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశం సందర్భంగా నల్లె శివరాజ్ మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థులకు ప్రభుత్వం ద్వారా అందించే సేవలు అనగా ఏక్స్టెప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నడుస్తున్న ప్రోగ్రాం అనగా చదువులో వెనుకబడిన విద్యార్థులు తెలుగులో చదవడం, గణితం లో చతుర్విధ ప్రక్రియలు చేసేలా కంప్యూటర్ ఆదరిత భోదన, మరియు ఆంగ్లం లో జాలీ ఫోనిక్స్ ద్వారా భోధన చేయడం జరుగుతుందని తెలుపుతూ, తల్లిదండ్రులుగా మీ పిల్లలకు ఇంటిలో చదివే మూలను ఏర్పాటు చేసి అక్కడే విద్యార్థులు రోజు వారి ఇంటి పని చదవడం, రాయడం చేసేలా చూడాలని చెప్పడం జరిగింది, కార్యక్రమం లో భాగంగా తరగతి వారీగా తెలుగు, ఆంగ్లం గణితం లో కృత్యాలు చేయించి విద్యార్థులచే చదివించడం జరిగింది, కార్యక్రమం లో చివరగా మా పాఠశాల నుండి జిల్లా స్థాయిలో నిర్వహించిన అండర్ -8 విభాగం లాంగ్ జంప్, రన్నింగ్, టెన్నిస్ బాల్ త్రో లో మొదటి స్థానాన్ని పొంది మెడల్స్ ను ప్రశంషా పత్రం అందుకున్న ఎరుకలి నవీన్ కుమార్ ను పాఠశాల ఉపాధ్యాయ బృందం, తల్లిదండ్రులు అభినందించి సన్మానించడం జరిగింది, కార్యక్రమం లో ప్రధానోపాధ్యాయులు నల్లే శివరాజ్, ఉపాధ్యాయులు అనిత, అశోక్, అమృత, మాధవిలత, ప్రియాంక, సుప్రజ, స్వీపర్ రేణుక, విద్యార్థులతల్లిదండ్రులు పాల్గొన్నారు.




# త్రిబుల్ ఐటీ ప్రతిభావంతులను సన్మానించిన నాయకులు

**సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి బాల్కొండ**

త్రిబుల్ ఐటీ బాసరకి ఎంపికైన బాల్కొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినీలు ఆర్.భవ్య, బ్రాహ్మణపల్లి వైశాలి లను, కాంగ్రెస్ నాయకులు సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి బట్టు రాజేశ్వర్ పట్టణ అధ్యక్షుడు సంజీవ్ గౌడ్, యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు వివేక్, విక్కీ, నాయకులు కుందారం శ్రీనివాస్, మొహమ్మద్ యునుస్, సంతోష్ గౌడ్, సన్నిత్, యాదవ్, నవీన్, కుమార్, పవన్ కుమార్, ఇంచార్జ్ ప్రధాన ఉపాధ్యాయుడు ప్రశాంత్, ఉపాధ్యాయుల శ్రీనివాస్ పాల్గొన్నారు.



# పదోన్నతి పొందిన ఏఎస్ఐలను అభినందించిన పోలీస్ కమిషనర్

**సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి నిజామాబాద్ బ్యూరో**

హెడ్ కానిస్టేబుల్ నుండి ఏ.ఎస్ఐ లుగా పదోన్నతి పొందిన పోలీసు ఉద్యోగులు ఎం.డి. రియాజుద్దీన్, కే.పరమేశ్వర్, పి. వసంత్ రావు, జక్రయ్య, కే.అరుణ కుమారి, జి.అనురాధ, జీ.వి.రమనేశ్వరి, ముంతాజ్ బేగంలను మంగళవారం నిజామాబాద్ జిల్లా పోలీస్ కమిషనర్ అభినందించారు.



# కంది శ్రీనివాస రెడ్డి క్యాంపు కార్యాలయంలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతి వేడుకలు

## వైఎస్ఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి కాంగ్రెస్ నేతల ఘన నివాళులు

**సమయజ్యోతి న్యూస్ ఆదిలాబాద్ :**

ప్రజానాయకుడిగా వైఎస్సార్ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని కాంగ్రెస్ సీనియర్ నాయకులు మాజీ మున్సిపల్ చైర్మన్ దిగంబర్ రావు పాటిల్,కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు గుడిపల్లి నగేష్ అన్నారు.ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్య మంత్రి దివంగత వైఎస్ రాజశేఖర్ రెడ్డి 76వ జయంతిని పురస్కరించుకుని ఆదిలాబాద్ పట్టణంలోని కంది శ్రీనివాస రెడ్డి క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ శ్రేణులు జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు.పెద్ద సంఖ్యలో హాజరైన స్థానిక పార్టీ నాయకులు కార్యకర్తలు వైఎస్ ఆర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు.ముఖ్య మంత్రిగా ఉమ్మడి రాష్ట్రంతో పాటు నాయకుడిగా కాంగ్రెస్ పార్టీకి అందించిన సేవలను స్మరించుకున్నారు.నాడు ఆ మహనీయుడు ప్రవేశ పెట్టిన అనేక ప్రజా సంక్షేమ పథకాలను ఆదర్శంగా తీసుకుని అనంతర ప్రభుత్వాలు వాటిని కొనసాగిస్తు న్నాయన్నారు.ఆదిలాబాద్ కు రిమ్స్ ఆసుపత్రి తో పాటు పలు ప్రాజెక్టులు తీసుకొచ్చిన ఘనత వైఎస్ ఆర్ దేనని గుర్తు చేసుకున్నారు. ఆయన పాలనలో నిస్వార్థత,పేదలకు మంచి చేయాలన్న సంకల్పబలంతో ప్రజాసేవలో అనేక సంస్కరణలతో నూతన అధ్యాయాన్ని లిఖించిన మహానేత అని కొని యాడారు.రైతుల సంక్షేమం, మహిళా భ్యున్నతి, విద్య, వైద్యారోగ్య రంగాల్లో విప్లవాత్మక మార్పులతో ప్రజల మేలుకోరి పాలన సాగించిన మహనీయుడని అన్నారు.ఆయన ఆలోచనా విధానాలు కార్యాచరణ రాష్ట్ర ప్రగతికి బీజం వేసాయని తెలిపారు.యావత్ కాంగ్రెస్ పార్టీ ఆయన్ను గర్వంతో స్మరించుకుంటుందని యావత్తు దేశం ప్రజా నాయకుడిగా గుర్తుంచు కుంటుందని పేర్కొన్నారు.ఆయన ఆశ యాలకు అనుగుణంగా నడుచుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో డీసీసీ



వర్కింగ్ ప్రెసిడెంట్ భూపెల్లి శ్రీధర్,గిమ్మ సంతోష్,కాంగ్రెస్ పార్టీ ఆదివాసీ జిల్లా అధ్యక్షులు సెడ్మాకి ఆనంద్ రావు, నాయకులు లోక ప్రవీణ్ రెడ్డి,బండి దేవిదాస్ చారి,దాసరి ఆశన్న,ఎల్మ రామ్ రెడ్డి,సోమ ప్రశాంత్, మహేందర్, అశోక్,జాదవ్ శ్రవణ్ నాయక్,సంజయ్ రెడ్డి,నిమ్మల గౌతమ్ రెడ్డి,అంజద్ ఖాన్,తోఫిక్,పొచ్చన్న,అతిక్ ఉర్ రహమాన్,ఇర్ఫాన్,శ్రీలేఖ ఆదివాసీ, షబానా,జ్యోతి,అఫ్రోజ్ తదితరులు పాల్గొన్నారు.

# తెలుగు రాష్ట్రాల గుండెచప్పుడు వైఎస్ఆర్.- వైయస్సార్ ఫౌండేషన్ ప్రెసిడెంట్ షేక్ ఆసిఫ్

**సమయజ్యోతి న్యూస్ ఆదిలాబాద్ :**

తరతరాల అభిమానం వైయస్సార్ కు మాత్రమే సాధ్యమని, తరాలు మారిన మరుపురాని మహానేత తెలుగు రాష్ట్రాల గుండెచప్పుడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి అని వైయస్సార్ ఫౌండేషన్ ప్రెసిడెంట్ షేక్ ఆసిఫ్ అన్నారు. అదిలాబాద్ పట్టణంలో మంగళవారం వైయస్సార్ 76వ జయంతి వేడుకలను నిర్వహించారు.మాటతప్పని,మడమ తిప్పని,యోధుడు మహానేత వైయస్ రాజశేఖర్ రెడ్డి అని కొనియాడారు.ఈ సందర్భంగా కేక్ కట్ చేసి అభిమానులకు పంచి పెట్టారు.జయంతి వేడుకలో వైయస్సార్ టీపి పట్టణ అధ్యక్షుడు షేక్ అస్లం,జోనల్ డిస్టిక్ ప్రెసిడెంట్ ఎండి రఫీక్,జబీర్ భాయ్,సయ్యద్ అర్సలాన్ తదితరులు పాల్గొన్నారు.



# పోలీసు విధులకు ఆటంకపరిచిన నలుగురి అరెస్టు,రిమాండ్ - జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్.

**సమయజ్యోతి న్యూస్ ఆదిలాబాద్ :**

గత నెల 26వ తారీఖున ఆదిలాబాద్ జిల్లా నందు గల నేరడిగొండ మండలంలో జాతీయ రహదారి 44 (ఎన్ హెచ్ 44)పై రాస్తారోకో నిర్వహించి,పోలీసులపై దాడి చేసిన ఘటనలో కేసు నమోదైంది.ఈ ఘటన నందు నలుగురు ముద్దాయిలను అరెస్టు చేసి మంగళవారం రోజు రిమాండ్కు తరలించడం జరిగిందని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఒక పత్రిక ప్రకటన ద్వారా తెలియజేశారు.అరెస్టు చేయబడిన నిందితులలో ఏ2) జాదవ్ ప్రేమ్‌సింగ్,తండ్రి పూల్యా,వయస్సు: 47 సం.,నివాసం: గాయడ్‌పల్లి గ్రామం,మామడ మండలం, నిర్మల్ జిల్లా.,ఏ3) ఇందల్ ఇస్లావత్,తండ్రి: శెత్యా,వయస్సు: 33 సం.,నివాసం: గాయడ్‌పల్లి గ్రామం,మామడ మండలం,నిర్మల్.,ఏ4)బ్రహ్మావత్ అరవింద్,తండ్రి: దేవీచంద్,వయస్సు: 22 సం.,నివాసం: గాయడ్‌పల్లి గ్రామం,మామడ మండలం,నిర్మల్ జిల్లా.,ఏ7) జాదవ్ లక్ష్మణ్,తండ్రి: ఉత్తమ్,వయస్సు: 38 సం.,నివాసం: గాయడ్‌పల్లి గ్రామం,మామడ మండలం,నిర్మల్ ఉన్నారు.ఈ ఘటనలో ఇద్దరు పోలీసులు గాయపడ్డారని,నేరడిగొండ పోలీస్ స్టేషన్‌లో అసిస్టెంట్ సబ్-ఇన్‌స్పెక్టర్ (ఏఎస్ఐ)గా పనిచేస్తున్న ఎం.రామకృష్ణ (ఏఎస్ఐ-4259) ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు వివరాలు వెల్లడించారు.జూన్ 26,2025న రాత్రి 08:45 గంటల సమయంలో ఏఎస్ఐ రామకృష్ణ,కానిస్టేబుల్ జి.సంతోష్ (పిసీ -3318)తో కలిసి నేరడిగొండలోని ఎన్ హెచ్ 44 రోడ్డుపై స్థానిక పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారు.అదే సమయంలో,నీలిమ దాబా సమీపంలో నిర్మల్ జిల్లా మామడ మండలం,గాయడ్‌పల్లి గ్రామానికి చెందిన కాలా బాయి,ప్రేమ్ సింగ్ మరియు మరికొందరు స్త్రీ,పురుషులు రెండు ఐచర్ వాహనాలలో వచ్చారు.వారి గ్రామానికి చెందిన అదే సుజాత (భర్త: నటరాజ్, వయస్సు: 26 సం.) అనే మహిళను ఆమె భర్త,బంధువులు వేధింపులతో చంపారన్న ఆరోపణపై వారు ఎన్ హెచ్ 44 రోడ్డుపై రాస్తారోకో నిర్వహించి,అల్లర్లు సృష్టించారు.తక్షణమే ఏఎస్ఐ రామకృష్ణ తన సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని,ఎన్ హెచ్ 44 రోడ్డు దిగ్బంధనాన్ని ఆపడానికి ప్రయత్నించారు.దీనివల్ల సాధారణ ప్రజలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.ఫిర్యాదుదారుడు మరియు ఇతర పోలీసు సిబ్బంది వారిని సముదాయించడానికి ప్రయత్నించినప్పటికీ,వారు పోలీసుల సూచనలను పాటించకుండా వారి విధులను అడ్డుకున్నారు.ఈ క్రమంలో,వారిలో కొందరు పోలీసుల చుట్టూ చేరి,కర్రలతో ఏఎస్ఐ రామకృష్ణ,కానిస్టేబుల్ జి.సంతోష్ పై దాడి చేసి గాయపరిచారు.ఘటనను వీడియో రికార్డు చేస్తుండగా పిసీ -3318 జి.సంతోష్ మొబైల్ ఫోన్‌ను కూడా



ధ్వంసం చేశారు.అంతేకాకుండా,పోలీసులను చంపేస్తామని బెదిరించారు.ఫిర్యాదుదారుడు గాయపడటం జరిగింది.ఈ ఫిర్యాదులోని అంశాల ఆధారంగా,పోలీసులు క్రైమ్ నంబర్ 133/2025 కింద భారతీయ న్యాయ సంహిత (బిఎన్ఎస్)లోని సెక్షన్లు 127(2),132,121(1),351(3) రెడ్ విత్ 3(5) కింద కేసు నమోదు చేశారు.సంబంధిత అధికారులకు సమాచారం అందించి,ఎఫ్ఐఆర్ కాపీని జారీ చేసి దర్యాప్తు ప్రారంభించారు.ఈ సందర్భంగా మంగళవారం రోజు నలుగురు ముద్దాయిలను ఉట్నూర్ కోర్ట్ నందు ప్రవేశపెట్టగా 14 రోజుల జ్యుడిసరి రిమాండ్కు తరలించడం జరిగిందని తెలిపారు.చట్టం వ్యతిరేక కార్యక్రమాలు పోలీసు విధులను ఆటంకపరిచేలా ఎలాంటి కార్యక్రమాలు నిర్వహించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ హెచ్చరించారు.

# నూతన ఎస్సైలు బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలి : పోలీస్ కమిషనర్ సాయి చైతన్య

**సమయజ్యోతి న్యూస్ నిజామాబాద్ బ్యూరో**

ప్రతి ఒక్కరు భాద్యతాయుతంగా విధులు నిర్వహించాలని, పోలీస్ స్టేషన్ కు వచ్చే బాధితుల సమస్యల పరిష్కారానికి ప్రతీ ఒక్కరు బాధ్యతగా కృషి చేయాలని నిజామాబాద్ ఎస్పీ కార్యాలయంలో పోలీస్ కమిషనర్ మంగళవారము పేర్కొన్నారు. నూతన ఎస్సైలు తమను మర్యాదపూర్వకంగా కలవగా, పోలీస్ కమిషనర్ మాట్లాడారు. ప్రజలకు తగు న్యాయం చేయాలని, ఫ్రెండ్లీ పోలీస్ వ్యవస్థను నిక్కచ్చిగా అమలుచేయాలని, ప్రతీ విషయం తమ పై అధికారులకు తెలియజేయాలని, ప్రతీ గ్రామాలలో మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ప్రధానంగా సైబర్ నేరాల పై, కొత్త చట్టాలపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. ఈ సందర్భంగా నూతన ఎస్సైలు ఎమ్. కళ్యాణి దర్పల్లి, జడ్. సుస్మిత - (ముగ్పాల్), ఎమ్. రమా ( ఎడపల్లి), కె. శైలెంధర్ (బాల్కొండ), సుహాసిని (మెండోరా), పి. రాజేశ్వర్ (ఎర్గాట్ల), కిరణ్ పాల్ ( టౌన్ -3) పాల్గొన్నారు.




# జర్నలిస్టు కుటుంబానికి అండగా ఉంటాం

## ప్రభుత్వ సాయం 50వేలు, తమవంతుగా సాయం చేసిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

**సమయజ్యోతి న్యూస్ ముస్తాబాద్**

సిరిసిల్ల పాత్రికేయుడు గార్దసు ప్రసాద్ కుటుంబానికి అండగా ఉంటానని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ భరోసా ఇచ్చారు. ప్రసాద్ గుండెపోటుతో ఇటీవల మృతిచెందిగా విషయం తెలుసుకున్న విప్ మంగళవారం సిరిసిల్ల పట్టణంలోని వారి ఇంటికి వెళ్లి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం తరుపున రూ.50 వేల ఆర్థిక సహాయాన్ని, విప్ ఆది శ్రీనివాస్ స్వయంగా 20 వేల రూపాయలను వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. భవిష్యత్తులో కుటుంబానికి, పిల్లల చదువులకు అన్ని విధాలా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. వారికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. ప్రసాద్ తల్లిదండ్రుల ఆరోగ్య చికిత్సకు ప్రభుత్వం తరపున సహాయం అందిస్తామని భరోసా ఇచ్చారు. కాంగ్రెస్ పార్లమెంటరీ కో కన్వీనర్ కనమేని చక్రధర్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్పర్సన్ స్వరూప రెడ్డి, డి.పి.ఆర్.ఓ. వి.శ్రీధర్, పాత్రికేయులు, ప్రజా ప్రతినిధులు, నాయకులు సంగీతం శ్రీనివాసు పాల్గొన్నారు.



# ముంపు గ్రామాల సమస్యలకు శాశ్వత పరిష్కారం : ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

**సమయజ్యోతి న్యూస్ ముస్తాబాద్**

మిడ్ మానేర్ రిజర్వాయర్ ముంపు గ్రామాల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతున్నామని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. మంగళవారం ఆయన జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ తో కలిసి వేములవాడ అగ్రహారం లో మిడ్ మానేర్ రిజర్వాయర్ ముంపు గ్రామాల నిర్వాసితులకు ఇల్లు కట్టుకొని ఖాళీ ఫ్లాట్స్ ఉన్నవారికి స్పెషల్ కోటా కింద 847 ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. ప్రజా ప్రభుత్వం 4 లక్షల 50 వేల ఇందిరమ్మ ఇండ్ల మొదటి విడతలో మంజూరు చేశామని, వీటిలో నియోజకవర్గానికి కేటాయించిన 3500 ఇందిరమ్మ ఇండ్లను ఇప్పటికే పంపిణీ చేశామని, స్పెషల్ కోట కింద మిడ్ మానేరు నిర్వాసిత గ్రామాల ప్రజలకు నేడు 847 ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలు పంపిణీ చేస్తున్నామని, మరో 3 వేల ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తులు పెండింగ్ విచారణలో ఉన్నాయని, ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, త్వరలో మిగిలిన వారికి తప్పనిసరిగా ఇండ్లు మంజూరు చేస్తామని, వేములవాడ అర్బన్ ప్రాంతంలోని ముంపు గ్రామాల రిజర్వాయర్ నిర్వాసితులకు తప్పనిసరిగా ఇండ్లు మంజూరు అవుతాయని అన్నారు. ముంపు గ్రామాల నిర్వాసితుల శాశ్వత పరిష్కారం లభిస్తుందని, ఆ దిశగా మనమంతా సంయుక్తంగా పని చేయాలని అన్నారు. భారత దేశంలో ఎక్కడ కూడా పేదలకు ఇంటి నిర్మాణం కోసం 5 లక్షల రూపాయలు ఖర్చు చేయడం లేదని, రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ ప్రభుత్వం మాత్రమే పెద్ద ఎత్తున పేదలకు నిధులు మంజూరు చేస్తుందని అన్నారు. కలెక్టర్ సందీప్ కుమార్ ఝ మాట్లాడుతూ స్టేట్ రిజర్వు నుంచి మొట్టమొదటి సారిగా 5 వేల ఇందిరమ్మ ఇండ్లను ప్రభుత్వ విప్ మిడ్



మానేరు ముంపు గ్రామాల నిర్వాసితులకు ప్రభుత్వ విప్ ప్రత్యేక చొరవతో మంజూరు చేయడం జరిగిందని అన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రాము, పిడి హౌసింగ్ శంకర్, మండల ప్రత్యేక అధికారి శ్రీనివాస్ ఇతర ప్రజా ప్రతినిధులు ఇందిరమ్మ ఇళ్ల కమిటీ సభ్యులు, నాయకులు లబ్ధిదారులు, అధికారులు పాల్గొన్నారు.

# నైపుణ్యాలు ఉంటున్నా.. ఆవిష్కరణలు ఏవీ

## - మూస చదువులతో రాణించలేకపోతున్న విద్యార్థులు

## - బ్రిటన్ విద్యావిధానం దూరం పెడితేనే మెరుగు

న్యూఢిల్లీ,జూలై8(సమయజ్యోతి ):

దేశీయ విద్యా వ్యవస్థలో మార్పులు తీసుకురావాల్సిన అసరముందని గతంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చేసిన వ్యాఖ్యలు ప్రస్తుత విద్యావిధానానికి అద్దం పడుతున్నాయి. ఒకప్పుడు భారతీయ విద్యా ప్రపంచానికి వెలుగుదివ్వెగా ఉండేది. విద్యార్థులను సర్వతోముఖాభివృద్ధి చేసేలా శిక్షణ ఉండేది. కేవలం చదువలే గాకుండా అన్నిరంగాల్లో ఆరితేరేలా చేసేది. గురుకుల విద్యా విధానంలో అలాంటి అద్భుతాలు ఉండేవి. ఆనాడే అందరికీ ఒకే తరహా విద్యావిధానం అమల్లో ఉండేది. నేటి విద్యా విధానంలో మన నైపుణ్యాలు కానరావడం లేదు. సాంకేతికంగా బలంగా ఉంటున్నా ఎందుకనో అద్భుతాలు సాధించడం లేదు. ఐఐటిలు,ఐఐఎంల నుంచి వస్తున్న విద్యార్థుల్లో నైపుణ్యాలు ఉంటున్నా, ఆవిష్కరణలు రావడం లేదు. ప్రతిదానీకి మనం విదేశీ నైపుణ్యాలపై ఆధారపడుతున్నాం. బ్రిటిషర్ల పాలన మొదలయ్యాక మన గురుకులాలను పాతరేశారు. మెకాలే తరహా విద్యావిధానం పట్టుకుని మనం ఇంకా పాకులాడడం వల్ల విద్యార్థుల్లో నైపుణ్యం పెరగడం లేదు. దీనికితోడు విద్యార్థులను మానసిక ఆందోళనకు గురి చేస్తోంది. ఒత్తి పరీక్షల్లో పడి విద్యార్థులు అసువులు బాస్తున్నారు.ఇదే విషయాన్ని ప్రధాని సహా మేధావులు కూడా అంగీకరిస్తున్నారు. అయితే దీనిని మార్చే ప్రక్రియను చేపట్టడం ద్వారా భారతీయ విద్యను అంతర్జాతీ స్థాయిలో పోటీపడేలా చేయాలి. బ్రిటీష్ వాళ్లు తమ అవసరాలను తీర్చుకోవడానికి అనుగుణంగా బానిస వర్గాన్ని సృష్టించే విద్యా విధానాన్ని దేశంలో అమలు చేశారు. జాతీయ విద్యా విధానం అమలుకు సంబంధించి జరుగుతున్న ప్రయత్నాలను వేగవంతం చేయాలి. కేవలం డిగ్రీ పట్టాలను అందిచడమే కాకుండా దేశాన్ని ముందుకు నడిపే మానవ వనరులను అదించేలా విద్యా వ్యవస్థ ఉండాల్సి అవసరం గుర్తించాలి. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత విద్యా వ్యవస్థలో కొన్ని మార్పులు జరిగాయి. అయితే ఇంకా చాలా మార్పులు చేయాల్సిన అవసరముంది. ఇప్పుడు పిల్లలంతా ఇతరులపై పోటీ పడేందుకు గూగుల్‌ను ఆశ్రయిస్తున్నారు. ప్రతిదీ గూగుల్‌లో సర్చ్ చేయడం అలవాటు చేసుకున్నారు. శారీరక శ్రమతో పాటు మానసిక ధృఢత్వాన్ని ప్రస్తుత విద్యావిధానంలో అమలు కావడం లేదు. మన విద్యా ప్రాంగణాలలో అలాంటి పిల్లలకు అవసరమైన వాతావరణం కల్పించాల్సి ఉంది. ఎన్ఇపి ద్వారా భారతీయ భాషల్లో విద్యనభ్యసించేందుకు తలుపులు తెరుచుకోవాలి. ప్రపంచ విద్యాభ్యాస గమ్యస్థానంగా భారత్ ఎదిగేలా చేయాలి. ఎంతసేపూ మనం విదేశాలకు వెళ్లకుండా మనవద్దకే వచ్చేలా చేయగలగాలి. అప్పట్లో వలస పాలకుల సొంత అవసరాలు తీర్చుకోవడమే ఆ విద్యా వ్యవస్థ లక్ష్యంగా మారింది. ఇప్పటికీ చాలా వరకు మార్పు లేకుండానే అది కొనసాగుతోంది. విద్యావ్యవస్థ అంటే కేవలం డిగ్రీ హోల్డర్లను ఉత్పత్తి చేయడమే కాదు. దేశాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు అవసరమైన మానవ వనరులను అందించాలన్న లక్ష్యం కావాలి.డిగ్రీల కోసం కాకుండా, భవిష్యత్ వర్క్‌ఫోర్స్‌గా తమను తాము రూపొందించుకునేందుకు యువత సిద్ధం కావాల్సి ఉంది. విద్యా వ్యవస్థను సంకుచిత ఆలోచనల నుంచి బయటికి తీసుకురావాలి. అప్పుడే మన లక్ష్యం నెరవేరగలదు. అందుకు మానవవనరులను అభివృద్ధి చేసే విద్యావిధానం రావాల్సి ఉంది. చదువు ఏదయినా స్వశక్తితో నిలబడగలిగేలా పౌరులను తీర్చిదిద్దగలగాలి.

# డాలర్ దెబ్బకు రూపాయి విలవిల

## రూపాయిని నిలబెట్టే మార్గమేదీ ?

ముంబయి,జూలై8(సమయజ్యోతి ):

అంతర్జాతీయ ద్రవ్య మార్కెట్‌లో రూపాయి విలువ రోజురోజుకు పతనం అవుతోంది. అమెరికా బెదరింపులతో ఇప్పుడు అన్ని రంగాల్లో దెబ్బతినేలా ఉంది. ట్రంప్ సుంకాల వల్ల రానున్న రోజుల్లో డాలర్ మారకం మరింత పెరిగే ప్రమాదం లేకపోలేదు. ఇది మరింతగా అగాథంలోకి పడిపోతోంది. దేశ చరిత్రలో ఎప్పుడూ లేని విధంగా డాలర్ విలువ రూ.85.67కు చేరువయ్యింది. రికార్డు స్థాయికి చేరిన మన విదేశీ మారక నిల్వలు ఇప్పుడు హారతి కర్పూరంలా కరిగిపోతున్నాయి. రూపాయి అదుపునకు ఆర్బీఐ యధేచ్ఛగా డాలర్లను వెదజల్లడం, విదేశీ ఇన్వెస్టర్లు డాలర్లను తరలించుకుపోవడంతో ఇప్పుడు మన వద్ద ఫారెక్స్ నిల్వలు కరిగిపోతున్నాయన్న ఆందోళన కూడా ఉంది. విదేశీ దిగుమతులు కూడా డాలర్‌ను బలోపేతం చేస్తున్నాయి. ఇలా ఒకదాని వల్ల మరొకటి పెరిగిపోవడం, తద్వారా రూపాయి మరింత క్షీణించడం, ధరలు ఆకాశాన్నంటడం చకచకా జరిగిపోతాయని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. ఇది ఆల్‌టైం రికార్డ్ గా చూడాలి. డాలర్ మారకంలో రూపాయి విలువ రికార్డు కనిష్టస్థాయికి పడిపోయి రూ.85.67 వద్ద డాలర్ మారకం కొనసాగుతున్నది. కరెన్సీ పతనంతో పెట్రోల్, డీజిల్, వంటనూనెలు, పప్పులు తదితరాల ధరలన్నీ ఆకాశాన్ని తాకాయి. రూపాయి పతనాన్ని నిలువరించేందుకు రిజర్వ్ బ్యాంక్ ప్రయత్నాలు చేసినా ఉపయోగం లేకుండాపోయింది. 2014కు ముందు బిజెపి అధికారంలోకి రాకముందు.. డాలర్‌తో రూపాయి విలువ 68కి పడిపోతే నరేంద్ర మోడీ అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వంపై ఘాటు వ్యాఖ్యలు చేశారు. రూపాయి ఐసియులో పడిపోయిందని.. తాము అధికారంలోకి వస్తే దేశీయ కరెన్సీని ప్రపంచ మార్కెట్‌లో నిలదొక్కుకునేలా చేస్తామని అనేక గొప్పలు చెప్పారు. ప్రస్తుతం అంతకంటే దారుణమైన స్థితిలోకి రూపాయి పడిపోతున్నప్పటికీ.. కట్టడి చర్యలు కానరావడం లేదని నిపుణులు విమర్శిస్తున్నారు. దేశీయ గణంకాలు బలహీనంగా చోటు చేసుకో వడానికి తోడు అంతర్జాతీయం గా డాలర్ విలువ పెరగడం రూపాయిని ఒత్తిడికి గురి చేసిందని ఆర్థిక నిపుణులు పేర్కొన్నారు. ప్రస్తుత ఏడాది జూన్‌లో భారత ఎగుమతుల కంటే దిగుమతులు అధికంగా చోటు చేసుకోవడం.. రికార్డ్ స్థాయిలో వాణిజ్య లోటు పడటంతో రూపాయిపై మరింత ఒత్తిడి చోటు చేసుకుంది. డాలర్‌తో రూపాయి విలువ ఇంతటితోనే ఆగుద్దని అనుకోవడానికి లేదని ఆర్థికనిపుణులు పేర్కొంటున్నారు. భారత్‌లోనూ మందగమన భయాలు, అధిక చమురు ధరలు, అంతర్జాతీయ ప్రతికూల అంశాలు, ఎఫ్ఐఐలు వరుసగా తరలిపోవడం, ఆర్‌బిఐ వద్ద మారకం నిల్వలు తగ్గిపోవడం తదితర అంశాలు రూపాయిని కుదేలు చేస్తున్నాయి. రూపాయి పరిస్థితి ఇలాగే కొనసాగితే దేశంలో దిగుమతి ఆధారిత అనేక ఉత్పత్తుల ధరలు భారీగా పెరగనున్నాయి. చమురు ధరలు ఎగిసిపడనున్నాయి. అధిక ధరలతో ఇప్పటికే ప్రజలు తీవ్ర బెంబేలెత్తుతున్నారు. విదేశీ అప్పులు తీవ్ర భారం కానున్నాయి. కేంద్ర ప్రభుత్వం ప్రజలపై మరింత పన్నుల భారాన్ని మోపనుంది. ద్రవ్యోల్బణం ఎగిసిపడనుంది. వృద్ధి రేటుపై ప్రతికూల ప్రభావం పడనుంది. ఈ చర్యలను కట్టి చేసేందుకు ఆర్థిక ప్రణాళికలు అవసరం. విదేశాల నుంచి దిగుమతలుపై కఠిన ఆంక్షలు విధించాల్సిందే. అలాగే మన పంట విధానాలను సమీక్షించి ఎగుమతులను ప్రోత్సహించాలి. కరెంట్ ఖాతా లోటు, వాణిజ్య లోటు వాటి లోతెంతో చూపిస్తున్నాయి. విదేశీ రుణం పెరిగి పోయింది. రూపాయి నిలువునా పతనమయ్యింది. వీటికి తోడు చమురు, పెట్రో కంపెనీలపై రూ.లక్ష కోట్ల ఆదాయాన్ని తెచ్చేందుకు పన్నులు వడ్డించారు. బంగారం పై సుంకాలు వేసి ధరలు పెంచేశారు. జీఎస్టీ మినహాయింపులో ఉన్న నిత్యావసరాలపై కూడా పన్ను వేశారు. ఆర్థిక మంత్రి చెప్పినట్టు కేంద్ర ప్రభుత్వానికిది ఇప్పుడు అసాధరణ పరిస్థితే. ఆర్థిక వ్యవస్థను ఎలా గాడిన పెట్టాలో దిక్కుతోచని స్థితి ఏర్పడింది. వచ్చే కొద్ది నెలల్లో అమెరికా, ఇతర పశ్చిమ దేశాలు మాంద్యంలో చిక్కుకొంటే, భారత ఆర్థిక వ్యవస్థ సైతం తీవ్ర సంక్షోభంలోకి జారుకొంటుందని విశ్లేషకులు అంటున్నారు. బ్యాంకింగ్, కరెన్సీ, రుణ సంక్షోభాలు ముంచెత్తుతాయని అంతర్జాతీయ సంస్థలు హెచ్చరిస్తున్నాయి. కేంద్ర తక్షణమే దిద్దుబాటు చర్యలు తీసుకోకపోతే వృద్ధి రేటు కుప్పకూలు తుందని ఇప్పటికే పలుమార్లు హెచ్చరించారు.

# ఎపిలో ఆందోళన కలిగిస్తున్న ప్రమాదాలు

## పాత్ర ఏదైనా పరకాయ ప్రవేశమే-అరుదైన నటుడు మన గుమ్మడి

## నేడు ఆయన జయంతి సందర్భంగా నివాళి

హైదరాబాద్,జూలై8(సమయజ్యోతి ):

తెలుగు చలన చిత్రసీమలో ఏ పాత్రనయినా అవలీలగా పోషించి, మెప్పించ గలిగిన నటుల్లో దివంగత గుమ్మడి వెంకటేశ్వరరావుముందుండేవారు. ఆయన పోషించని పాత్ర లేదు. దశరథుడు, బలరాముడు, మహామంత్రి తిమ్మరుసు లాంటి బలమైన పాత్రలను అవలీలగా పోషించిన మహానుభావుడు గుమ్మడి. నేడు ఆయన జయంతి సందర్భంగా ఈ తరం ఆయన నటించిన పాత్రల గురించి తెలుసుకుంటే మంచిది. విలనిజంతో పాటు, తండ్రి పాత్రలకు ఆనే సాటి. రెంటిలోనూ పరకాయ ప్రవేశం చేసి ఏడిపించే సమర్థుడు ఆయన. ఆ ఠీవి, దర్పం చూసినా, ఆ గొంతులోంచి జాలువారే సుస్పష్టమైన తెలుగు పదాలు విన్నా ఇంకాసేపు ఆయన అలాగే తెరమీద కనబడితే బావుండుననే అనిపిస్తుంది. మాయాబజార్‌లో బల రాముడిగా అద్భుత నటన కనబర్చారు. తనకంటే వయసులో పెద్దవారైన హీరోలకు అనేక చిత్రాల్లో తండ్రిగాను, మామగాను నటించి, ఒక ముద్ర వేయించేసుకున్నాడు. నిజానికి ఆయన నటించిన ఏ చిత్రంలోనూ తన శరీరాకృతిని కోల్పోలేదన్న విషయాన్ని మనం చూడొచ్చు. చక్కని రూపంతో, కనీసం గుప్పెడు పొట్ట కూడా కనబడని అంత అందమైన తండ్రికి తనకన్నా పెద్దవారైన హీరోలు కొడుకులుగా నటిస్తూ వచ్చారు. ఎన్ఎఆర్,ఎన్టీఆర్ లాంటి వారికి తండ్రిగా, మామగా నటించిన ఘనత గుమ్మడిదే. పేద బ్రాహ్మడి వేషం వేసినా, రాజగురువుగా వేసినా ఆ పాత్ర గుమ్మడి చేయాల్సిందే. ఆయన నటనతో ఏడిపించేవాడు. సినిమా మాధ్యమానికి ఇంత శక్తి ఉంటుందా? ఇలా ఏడిపించగల ప్రతిభావంతమైన నటనను ఆయనకు ఏ దేవుడు ప్రసాదించాడన్న అనుమానమూ కలుగుతుంది. కైక వరమడిగినప్పుడు దశరథుడి ఆక్రోశం, ఆవేదన చూస్తే గుమ్మడితో పాటుగా మనకూ గుండె పట్టేస్తుంది. ఆ తండ్రిమనసు ఎంత తల్లడిల్లిపోయిందో, ఎంత వేదన అనుభవించాడో స్వయంగా తనకుతానే దశరథుడిగా మారిపోయి, తన స్వంత కుమారుణ్ణే వదులుకుంటున్నంత విషాదాన్ని అణువణువునా శరీరమంతా నింపుకుని అద్వితీయమైన నటనతో మనందరినీ ఏడిపించేస్తాడు గుమ్మడి. అదంతా దర్శకత్వ ప్రతిభ ఒక్కటే కాదు. ఆ పాత్రలన్నీ గుమ్మడి కోసమే ఉద్భవించాయి. అదే గుమ్మడి భృగుమహర్షిలా విపరీతమైన అహంకారాన్ని ప్రదర్శిస్తూ 'వెంకటేశ్వర మహాత్మ్యం' చిత్రంలో మనందరినీ ఆశ్చర్యపరుస్తాడు. ఇక దురదృష్టవశాత్తు గుండెపోటుకీ, గుమ్మడికీ లంకె పెట్టి, అనేక చిత్రాల్లో ఆయన్ని మంచాన పడెయ్యడమో, పాత్రకు మంగళం పాడయ్యడమో చేశారు దర్శకులు. దానికీ ఆయనే న్యాయం చేశారు. ఇకపోతే సమాజంలో దర్జాగా ఉండే, డాబు ప్రదర్శించే కంపెనీ ఓనర్‌గా కూడా బ్లాక్ కలర్ సూటులో, చేతిలో పైపుతో గుమ్మడిని చూస్తే..ఎంత అందం, ఠీవి గోచరిస్తాయి. ఎన్ని సంవత్సరాలుగా పరిశ్రమలో ఉన్నా ఇప్పటికీ గట్టిగా నాలుగు సంభాషణల్ని కూడా తప్పుల్లేకుండానో, భావం కోల్పోకుండానో పలకగలిగే సామర్థ్యం మాత్రం శూన్యం. కేవలం ఆకారమొకటే కాకుండా నవరసాలనూ అవలీలగా పోషించగల సహజనటుడు మాత్రం గుమ్మడి ఒక్కడే! కొందరు దర్శకులు కాస్త పక్కదారి పట్టి గుమ్మడి చేత ప్రతినాయక పాత్రల్లో నటింపజేశారు. అయితే ఆయన ఎంత కాఠిన్యాన్ని ప్రదర్శిస్తున్నా అందులో కూడా ఇమిడిపోయారు. అప్పాజీగా గుమ్మడి, కృష్ణదేవరాయలుగా ఎన్టీఆర్..ఇంత కన్నులపంటకు ఏ భాషా ప్రేక్షకులూ నోచుకుని ఉండరేమో? అద్వితీయమైన నటన, భాషాసౌందర్యం, ఉచ్చారణాపరంగా చెవులకు హాయిగొలిపే ఆ ఇద్దరి సంభాషణలు, మూడుగంటల పాటు- విజయనగర సామ్రాజ్యంలో



విహరించి వచ్చేస్తాం మనందరం. గుమ్మడి లాంటి నటుణ్ణి చూసిన తరం ఇప్పుడు అలాంటి నటులను చూడలేకపోతోంది.

# స్థితప్రజ్ఞతతోనే మానసిక ప్రశాంతత ! ( ఆధ్యాత్మిక చింతన )

తిరుమల,జూలై8(సమయజ్యోతి ):

కష్టసుఖాలను సమానంగా స్వీకరిస్తూ స్థితప్రజ్ఞత అలవాటు చేసుకుంటే మానసిక ప్రశాంతత చేకూరుతుంది. జీవితమంటేనే నిత్య సంఘర్షణ. కష్టాలు, సుఖాలు, దఃఖాలు ఉండనే ఉంటాయి. అవి నిరంతరం మనలను వెన్నంటి ఉంటాయి. ఎవరి జీవితం కూడా పూలపాన్పులా ఉండదు. డబ్బు ఉన్నవారుకూడా మరింత డబ్బు సంపాదించేక్రమంలో సుఖాన్ని పొందడం లేదు. పదవులు ఉన్నవారు ఉన్నత పదవుల కోసమో, పదవులను రక్షించుకోవడం కోసమో ప్రశాతం జీవనం సాగించడం లేదు. జీవితం ఉలా ఉన్నా...స్థిమితంగా ఉండడం అన్నది అలవాటు వల్ల వచ్చే విద్య. దీనికి మనం సిద్ధంగా ఉంటే చాలు. మనస్సును అదుపులో పెట్టుకోగలిగితే ఏదైనా సాధించవచ్చు. సంతోషంగా ఉండేవాడిలో కక్షలు, కార్పణ్యాలు కనిపించవు. ఇతర ఏ పట్టింపులూ ఉండవు. డబ్బుతో అధికారంతో ప్రమేయం ఉండదు. నిజానికి వారికి శత్రువులే ఉండరు. కొందరు ఎన్ని కష్టాలనైనా అవలీలగా భరిస్తారు. అనారోగ్యం సంసార బాధ్యతలు ఒంటరితనం లాంటి ఎన్నో సమస్యలను ఎదుర్కొంటూనే ఉల్లాసంగా కనిపిస్తారు. మంచి అలవాట్లు జీవనశైలి సైతం సంతోషాన్నిస్తాయి. భూటాన్ రాజ్యం ధనిక దేశం కాదు. కానీ, అక్కడి ప్రజలు ఎప్పుడూ ఆనందంగా ఉంటారట. చాలావరకు వారంతా వజ్రయాన బౌద్ధులు. తొలి శతాబ్దంలో భారతదేశం నుంచి భూటాన్ వెళ్ళిన బౌద్ధ సన్యాసి పద్మసంభవుడు వారికి గురువు. ఆనందంగా జీవించడంలో దైవత్వం ఇమిడి ఉందని ఆయన చెప్పిన సూత్రాన్ని అక్కడి ప్రజలు ఇప్పటికీ నమ్ముతారు. అలాంటి జీవన విధానాలనే పాటిస్తారు. ఆనంద స్థితిని అందుకోవడం కష్టతరం కాదని బుద్ధుడి తొలి శిష్యుల్లో ఒకడైన ఆనందుడు రాసిన దమ్మమార్గం చెబుతోంది. ఆనందం అంతరాంతరాళాల్లోంచి ఉబికి వచ్చేది. అనుభవానికి మరే ఇతర లౌకిక ఊరటకు సంబంధం లేదు. అదొక మధురానుభూతి.

# సిటీసివిల్ కోర్టుకు బాంబు బెదిరింపు

హైదరాబాద్,జూలై8(సమయజ్యోతి ):

నగరంలోని పాతబస్తీ సిటీ సివిల్ కోర్టు ప్రాంగణంలో మంగళవారం ఉదయం బాంబు బెదిరింపు ఫోన్ కాల్ కలకలం సృష్టించింది. ఈ ఘటనతో కోర్టు పరిసరాల్లో ఉద్రిక్తత చోటుచేసుకుంది. భద్రతా దళాలు, పోలీసులు అప్రమత్తమవుతూ, కోర్టులోని అన్ని కార్యకలాపాలను తాత్కాలికంగా నిలిపివేశారు. ఈ ఫోన్ కాల్ వస్తూనే అధికారులు ఎలాంటి ప్రమాదం జరుగకుండా అతి వేగంగా స్పందించారు. చీఫ్ మెజిస్ట్రేట్ కోర్టును వెంటనే ఖాళీ చేయించి, తనిఖీలకు అనుమతిని ఇచ్చారు. అనంతరం కోర్టు ప్రాంగణంలోని అన్ని కోర్టులను మూసివేసి, అక్కడ ఉన్న న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, కేసుల కోసం వచ్చిన ప్రజలను వెంటనే బయటకు పంపించారు. బాంబు బెదిరింపుతో అప్రమత్తమైన బాంబ్ డిస్పోజల్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్‌లు సిటీ- సివిల్ కోర్టు ప్రాంగణానికి చేరుకొని తనిఖీలు ప్రారంభించాయి. ప్రతి కోణాన్ని సమీక్షిస్తూ, కోర్టు భవనం అంతటా జాగ్రత్తగా తనిఖీలు చేపట్టారు. కోర్టు సమీపంలోని పాత సీపీ కార్యాలయం ఉండటంతో భద్రతను మరింత కఠినంగా పర్యవేక్షిస్తున్నారు. ఈ అనూహ్య ఘటనపై అధికారులు పరిస్థితిని సమీక్షిస్తూ, ఫోన్ కాల్ ఉద్భవించిన మూలాన్ని గుర్తించే పనిలో ఉన్నారు. ఈ బెదిరింపు కాల్ నకిలీగా ఉందా లేదా వాస్తవమైనదా అనే దానిపై ఇంకా స్పష్టత రాలేదు. స్థానికులు, న్యాయవాదులు, కోర్టు ఉద్యోగుల్లో భయాందోళనలు వ్యక్తమయ్యాయి. ఇలాంటి భద్రతా బెదిరింపులు పెరుగుతున్న నేపథ్యంలో, భవిష్యత్‌లో కోర్టుల భద్రతపై మరింత శ్రద్ధ పెట్టాల్సిన అవసరం స్పష్టంగా కనిపిస్తోంది.

# రామునిడి జన్మస్థలం నేపాల్

## శివుడూ..విశ్వామిత్రుడు కూడా మావారే

## నేపాల్ ప్రధాని ఓలి వివాదస్పద వ్యాఖ్యలు

ఖాట్మండ్,జూలై8(సమయజ్యోతి ):

శ్రీ రాముడు నేపాల్ వాసి అని, ఇక్కడే పుట్టాడని ఆయన జన్మస్థలంపై నేపాల్ ప్రధానమంత్రి కేపీ శర్మ ఓలి మరోసారి వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. రాముడు తమ దేశంలోనే జన్మించాడని ఆయన పేర్కొన్నారు. అలాగే భగవాన్ శంకర్, విశ్వామిత్ర మహర్షి కూడా ఇక్కడే పుట్టారని అన్నారు. అందుకు తగిన ఆధారాలు ఉన్నాయని అన్నారు. కాఠ్‌మాండులో జరిగిన పార్టీ కార్యక్రమంలో ఓలి పాల్గొని ఈ వ్యాఖ్యలు చేశారు. శ్రీరాముడు నేపాల్‌లోనే జన్మించాడని ఓలి పునరుద్ఘాటించారు. వాల్మీకి రాసిన అసలైన రామాయణం ఆధారంగానే తాను ఈ మాట చెబుతున్నానని తెలిపారు. ఈవిషయం ప్రచారం చేయడానికి దేశ ప్రజలు ఏమాత్రం సంకోచించవద్దని పిలుపునిచ్చారు. రామ జన్మస్థలంపై ఎవరైనా వేరే కథలను ఎలా సృష్టించగలరని ప్రశ్నించారు. రాముడు పుట్టిన స్థలం నేపాల్‌లోనే ఉందని, అది ఇప్పటికీ అక్కడే ఉందన్నారు. దీన్ని తాము అంతగా ప్రచారం చేయలేకపోతున్నామని వ్యాఖ్యానించారు. అది కొందరిని బాధిస్తుందని తాను భావిస్తున్నానన్నారు. ఈసందర్భంగా ఆయన శివుడు, విశ్వామిత్రుడు కూడా తమ దేశంలోనే జన్మించారని పేర్కొన్నారు. ఇది తాను సొంతంగా చెబుతున్నది కాదని, వాల్మీకి రాసిన రామాయణంలోనే ఇది కూడా ఉందన్నారు. ఇక, గతంలోనూ ఓలి ఇలాంటి వివాదాస్పద ప్రకటనలే చేశారు. 2020లో అయోధ్య తమ దేశంలోని చిత్వాన్‌లోని థోరిలో ఉందని పేర్కొన్నారు. ఇక్కడే రాముడు పుట్టాడని ఆయన అన్నారు. అలాగే దశరథుడు పుత్రకామేష్ఠి యాగం చేసిన ప్రాంతం కూడా తమ దేశంలోనే ఉందన్నారు. అప్పట్లో ఓలి చేసిన ఈ వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. ఈక్రమంలో నేపాల్ విదేశాంగ శాఖ ఓ ప్రకటనను విడుదల చేసింది. ఎవరి మనోభావాలు దెబ్బతీయడానికి ప్రధాని ఈ వ్యాఖ్యలు చేయలేదని స్పష్టం చేసింది. రాముడు జన్మస్థలంపై అనేక అభిప్రాయాలు ఉన్నాయని.. రామాయణంపై విస్తృతమైన సాంస్కృతిక, భౌగోళిక అధ్యయనం జరపాల్సిన అవసరం ఉందని మాత్రమే చెప్పారని తెలిపింది.



# భద్రాచలం ఇవోపై దాడి దుర్మార్గం

## చంద్రబాబు వెంటనే స్పందించాలన్న మంత్రికొండా సురేఖ

హైదరాబాద్,జూలై8(సమయజ్యోతి ):

భద్రాచలం ఈవో రమాదేవిపై జరిగిన దాడి ఘటనపై మంత్రి కొండా సురేఖ తీవ్రంగా స్పందించారు. ఈవోలపై దాడి చేస్తే ఊరుకునేది లేదన్నారు. దేవాలయ భూములను కబ్జా చేస్తే పీడీ యాక్ట్ పెడతామని హెచ్చరించారు. ఈ సమస్యను పరిష్కరించాలని ఏపీ సీఎం చంద్రబాబును కొండా సురేఖ కోరారు. ఏపీలోని పురుషోత్తపట్నంలో భద్రాచలం రామాలయానికి చెందిన భూముల్లో ఆక్రమణలను అడ్డుకునేందుకు మంగళవారం ఈవోతో పాటు సిబ్బంది వెళ్లారు. ఈవోపై గ్రామస్థులు దాడి చేశారు. దీంతో ఆమె స్పృహ కోల్పోయారు. ప్రస్తుతం ఈవో రమాదేవి భద్రాచలం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ దాడిని తీవ్రంగా పరిగణిస్తున్నామని అన్నారు. ఎపి ప్రభుత్వం వెంటనే తగిన చర్యలు తీసుకోవాలన్నారు.

# రిజర్వాయర్లకు చేరని వాననీరు

## చేపపిల్లల పంపిణీ పథకంపై ఆశ - మత్స్యకారుల ఎదురుచూపు

ఆదిలాబాద్,జూలై8(సమయజ్యోతి ):

ఈ యేడు జిల్లాలో సాధారణ వర్షపాతమే కనిపిస్తుంది. వానాకాలం ప్రారంభమై నెల రోజులు గడిచి పోయిన అంతంత మాత్రంగానే వర్షపాతం నమోదైంది. దీంతో చెరువులు, కుంటలు, ప్రాజెక్టుల్లోకి స్వల్పంగానే వరద నీరు వచ్చి చేరుతోంది. దీంతో ఇప్పుడున్న పరిస్థితుల్లో చేప పిల్లలను వదలడం సాధ్యపడదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఆశించిన స్థాయిలో చెరువులు, కుంటల్లో నీటి నిల్వలు కనిపించడం లేదు. ఎగువ ప్రాంతంలో వర్షాలు కురవక పోవడంతో ఆశించిన స్థాయిలో వరదనీరు రావడం లేదు. భారీ వర్షాలు కురుస్తే కానీ ప్రాజెక్టుల్లోకి వరద నీరు చేరుకునే అవకాశాలు కనిపించడం లేదు. ఈ ఏడు ఇప్పటి వరకు మోస్తారు స్థాయిలోనే వర్షాలు కురుస్తున్న భారీ వర్షాల జాడ కనిపించడం లేదు. బిఆర్ఎస్ హయాంలో ప్రభుత్వం మత్స్యకార కుటుంబాలను ఆర్థికంగా ఆదుకునేందుకు ఏటా ఉచితంగా చేప పిల్లలను పంపిణీ చేసినా పెద్దగా ఫలితం కానరాలేదు. ఈ ఏడాది కూడా చేప పిల్లలను మత్స్యశాఖ అధికారులు పంపిణీ చేస్తారా లేదా అన్న అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో 68 మత్స్య పారిశ్రామిక సహకార సంఘాలు ఉన్నాయి. ఇందులో మత్స్యశాఖ పరిధిలో 62 చెరువులు, గ్రామ పంచాయతీ పరిధిలో 220, మరో రెండు రిజర్వాయర్లు ఉన్నాయి. చెరువులు, కుంటల్లో 35-40మి.మీ. సైజు రిజర్వాయర్ ప్రాజెక్టుల్లో 80-100 మి.మీ. సైజు చేప పిల్లలను వదలనున్నారు. ప్రధానంగా సాత్నాల, మత్తడివాగు రిజర్వాయర్లలో రొయ్య పిల్లలను విడుదల చేసేందుకు ఏర్పాట్లు చేసారు. మొత్తం 68 సొసైటీల పరిధిలో 4230 మంది మత్స్యకార్మికులు ఉన్నారు. పెంచిన చేపలను మార్కెట్‌కు తరలించి విక్రయించేం దుకు కార్మికులకు వాహనాలు, వలలను సబ్సిడీపై ప్రభుత్వమే అందించింది. అయితే ఈ వ్యవహారంలో అంతా అవినీతి చోటుచేసుకుందన్న విమర్శలు ఉన్నాయి. దీంతో ఈ ఏడాది కూడా చేప పిల్లలను వదిలేందుకు అధికారులు ఇంకా ఎలాంటి ప్రకటనా చేయయలేదని అంటున్నారు. వర్షాలు సంమృద్ధిగా కురిస్తే మరిన్ని చెరువులు, కుంటలలో చేప పిల్లలను పెంచాలని మత్స్యకారులు భావిస్తున్నారు. స్థానికంగా మంచి డిమాండ్ ఉన్న కట్ల, రోకు, బొచ్చ, బంగారుతీగ లాంటి చేప పిల్లలను సరఫరా చేయాలని మత్స్యకారులు కోరుతున్నారు. గ్రామ పంచాయతీ, మున్సిపాలిటీల్లో చేపల మార్కెట్‌ను నిర్మించేందుకు స్థలాలను గుర్తించి ఇస్తామని గత సర్కార్ ప్రకటించినా కార్యరూపం దాల్చలేదు. జిల్లాలో అందుబాటులో ఉన్న రిజర్వాయర్, ప్రాజెక్టులలో రొయ్యల పెంపకం పై అధికారులు ప్రత్యేక దృష్టిని సారిస్తే ఉపాధి పురుగుతుందని అంటున్నారు. ప్రధానంగా సాత్నాల, మత్తడివాగు, చిక్‌మాన్ ప్రాజెక్టులలో చేప పిల్లల పెంపకంతో పాటుయ్యల పెంపకంపై దృష్టి సారించారు. ప్రాజెక్టులు, రిజర్వాయర్లలో ఏడాదంతా సరిపడా నీటి నిల్వలు ఉండే అవకాశం ఉండడంతో రొయ్యల పెంపకానికి ఎంతో అనుకూలంగా ఉంటుందని చెబుతున్నారు. అలాగే మార్కెట్‌లో రొయ్యలకు మంచి డిమాండ్ కూడా ఉండడమే వీటి పెంపకానికి ఆసక్తి చూపుతున్నారు. రొయ్యల పెంపకంతో మత్స్య కార్మికులకు 3 కాలాల పాటు ఉపాధి దొరకడంతో పాటు అధిక లాభాలు వచ్చే అవకాశం ఉందంటున్నారు. కానీ చేపలు పెంచే రిజర్వాయర్ ప్రాజెక్టుల్లో రొయ్యలను పెంచితే సరైన దిగుబడులు రావని మత్స్యకార్మికులు పేర్కొంటున్నారు.

# మంత్రి వివేక్‌తో జర్మనీ బృందం భేటీ

## నర్సింగ్ విద్యార్థులకు జర్మన్ భాషా బోధనపై చర్చ

హైదరాబాద్,జూలై8(సమయజ్యోతి ):

జర్మనీ ప్రభుత్వానికి ప్రాతినిధ్యం వహిస్తున్న ప్లేస్‌మెంట్ అధికారుల ప్రతినిధి బృందం మంగళవారం తెలంగాణ సచివాలయంలో రాష్ట్ర కార్మిక, ఉపాధి, శిక్షణ శాఖ మంత్రి డా.వివేక్ వెంకట స్వామితో సమావేశమయ్యారు. శాఖ ముఖ్య కార్యదర్శి, తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ లిమిటెడ్ వైస్ చైర్‌పర్సన్ దాన కిషోర్, తదితరులు పాల్గొన్నారు.ఈ బృందంలో శ్రీమతి బియాంకా మరియా కుంజ్, శ్రీమతి డిజెజ్నా హర్టిక్, అబ్దుల్‌రహ్మాన్ అల్తాహ్లేహ్ పాల్గొన్నారు. వీరితో పాటు- ఏఒ ఇండియా నుండి సీనియర్ ప్రతినిధులు కూడా ఉన్నారు. ఫెడరల్ రిపబ్లిక్ ఆఫ్ జర్మనీ, తెలంగాణ ప్రభుత్వం మధ్య ఉమ్మడి చొరవ అయిన ట్రిపుల్ విన్ ప్రాజెక్ట్ లో భాగంగా ఈ ప్రతినిధి బృందం హైదరాబాద్‌లో ఉంది. జర్మనీ అంతటా ఉన్న ప్రఖ్యాత ఆరోగ్య సంరక్షణ సంస్థలలో తెలంగాణ నుండి అర్హత కలిగిన నర్సులకు ఉచిత జర్మన్ భాషా శిక్షణ, ప్లేస్‌మెంట్ అవకాశాలను అందించడం ఈ కార్యక్రమం లక్ష్యం.ఈ సమావేశంలో మంత్రి మాట్లాడుతూ, నర్సింగ్, ఇతర రంగాలకు, ముఖ్యంగా జర్మనీ ఆస్బిల్‌డంగ్ ప్రోగ్రామ్ కింద ఐటీఐ విద్యార్థులకు ప్రయోజనం చేకూర్చేలా ఇటువంటి అంతర్జాతీయ సహకారాలను విస్తరించడం యొక్క ప్రాముఖ్యతలను తేలియజేశారు. సహకారానికి కొత్త మార్గాలను ప్రారంభించడంలో ఆయన ఆసక్తిని వ్యక్తం చేశారు. సంస్థ భవిష్యత్తులో ఇటు-వంటి ప్రాజెక్టులను చురుకుగా కొనసాగి అమలు చేస్తుందని తెలిపారు. ప్రస్తుత నియామక ప్రక్రియలో భాగంగా ప్రతినిధి బృందం జూలై 9 నుండి 17 వరకు బేగంపేటలోని పర్యాటక భవన్‌లో తెలంగాణ నర్సుల ఇంటర్వ్యూలను నిర్వహిస్తోంది. జూలై 2024లో ఇంటర్వ్యూ చేయబడిన 2024 బ్యాచ్ కింద ఎంపికైన నర్సులు ఇ1-స్థాయి జర్మన్ భాషా శిక్షణను విజయవంతంగా పూర్తి చేశారు. వీసా, డిప్లాయ్‌మెంట్ ఫార్మాలిటీ-లు పూర్తయిన తర్వాత అక్టోబర్-నవంబర్ 2025 నాటికి జర్మనీకి వెళ్తారని తెలిపారు. బృందం సందర్శనలో భాగంగా, తార్నాకలోని నర్సింగ్ కళాశాలలో నర్సింగ్ విద్యార్థులతో కూడా కలిసారు, అక్కడ వారు జర్మనీలో భారతీయ నర్సులకు తగు జీతంతో పాటు- ఇతర ప్యాకేజీలు, కుటుంబ వీసా స్పాన్సర్‌షిప్, దీర్ఘకాలిక సెటిల్‌మెంట్ ఎంపికలతో సహా విస్తారమైన కెరీర్ అవకాశాలను వివరించారు. ఈ ఇంటరాక్టివ్ సెషన్‌కు విద్యార్థులు, అధ్యాపకుల నుండి ఉత్సాహభరితమైన స్పందన లభించింది. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వసుంధర, ప్రభుత్వం అందిస్తున్న అంతర్జాతీయ అవకాశాలను ఉపయోగించుకోవాలని విద్యార్థులను ప్రోత్సహించారు. విదేశీ కెరీర్ మొబిలిటీని ప్రోత్సహించడంలో, స్థిరమైన అంతర్జాతీయ భాగస్వామ్యాలు, నైతిక నియామక కార్యక్రమాల ద్వారా రాష్ట్రంలోని నైపుణ్యం కలిగిన యువతకు ప్రపంచ ఉపాధి మార్గాలను తెరవడంలో కీలక పాత్ర పోషిస్తోంది.



# రాష్ట్రపతి,మాజీ రాష్ట్రపతి పేర్లు తప్పుగా ఉచ్చారణ

## ఛత్తీస్‌గడ్ పర్యటనలో ఖర్గే వ్యాఖ్యలపై బిజెపి విమర్శలు

రాయ్‌పూర్,జూలై8(సమయజ్యోతి ):

ఛత్తీస్‌గఢ్‌లోని ఓ సభలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ప్రసంగిస్తూ.. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, మాజీ రాష్ట్రపతి రామ్ నాథ్ కోవింద్ పేర్లను తప్పుగా ఉచ్చరించారు. ఈ అంశంపై బీజేపీ నుంచి తీవ్ర విమర్శలు ఎదుర్కొన్నారు. రాయ్‌పూర్‌లోని సైన్స్ గ్రౌండ్‌లో జరిగిన ప్రసంగానికి సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఇందులో ఖర్గే రాష్ట్రపతిని 'ముర్మా జీ' అని ఉచ్చరించారు. అయితే.. ఆయన వెంటనే సరిదిద్దుకుని 'ముర్ము' అని పలికారు. కొన్ని సెకన్ల తర్వాత.. మళ్ళీ మాజీ రాష్ట్రపతి పేరును తప్పుగా ఉచ్చరించారు. 'కోవింద్' ను 'కోవిడ్' అని పలికారు. ఛత్తీస్‌గఢ్ అడవుల్లో పెద్ద ఎత్తున చెట్ల నరికివేత అంశంపై మాట్లాడుతూ మల్లికార్జున ఖర్గే ఈ తప్పు చేశారు. బీజేపీ, దాని పారిశ్రామిక మిత్రులు భూమిని లాక్కుంటున్నారని ఆయన ఆరోపించారు.'మన నీరు, అడవి, భూమిని కాపాడుకోవాలి. మనం ఐక్యంగా ఉండాలి. వారు (బీజేపీ) (ద్రౌపది) ముర్మాను రాష్ట్రపతిగా, (రామ్ నాథ్) కోవిడ్ (కోవింద్)ను రాష్ట్రపతిగా చేశామని అంటున్నారు. కానీ మన వనరులను, మన అడవి, నీరు, భూమిని దొంగిలించడానికి ప్రయత్నిస్తున్నారు. నేడు, అదానీ, అంబానీ వంటి వ్యక్తులు దానిని స్వాధీనం చేసుకుంటున్నారని ఖర్గే వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ చీఫ్ పై బీజేపీ తీవ్ర విమర్శలు గుప్పించింది. ఆయన చేసిన తప్పును మహిళా, దళిత, గిరిజన వ్యతిరేకి అని అభివర్ణించింది. బీజేపీ అధికార ప్రతినిధి గౌరవ్ భాటియా మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధ్యక్షురాలు ద్రౌపది ముర్ముపై అభ్యంతర కరమైన పదాలను ఉపయోగించారు. మొత్తం గిరిజన సమాజం దీనిని ఖండిస్తోంది. మాజీ రాష్ట్రపతి రామ్ నాథ్ కోవింద్ ను ఉద్దేశించి కూడా ఆయన కోవిడ్ లాంటి పదాలను ఉపయోగించారు. కాంగ్రెస్ అధ్యక్షుడు రాష్ట్రపతి ద్రౌపది ముర్మును ముర్మా జీ అని, కోవింద్ జీని కోవిడ్ జీ అని పిలవడం కాంగ్రెస్‌కు ఎస్సీ, ఎస్టీ వర్గాల పట్ల తీవ్ర ద్వేషాన్ని తెలియజేస్తుందని అన్నారు.

# గరివిడి వెటర్నరీ కాలేజీకి శాశ్వత సభ్యత్వం

## మంత్రి అచ్చన్నాయడుకు కేంద్రమంత్రి హామీ

న్యూఢిల్లీ,జూలై8(సమయజ్యోతి ):

విజయనగరం జిల్లా గరివిడిలోని వెటర్నరీ కాలేజ్‌పై కేంద్ర ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. ఆ కాలేజ్‌కి శాశ్వత సభ్యత్వం కొనసాగించేందుకు మోదీ ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఈ కాలేజ్‌లో చివరి సంవత్సరం చదివే విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ సదుపాయం కూడా కల్పించాలని ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. విద్యార్థులను మరో కాలేజ్‌కి తరలించి వెసులుబాటు- కల్పించేందుకు కేంద్రమంత్రి లలన్ సింగ్ అంగీకరించారు. గత జగన్ ప్రభుత్వ నిర్వాకంతో గరివిడి కాలేజ్‌కి అనుమతులని కేంద్ర ప్రభుత్వం నిలిపివేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గరివిడిలోని వెటర్నరీ కాలేజ్‌పై ప్రత్యేక దృష్టి సారించింది. ఈ కాలేజ్‌పై కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు, ఏపీ వ్యవసాయ శాఖా మంత్రి అచ్చెన్నాయుడు ప్రత్యేకంగా దృష్టి సారించారు. ఢిల్లీలో కేంద్ర పశుసంవర్ధక శాఖ మంత్రి లలన్ సింగ్‌తో ఇరువురు నేతలు ప్రత్యేకంగా భేటీ- అయ్యారు. గరివిడి కాలేజీకి ఉన్న ప్రాధాన్యతను కేంద్రమంత్రికి వివరించారు. 2018లో గరివిడి వెటర్నరీ కాలేజ్‌ని అప్పటి టీ-డీపీ ప్రభుత్వం ప్రారంభించింది. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన జగన్ ప్రభుత్వం ఈ కాలేజ్ అభివృద్ధికి ఎలాంటి చర్యలు తీసుకోలేదు. గత ఐదేళ్లుగా ఈ కాలేజ్ ఎలాంటి పనులకి నోచుకోకపోవడంతో కేంద్ర అధికారులు తనిఖీలు నిర్వహించలేదు. 2023లో జరిగిన తనిఖీల్లో ఈ కాలేజ్‌లో నిబంధనలకు అనుగుణంగా పురోభివృద్ధి లేకపోవడంతో కేందప్రభుత్వం అనుమతులని రద్దు చేసింది. వచ్చే నాలుగైదు నెలల్లో ఈ కాలేజ్‌లో నిబంధనలకు అనుగుణంగా అన్ని చర్యలు తీసుకుంటామని కేంద్రమంత్రి లలన్ సింగ్‌కి రామ్మోహన్, అచ్చెన్నాయుడు హామీ ఇచ్చారు. ఇరువురు నేతల హామీతో ఈ కాలేజ్‌కి అనుమతుల పునరుద్ధరణ చేస్తామని కేంద్ర మంత్రి లలన్ సింగ్ స్పష్టం చేశారు.

# భద్రాచలం ఇవో రమాదేవిపై ఎపిలో దాడి

## పురుషోత్తమపట్నం భూ ఆక్రమణదారుల ముష్కర దాడి

### హుటాహుటిన ఆస్పత్రికి తరలింపు

భద్రాచలం,జూలై8(సమయజ్యోతి ):

భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి ఇవోపై ఎపిలో దాడి జరిగింది. స్వామి వారి భూ ఆక్రమణలను అడ్డుకున్నందుకు దాడి చేశారు. దీంతో దాడిలో ఇవో రమాదేవి తీవ్రంగా గాయపడగా ఆమెను ముటాహుటిన భద్రాచలం ఆస్పత్రికి తరలించారు. వివరాల్లోకి వెళితే.. ఏపీలోని పురుషోత్తపట్నంలో ఉన్న ఆలయ భూముల్లో ఆక్రమణలను అడ్డుకునేందుకు ఆలయ ఈవో రమాదేవి వెళ్లారు. దీంతో ఆమెపై గ్రామస్థులు దాడి చేశారు. ఈవోతో పాటు- ఆలయ సిబ్బందిపైనా ఆక్రమణదారులు దాడికి పాల్పడ్డారు. ఈ క్రమంలో స్పృహ తప్పి పడిపోయిన ఈవోను ఆలయ సిబ్బంది భద్రాచలంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఆమెతో పాటు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి వినీల్ అస్వస్థతకు గురికావడంతో అతడికి కూడా చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం వాళ్లిద్దరూ కోలుకుంటున్నట్లు వైద్యులు తెలిపారు. అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాక మండలం పురుషోత్తపట్నంలో భద్రాచలం రామాలయానికి చెందిన 889 ఎకరాల భూమి ఉంది. చాలా కాలంగా ఇది ఆక్రమణలకు గురి అయింది. ఈ వ్యవహారంలో ఏపీ హైకోర్టు దేవస్థానానికి అనుకూలంగా తీర్పు ఇచ్చింది. ఆలయ భూములకు సంబంధించి దేవస్థానానికి పట్టాదారు పాసు పుస్తకాలు కూడా ఉన్నాయి. ఈ క్రమంలో నిర్మాణాలు చేపట్టవద్దని అడ్డుకునేందుకు వెళ్లిన ఈవోతో పాటు ఆలయ సిబ్బందిపై గ్రామస్థులు కర్రలతో దాడి చేశారు. ఆలయ ఈవోపై దాడిని భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు ఖండించారు. దేవస్థాన భూముల ఆక్రమణలపై అడిగేందుకు వెళితే దాడి చేయడం సరికాదన్నారు. దాడి చేసిన వారిపై పోలీసులు వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కోరారు.

# అమెరికాలో ఘోర రోడ్డు ప్రమాదం

## రాంగ్‌రూట్‌లో వచ్చి కారును ఢీకొన్న ట్రక్కు

## ప్రమాదంలో దంపతులు, ఇద్దరు పిల్లల మృతి

## కారులో మంటలుచెలరేగడంతో నలగురి దేహాలు బుగ్గి

హైదరాబాద్,జూలై8(సమయజ్యోతి ):

అమెరికాలోని గ్రీన్‌కౌంటీలో జరిగిన రోడ్డు ప్రమాదంలో హైదరాబాద్‌కు చెందిన ఒకే కుటుంబంలోని నలుగురు సజీవ దహనమయ్యారు. విహారయాత్రలో భాగంగా తమ కుటుంబ సభ్యుల దగ్గరికి వెళ్లి తిరిగివస్తున్న క్రమంలో రాంగ్ రూట్‌లో వచ్చిన ట్రక్కు ఢీకొనడంతో ఈ ఘోర ప్రమాదం జరిగింది. కారులో మంటలు చెలరేగడంతో దంపతులు, వారి ఇద్దరు పిల్లలు దుర్మరణం చెందారు. మృతులు హైదరాబాద్‌లోని తిరుమలగిరికి చెందినవారుగా గుర్తించారు. స్థానిక జూపిటర్ కాలనీకి చెందిన బెజిగం శ్రీవెంకట్(40), కొంపల్లి మున్సిపాలిటీ పరిధి ఎన్‌సీఎల్ నార్త్ ఎవెన్యూకు చెందిన చొల్లేటి తేజస్విని(36)కి 2013లో వివాహమైంది. ఇద్దరూ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు. వీరికి సిద్ధా(9), మృదా(7) అనే ఇద్దరు పిల్లలున్నారు. మూడున్నరేళ్ల కిందట శ్రీవెంకట్ ఉద్యోగరీత్యా అమెరికాలోని డాలస్ వెళ్లారు. ఇటీవల సెలవులు రావడంతో శ్రీవెంకట్ కుటుంబం అట్లాంటా వెళ్లింది. ఆదివారం తెల్లవారుజామున శ్రీవెంకట్, తేజస్వినిలు తమ పిల్లలతో కలిసి కారులో డాలస్‌కు తిరుగు ప్రయాణమయ్యారు. గ్రీన్‌కౌంటీ- వద్దకు రాగానే ప్రమాదం జరిగింది. రాంగ్ రూట్‌లో దూసుకొచ్చిన మినీ ట్రక్కు వెంకట్ కారును ఢీకొంది. కారులో మంటలు చెలరేగడంతో మృతదేహాలు బూడిదైనట్లు బంధువులు తెలిపారు. ప్రమాద స్థలంలో శ్రీవెంకట్ కుమారుడు సిద్ధార్థ పాఠశాల ఐడీ కార్డు లభ్యమైంది. దీని ఆధారంగా పాఠశాలకు వెళ్లి ఆరా తీయగా శ్రీవెంకట్ చిరునామా దొరికింది. ఆయన నివాసానికి వెళ్లగా తాళం వేసి ఉంది. నలుగురూ అట్లాంటాలోని దీపిక ఇంటికి వెళ్లినట్లు- తెలుసుకుని ఆమెకు సమాచారం ఇచ్చారు. ప్రమాద స్థలంలో సిద్ధార్థ మృతదేహంలో కొంత భాగం లభ్యమైంది. పోలీసులు డీఎన్‌ఏ నమూనాలు సేకరించి ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపారు.

# మదనపల్లె దస్త్రాల దహనం కేసులో ఆర్డీవో అరెస్ట్

మదనపల్లె,జూలై8(సమయజ్యోతి ):

అన్నమయ్య జిల్లా మదనపల్లెలోని సబ్‌కలెక్టర్ కార్యాలయంలో జరిగిన దస్త్రాల దహనం కేసులో మాజీ ఆర్డీవో మురళిని సీఐడీ అధికారులు అరెస్టు చేశారు.అనంతరం సుప్రీంకోర్టు ఆదేశానుసారం బెయిల్‌పై విడుదల చేశారు. దస్త్రాల దహనం ఘటన తర్వాత పరారీలో ఉన్న మురళి కోసం సీఐడీ అధికారులు మదనపల్లె, తిరుపతి, హైదరాబాద్‌లో విస్తృతంగా గాలించారు. చివరికి తిరుపతి కేఆర్ నగర్‌లో ఉన్నట్లు- తెలుసుకొని అరెస్టు చేసినట్లు- సీఐడీ డీఎస్పీ వేణుగోపాల్, సీఐ చంద్రశేఖర్ వెల్లడించారు. అంతకుముందు మురళి ముందస్తు బెయిల్ కోసం హైకోర్టులో పిటిషన్ వేయగా ఉన్నత న్యాయస్థానం తిరస్కరించింది. దీంతో అతడు సుప్రీం కోర్టును ఆశ్రయించారు. విచారణ చేపట్టిన సర్వోన్నత న్యాయస్థానం అరెస్టు అనంతరం బెయిల్ ఇవ్వాలని ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలోనే ఆయన్ను అరెస్టు చేసి బెయిల్‌పై విడుదల చేసినట్లు పోలీసులు తెలిపారు.

# ట్రంప్‌కు నోబెల్ శాంతి బహుమతా

## ఎక్స్ వేదికగా ఎద్దేవా చేసిన అసద్

హైదరాబాద్,జూలై8(సమయజ్యోతి ):

అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌కు నోబెల్ శాంతి బహుమతి ఇవ్వాలని పాకిస్తాన్, ఇజ్రాయిల్ ప్రతిపాదించడాన్ని ఎంఐఎం అధినేత, ఎంపి అసదుద్దీన్ ఓవైసీ ఆగ్రహం వ్యక్తం చేశారు. పాకిస్తాన్ ఆర్మీ చీఫ్ అసిమ్ మునీర్, ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు ఇద్దరూ డోనాల్డ్ ట్రంప్‌కు నోబెల్ శాంతి బహుమతి ఇవ్వాలని ప్రతిపాదించారని, అయితే మునీర్ భారతదేశంలో ఉగ్రవాదులను పంపించే కీలక వ్యక్తి అయితే, నెతన్యాహు అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు నుండి పారిపోయిన వ్యక్తి, అని అతను పాలస్తీనియన్లపై బహిరంగంగా మారణహోమానికి పాల్పడ్డాడని అసదుద్దీన్ ఆరోపించారు. వీరిద్దరి చర్యలకు యుఎస్ఎ ఆమోదం ఉందని అసదుద్దీన్ ధ్వజమెత్తారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఎక్స్ వేదికగా పోస్ట్ చేశారు.

# బిఆర్ఎస్ నిలదీస్తే గానీ కదలరా

## కల్వకుర్తి మోటర్లు ఆన్ చేయడం మా ఒత్తిడే

## మాజీమంత్రి హరీష్ రావు వ్యాఖ్యలు

హైదరాబాద్,జూలై8(సమయజ్యోతి ):

ఎట్టకేలకు కల్వకుర్తి మోటార్లు ఆన్ చేసి నీళ్లు విడుదల చేయడం బిఆర్ఎస్ , కెసిఆర్ విజయం అని మాజీ మంత్రి హరీష్ రావు వ్యాఖ్యానించారు. బిఆర్ఎస్ నిలదీస్తే గాని కాంగ్రెస్ ప్రభుత్వంలో కదలిక రాదా..తాము ప్రశ్నిస్తే తప్ప రైతుల నీటి సమస్యలు గుర్తు రావా..అంటూ కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రశ్నల వర్షం కురిపించారు. రేవంత్‌రెడ్డి రైతుల నోరు కొడుతున్నారు.. కడుపు కొడుతున్నరు అంటే గాని ఆలోచన రాదా..లక్షలాదిగా రైతులతో తరలి వచ్చి మోటార్లు ఆన్ చేస్తామంటే గాని చలనం ఉండదా..? అని నిలదీశారు. ఎగువ రాష్ట్రాల నుంచి వస్తున్న వరదను ఒడిసిపట్టాల్సింది పోయి, విడిచిపెట్టడం దుర్మార్గం అని మండిపడ్డారు. ఇకనైనా రాజకీయకక్ష సాధింపు చర్యలపై దృష్టి పెట్టడం మానేసి రైతాంగంపై దృష్టి సారించాలని హితవు పలికారు. కల్వకుర్తి వలే, కాళేశ్వరం మోటార్లు ఆన్ చేసి, రిజర్వాయర్లు నింపి పొలాలకు నీళ్లు మళ్లించాలని బిఆర్ఎస్ పక్షాన డిమాండ్ చేశారు. ఉపాధి హామీ ఎపిఒలకు మూడు నెలలుగా జీతాలు చెల్లించకపోవడం శోచనీయం అని మాజీ మంత్రి హరీష్‌రావు పేర్కొన్నారు. చేసిన పనికి వేతనాలు రాక ఉపాధి హామీ సిబ్బంది ఆర్థికంగా ఇబ్బందులు పడుతూ కుటు-ంబ పోషణ భారమై సతమతమవుతుంటే ఈ ప్రభుత్వం పట్టనట్లు- వ్యవహరించడం దుర్మార్గం అని ఎక్స్ వేదికగా మండిపడ్డారు.కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యానికి మనోవేదనకు గురై ఉపాధి హామీ ఉద్యోగులు ప్రాణాలు కోల్పోయే పరిస్థితి రావడం విచారకరం అని ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు పారిశుధ్య కార్మికులకు కూడా వేతనాలు రాక గ్రామాల్లో పారిశుద్ధం పడకేసిందని అన్నారు. ఎన్నికల సమయంలో హామీలతో ఊదరగొట్టిన కాంగ్రెస్ నాయకులు ఇప్పుడు ఏమని సమాధానం చెబుతారు..? ప్రశ్నించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ప్రభుత్వం తక్షణమే స్పందించి ఉపాధి హామీ ఎపిఒలు, పారిశుధ్య కార్మికుల పెండింగ్‌లో ఉన్న వేతనాలు వెంటనే చెల్లించాలని బిఆర్ఎస్ పక్షాన డిమాండ్ చేశారు.

# గాంధీభవన్ లో మహానేత వైఎస్సార్ జయంతి

## - నివాళులర్పించిన ఆత్రం సుగుణక్క.

**జన్నారే 8 జూలై (సమయజ్యోతి )**

హైదరాబాద్ లోని గాంధీభవన్ లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ సీఎం దివంగత వైఎస్ఆర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా మహిళ కాంగ్రెస్ నాయకురాళ్లతో కలిసి వైఎస్ఆర్ చిత్రపటానికి టీపీసీసీ ఉపాధ్యక్షురాలు,ఆదిలాబాద్ పార్లమెంట్ ఇంచార్జ్ ఆత్రం సుగుణక్క పూల మాల వేసి నివాళులు అర్పించారు.వైఎస్సార్ సేవలను స్మరించుకున్నారు.డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి కలలు కన్న సమాజాన్ని సాధించుకుందామని సుగుణక్క పిలుపునిచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా పాదయాత్ర చేసి ప్రజల సమస్యలు తెలుసుకొని.. ప్రజాసంక్షేమమే విధానంగా ప్రభుత్వం నడవాలని.. అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి, చిర స్థాయిగా ప్రజల గుండెల్లో నిలిచిన నాయకుడు వైఎస్సార్' అని అన్నారు.ఈ కార్యక్రమంలో ఇందిరా ఫెలోషిప్ నిర్మల్ జోనల్ ఇన్చార్జ్ కృష్ణవేణి రెడ్డి, ఇంద్రరావు, నిర్మల్ జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు భవాని తదితరులు పాల్గొన్నారు.





# చదువుతూనే మంచి గుర్తింపు వస్తుంది

## లయన్స్ క్లబ్ అధ్యక్షుడు లయన్ కొత్తపల్లి రంజిత్ కుమార్ న్యాయవాది,

**సమయజ్యోతి రాయికల్ జూలై 8**

రాయికల్ మండలం ఇటిక్యాల్ మోడల్ స్కూల్ మరియు కాలేజీలో డిస్టిక్ 320జి లయన్స్ క్లబ్ ఏర్పాటు అయి పది సంవత్సరాలు అయినా సందర్భంగా డిస్ట్రిక్ట్ గవర్నర్ సింహారాజు కోదండ రాములు పిలుపు మేరకు సోమవారం రోజున దశాబ్ది ఉత్సవాలు పురస్కరించుకొని లయన్స్ క్లబ్ అధ్యక్షుడు కొత్తపెల్లి రంజిత్ కుమార్ న్యాయవాది ఆధ్వర్యంలో ట్రిబుల్ ఐటీ లో సీటు సాధించిన విద్యార్థినులకు ఘనంగా సన్మానించి మెమొంటో సత్కరించడం జరిగింది . మరియు ఇటిక్యాల్ ప్రైమరీ స్కూల్లో సుమారు 50 మంది విద్యార్థిని విద్యార్థులకు నోటుబుక్కులు మరియు పెన్నులు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రధానకార్యదర్శి బొడుగం అంజిరెడ్డి, ఆదిరెడ్డి మండలోజు శ్రీనివాస్ కనపర్తి శ్రీనివాస్ మరియు విద్యాబోధన సిబ్బంది స్థానిక ప్రజాప్రతినిధులు మరియు పిల్లల యొక్క తల్లిదండ్రులు పాల్గొన్నారు.



# వైభవంగా రేణుక ఎల్లమ్మ తల్లి కళ్యాణం భారీగా హాజరైన భక్తులు

**శంషాబాద్ జూలై 8. సమయజ్యోతి**

ఘాన్సిమియా గూడ ఆలయలో శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి కళ్యాణ వేడుకలను మంగళవారం నిర్వహించారు. ప్రతి ఏటా ఆషాడ మాసం లో నిర్వహించే అమ్మవారి కళ్యాణ వేడుకలకు తిలకించడానికి వివిధ ప్రాంతాల నుండి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. కళ్యాణ వేదికను అందంగా అలంకరించి ఉత్సవ విగ్రహాలను ఊరేగింపుగా తీసుకొని వచ్చి కళ్యాణం నిర్వహించారు. పండితుల వేదమంత్రోచ్ఛారణ మధ్యన అంగరంగ వైభవంగా కళ్యాణ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్యనిర్వాహక అధికారి వెంకన్న.ఇన్స్పెక్టర్ మోహన్ రెడ్డి. రికార్డు అసిస్టెంట్ మహిపాల్ యాదవ్. మాజీ చైర్మన్ రామనాథ్ ముదిరాజ్. మాజీ ఎంపిటిసి పూసలపాటి యాదయ్య గౌడ్. మాజీ సర్పంచ్ దేవిక జగన్ గౌడ్. మాజీ డైరెక్టర్ లు అర్జున్ ముదిరాజ్. అనిత వెంకటేష్ .అర్చకులు శ్రీశైలం పంతులు. మల్లికార్జున్ పంతులు. అటెండర్ నవీన్. అన్నదాన కార్యక్రమానికి మదనపల్లి గ్రామానికి చెందిన అరుణ్ గౌడ్. గోపాల్ సహకరించారు. ఉమేష్. శేఖర్. మహేశ్వర్,మాజీ డైరెక్టర్ సారా కృష్ణ గౌడ. పిల్లనబోయిల రవి యాదవ్. శేఖర్ యాదవ్. తదితరులు పాల్గొన్నారు.



# జన్నారం లో ఘనంగా ఎంఆర్పిఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**జన్నార8 జూలై (సమయజ్యోతి )**

జన్నారం మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ముందు సోమవారం మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి 31 వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జన్నారం మండలా ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు కొండకూరి ప్రభుదాస్ జాతీయ జెండా ఆవిష్కరించారు. నీ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదిగ జాతి కోసం 30 సంవత్సరాల పోరాటం చేసి విజయం సాధించిన ఘనుడు పద్మ శ్రీ మంద కృష్ణ మాదిగ అని అన్నారు. అన్ని వర్గాల ప్రజల కోసం పోరాటం చేసిన వీరుడి అని అందుకోసమే పద్మ శ్రీ వరించింది అని వారు అన్నారు.ఈ కార్యక్రమంలో మాదిగ రిజర్వేషన్ పోరాట సమితిమండల సీనియర్ నాయకులు మంద చిన్నయ్య మాదిగ,మామిడి పెల్లి ఇంద్రయ్య ,ప్రధాన కార్యదర్శి జంగం రవి మాదిగ, మంద రాజేష్,శ్రీ పెల్లి జగన్ మాదిగ, బచ్చల కృష్ణ మాదిగ,ప్రశాంత్ మాదిగ,ముల్కల రమేష్ మాదిగ, రాహుల్ మాదిగ,ప్రవీణ్ మాదిగ,శేఖర్ మాదిగ, కమలాకర్ మాదిగ,ఈర్నాల గంగన్న తదితరులు పాల్గొన్నారు.



# రుయ్యాడీలో మొహర్రం వేడు కలలో పాల్గొన్న కలెక్టర్

**జన్నార8జులై (సమయజ్యోతి )**

తలమడుగు మండలంలోని రుయ్యాడి గ్రామంలో సోమవారం నిర్వహించిన మొహర్రం ఉత్సవాల పండుగకు జిల్లా కలెక్టర్ రాజర్షి షా ని గ్రామస్తులు డప్పులతో ఆహ్వానించి ఘనంగా స్వాగతం పలికారు . అదేవిధంగా రుయ్యాడి పీర్ల మహిమలను కలెక్టర్ కొనియాడారు. అనంతరం హస్సేన్,హుసేలను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు . అనంతరం గ్రామానికి చెందిన పలు సమస్యలను మాజీ జెడ్పిటిసి సభ్యులు గోక గణేష్ రెడ్డి కలెక్టర్ కి విన్నవించగా వాటికి సానుకూలంగా స్పందించారు.



# సుల్తాన్ పల్లి భూముల్లో ప్రభుత్వ బోర్డు ఏర్పాటు

**శంషాబాద్. జూలై 8. సమయజ్యోతి**

సుల్తాన్ పల్లి గ్రామంలోని 25 ఎకరాల 10 విస్తీర్ణం గల భూమిలో ఈ భూమి ప్రభుత్వానికి చెందినది అని పేర్కొంటూ శంషాబాద్ మండల రెవెన్యూ అధికారులు బోర్డులు ఏర్పాటు చేశారు. శంషాబాద్ తహసిల్దార్ రవీందర్ దత్ ఆదేశాల మేరకు రెవిన్యూ ఇన్స్పెక్టర్ సారిక రెడ్డి మంగళవారం సిబ్బందితో వెళ్లి బోర్డులను ఏర్పాటు చేశారు. సర్వే నంబర్ 129. 142 లలో ఉన్న 25 ఎకరాల 10 గుంటల వ్యవసాయ భూమి ప్రభుత్వానికి చెందినదని ఎవరైనా ఇందులో చొరబడడానికి ప్రయత్నిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గతంలో ఈ భూమిలో పేద ప్రజలకు ఇళ్ల స్థలాల కోసం పట్టా సర్టిఫికెట్లు మంజూరు చేశారు. ఆ తర్వాత కొందరు ఈ భూమి తమదే అంటూ పట్టాదారు పాసుబుక్కులు పొందారు. దీన్ని సవాల్ చేస్తూ గ్రామస్తులు పై అధికారులకు ఫిర్యాదు చేయడంతో ఇటీవల సీసీఎల్ఏ కమిషనర్ ఈ భూమి ప్రభుత్వాన్ని అంటూ ఆదేశాలు జారీ చేశారు. దీనితో రెవెన్యూ అధికారులు మంగళవారం భూమిని స్వాధీనం చేసుకొని బోర్డులు ఏర్పాటు చేశారు.




# రాయల్ విల్లాస్ లో విద్యుత్ కష్టాలు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసిన పట్టించుకోని అధికారులు

**శంషాబాద్. జూలై 8.సమయజ్యోతి**



శంషాబాద్ పట్టణంలోని రాయల్ విల్లాస్ కాలనీలో విద్యుత్ సమస్య తీవ్రంగా ఉన్నదని గ్రామపంచాయతీ మాజీ సభ్యుడు టిడిపి నాయకుడు కారింగుల శ్రీనివాస్ గౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. తమ బస్తీలో గంటల తరబడి విద్యుత్ సరఫరా నిలిపివేస్తూ తీవ్ర అసౌకర్యానికి గురి చేస్తున్నారని అన్నారు. ప్రతిరోజు ఉదయం నుండి సాయంత్రం వరకు దాదాపు పది సార్లు విద్యుత్ కోతలు విధిస్తున్నారని తెలిపారు. రాత్రి సమయాల్లో సైతం ఇస్తానుసారంగా అప్రకటిత విద్యుత్ కోత విధించడంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని కారింగుల శ్రీనివాస్ గౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక విద్యుత్ సబ్స్టేషన్లో ఫిర్యాదు చేసిన పట్టించుకునే నాధుడే లేకుండా పోయాడని అన్నారు. వెంటనే తమ కాలనీ సమస్యను తీర్చని పక్షంలో విద్యుత్ సబ్స్టేషన్ ముందు ధర్నా నిర్వహిస్తామని శ్రీనివాస్ గౌడ్ హెచ్చరించారు. శంషాబాద్ లో ఎక్కడ లేని విధంగా కేవలం తమ కాలనీలో గంటల తరబడి విద్యుత్ కోత విధించడంలో అంతర్యం ఏమిటని ప్రశ్నించారు.

# మానవ మనుగడకు చెట్లే జీవనాధారం

## - ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

**జన్నారం 8జూలై ( సమయజ్యోతి )**

మానవ మనుగడకు చెట్లే జీవనాధారమని ఖానాపూర్ నియోజకవర్గ శాసనసభ్యులు వెడ్మ బొజ్జు పటేల్ పేర్కొన్నారు. సోమవారం ఉట్నూర్ మండల కేంద్రంలోని టీటీడబ్ల్యూఆర్ఎస్ జూనియర్ కళాశాలలో వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా అధికారులు, అధ్యాపకులు, విద్యార్థులతో కలసి మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ. రాష్ట్రంలో పచ్చదనాన్ని పెంచే లక్ష్యంతో పాటు అటవీ విస్తీర్ణాన్నీ పెంచి, పర్యావరణ స్థిరత్వాన్ని అందించడానికి చెట్లను నాటడం జరుగుతుందన్నారు. పర్యావరణ కాలుష్యాన్ని తగ్గించాలంటే చెట్లు చాలా ముఖ్యమని అన్నారు.ప్రతి ఒక్కరూ తమ పరిసరాల చుట్టూ మొక్కలను నాటాలని పిలుపు నిచ్చారు.ప్రభుత్వ,ప్రవేటు కార్యాలయాల,పాఠశాల ఆవరణలో రకరకాల మొక్కలను నాటాలని సూచించారు.విద్యార్థులు ఉన్నత చదువులపై దృష్టి సారించాలని అన్నారు.శ్రద్ధతో చదివి ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు.చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు, అధ్యాపకులు, విద్యార్థులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిరసన

**మోతె సమయజ్యోతి జూన్ 08**

మండలం పరిధిలోని సిరికొండ లో కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడులను రద్దు చేయాలని కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలు ఉపసంహరించుకోవాలని ఈనెల 9న జరుగుతున్నటువంటి దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని మోతే సిరికొండ గ్రామంలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం తెలియజేయడం జరిగింది.



# గోషామహల్ సర్కిల్ టౌన్ ప్లానింగ్ అధికారుల సీరియస్

## రూల్స్ అతిక్రమించి నిర్మించిన భవనాలు కూల్చివేతలు....

## అనుమతులకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడుతే

## చర్యలు తప్పవంటున్న ఎసిపి రమేష్

**హైదరాబాద్, గోషామహల్: సమయజ్యోతి**

ఖైరతాబాద్ జోనల్ గోషామహల్ సర్కిల్ పరిధిలో అక్రమ నిర్మాణాల పై టౌన్ ప్లానింగ్ అధికారులు మంగళవారం కొరడా జరిపించారు. టౌన్ ప్లానింగ్ ఎసిపి రమేష్ సెక్షన్ ఆఫీసర్ మహేందర్ ఆధ్వర్యంలో స్థానిక పోలీసుల సహకారంతో రూల్స్ అధిగమించి నిర్మాణం చేపట్టిన భవనాన్ని కూల్చివేశారు. గోషామహల్ సర్కిల్ పరిధిలో ని మహారాజ్ గంజ్ లో ( డోర్ నెంబర్ 15-2-165&165/1) స్టిల్ ప్లస్ టు పర్మిషన్ తీసుకుని మరో రెండు ఫ్లోర్లు అక్రమ నిర్మాణం చేపట్టగా టౌన్ ప్లానింగ్ అధికారులు అక్రమ నిర్మాణాన్ని కూల్చి వేశారు. గతంలో అక్రమ నిర్మాణాల వద్ద కు వెళ్ళి తూతూ మంత్రంగా కూల్చి తమ పని అయ్యిందనిపించుకునే అధికారుల మాదిరి కాకుండా అక్రమంగా నిర్మించిన రెండు ఫ్లోర్ల స్లాబులను పూర్తిగా కూల్చివేశారు. ఈ సంధర్భంగా ఎసిపి రమేష్ సెక్షన్ ఆఫీసర్ మహేందర్ లు మాట్లాడుతూ అనుమతుల ప్రకారం కాకుండా నిబంధలను ఉల్లంగించి నిర్మాణాలు చేస్తే ఇక ముందు చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రభుత్వ స్థలాలలో ఇక అక్రమ నిర్మాణాలు చేస్తే పోలీసు కేసులు పెడతామని హెచ్చరించారు. అవసరమైతే క్రిమినల్ కేసులు పెడతామని అన్నారు.



# 2047 నాటికి ఆరోగ్యాంధ్రప్రదేశ్ లక్ష్యం

### ఆ దిశగా కూటమి ప్రభుత్వం వ్యూహం

### వైద్యరంగం బోలపేతం దిశగా చర్యలు

### వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్

**అమరావతి,జూలై8(సమయజ్యోతి ):**

2047 నాటికి ఆరోగ్యాంధ్రప్రదేశ్ సాధన దిశగా కూటమి ప్రభుత్వం వ్యూహాలు రూపొందించిందని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి శ్రీ సత్య కుమార్ యాదవ్ అన్నారు. ఏడాది పాలనలో అనేక సంస్కరణలు తీసుకుని వచ్చామని మంగళవారం నాడిక్కడ అన్నారు. ప్రసవ సమయంలో మాతృ మరణాలు, శిశు మరణాలు, ఆరోగ్య భద్రత విషయాల్లో రాష్ట్రంలో పరిస్థితి మెరుగ్గానే ఉందన్నారు. ప్రసూతి మరణాలను 45 శాతం నుండి 5 శాతానికి, శిశు మరణాలను 24 శాతం నుండి 2 శాతం కు తగ్గించాలని, గర్భస్థ మహిళల్లో బలహీనులుగా ఉన్నవారిని 34 శాతంనుంచి 4 శాతానికి తగ్గించే లక్ష్యాలను రూపొందించామన్నారు. సాధారణ బదిలీల్లో భాగంగా వైద్య రోగ్య శాఖ పరిధిలో పారదర్శకంగా, వివాదరహితంగా జరిగిన బదిలీలు కూటమి ప్రభుత్వం మొదటి ఏడాదిలో తెచ్చిన మార్పునకు సంకేతమన్నారు. గత ప్రభుత్వ కాలంలో జరిగిన బదిలీలపై పలు అవినీతి, అక్రమాలు, రాజకీయ జోక్యంపై పలు ఆరోపణలు వచ్చాయని, కూటమి ప్రభుత్వం స్పష్టమైన నియమ నిబంధనలతో వాటికి అడ్డుకట్ట వేసిందన్నారు.గత ఐదేళ్ళ ప్రభుత్వ నిర్వాకాలు, నిర్లక్ష్యంతో ప్రజారోగ్య రంగం గాడి తప్పిందని, అస్తవ్యస్తమైన వైద్య రంగాన్ని కూటమి ప్రభుత్వం మొదటి ఏడాది పాలనలో తిరిగి పట్టాలెక్కించిదన్నారు. కొత్త ప్రభుత్వ వైద్య కళాశాలల నిర్మాణం, మౌలిక వసతుల కల్పన విషయాల్లో గత ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని వెల్లడించారు. ఆ ఐదేళ్ళ కాలంలో ప్రజారోగ్య రంగంలో జవాబుదారీతనం లేకపోవడం, క్రమ శిక్షణా రాహిత్యం, అవినీతి, రాజకీయ జోక్యం వలన వైద్య వ్యవస్థ దెబ్బతిందని, కూటమి ప్రభుత్వం ఈ పరిస్థితిని చక్కదిద్ది మార్పు తేగలిగిందన్నారు. దానివల్ల ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఓపీ సేవలు ఎంతో




పెరిగాయన్నారు. స్వర్ణాంధ్రప్రదేశ్ సాధనకు అవసరమైన మేరకు ప్రజారోగ్యాన్ని ప్రక్షాళించటంలో చేయవల్సినది చాలా ఉందని, ఆ మేరకు చర్యలు చేపట్టడానకి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. గత ప్రభుత్వ పాలనలో ఆసుపత్రుల నిర్వహణ అధ్వాన్నంగా ఉండటంతో పాటు సరిగా తమ విధులను కూడా నిర్వర్తించని పరిస్థితులు నెలకొన్నాయన్నారు. ముఖ్య మంత్రి చంద్రబాబు మార్గదర్శకత్వంలో సమీక్షలు చేసి వాటిని సరిదిద్దామన్నారు. రాష్ట్ర ఆర్ధిక ప్రగతికి, ప్రజల ఆరోగ్యానికి నడుమ అవినాభావ సంబంధం ఉందని, ప్రజల ఆరోగ్య పరిరక్షణకు శ్రమించే వైద్యులను సమాజంలోని అన్ని వర్గాల వారు గౌరవించాలని మంత్రి సత్య కుమార్ యాదవ్ కోరారు. ప్రజారోగ్యం పట్ల నిర్లక్ష్య వైఖరిని కూటమి ప్రభుత్వం సహించదని, అట్టివారి పట్ల కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య సిబ్బంది పనితీరు పట్ల నిఘా పెంచామని, తప్పు చేసేవారిపై చర్యలు ఉంటాయన్నారు.

# సీమను రతనాల సీమ చేయాలన్నదే లక్ష్యం



సీమ అభివృద్ధికి ఎన్టీఆర్ నుంచే కార్యక్రమాలు

ప్రాజెక్టులతో అన్ని ప్రాంతాలరు సాగునీటి సౌకర్యం

వృధాగా పోతున్న 2వేల టిఎంసిలు వాడుకోవాలి

శ్రీశైలంలో నాలుగు గేట్లు ఎత్తి నీటి విడుదల

రైతు సంఘాలతో సమీక్ష..మల్లన్నకు ప్రత్యేక పూజలు

తెలుగు రాష్ట్రాలు అభివృద్ధి చెందాలన్న చంద్రబాబు



**శ్రీశైలం,జూలై8(సమయజ్యోతి )**

:రాయలసీమను రతనాల సీమ చేయాలన్నదే తమ లక్ష్యమని ఆంధప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వెల్లడించారు. ఏపీ సుభిక్షం కావాలన్నదే తమ ధ్యేయమని స్పష్టం చేశారు. జులై మాసం తొలి వారంలోనే శ్రీశైలం ప్రాజెక్ట్ నీటితో నిండిపోవడం శుభపరిణామమని తెలిపారు. ప్రస్తుతం శ్రీశైలంలో 200 టీఎంసీల నీరు ఉందన్నారు. తన జీవితంలో ఇవాళ చాలా సంతోష కరమైన రోజు అని చంద్రబాబు అన్నారు. జులై తొలివారంలోనే శ్రీశైలం జలాశయం నిండటం శుభపరిణా మమని చెప్పారు. కృష్ణమ్మకు జలహారతి ఇచ్చిన అనంతరం ప్రాజెక్టు నాలుగు గేట్లను సీఎం ఎత్తి నీటిని విడుదల చేశారు. ఆ తర్వాత నీటి వినియోగదారులతో నిర్వహించిన సమావేశంలో చంద్రబాబు మాట్లాడారు. అంతకుముందు శ్రీశైలం మల్లన్నను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. శ్రీశైల మల్లన్నకు ప్రత్యేక పూజలు చేశా. రాయలసీమ రతనాల సీమ కావాలని ప్రార్థించా. మల్లన్న ఆశీస్సులతో రాయలసీమ సుభిక్షంగా ఉంటుంది. జలాలే మన సంపద.. వాటితోనే రైతుల కష్టాలు తీరతాయి. సాగునీటి ప్రాజెక్టులే ఆధునిక దేవాలయాలు. పైనుంచి వచ్చిన జలాలతో 200 టీఎంసీల నీరు శ్రీశైలం జలాశయంలో ఉంది. రాయలసీమను ఎవరూ కాపాడలేరని గతంలో చాలామంది అన్నారు. సీమ స్థితిగతులు మార్చేందుకు ఎన్టీఆర్ నడుం బిగించారు. రాయలసీమ అభివృద్ధికి నా వంతు కృషి చేస్తున్నా. సాగునీటి ప్రాజెక్టులకు రూ.68వేల కోట్లు ఖర్చు చేశాం. వైకాపా ప్రభుత్వం అధికారంలో ఉండగా రాయలసీమ ప్రాంతాన్ని పట్టించుకోలేదు. జీడిపల్లికి నీరు తీసుకెళ్లే బాధ్యత మా ప్రభుత్వానిదే. ఈనెల 15 నాటికి ఆ ప్రాంతానికి నీరు రావాలని అధికారులకు టార్గెట్ విధించా. ఈనెల 30 కల్లా కుప్పం, మదనపల్లెకు నీళ్లు తీసుకెళ్తాం. పోతిరెడ్డిపాడు, గాలేరు-నగరి, గండికోట.. అన్నీ మేమే తెచ్చాం. తెలుగుజాతి ప్రపంచంలోనే నంబర్ వన్ కావాలనేది నా లక్ష్యం అన్నారు. మేం చేసిన అభివృద్ధిని హైదరాబాద్‌లో కొనసాగిస్తున్నారు. సముద్రంలో కలిసే నీటిని తెలుగు రాష్ట్రాలు వాడుకుంటే మంచిది. దీంతో రెండు రాష్ట్రాల రైతాంగానికి మేలు జరుగుతుంది. రాయలసీమకు నీళ్లు వస్తున్నాయంటే పోలవరం వల్లే. సీమకు ఏమేం చేయాలో నా వద్ద బ్లూప్రింట్ ఉంది. దేశంలో ఎక్కడా లేని రోడ్ల వ్యవస్థ ఈ ప్రాంతంలో ఉంది. గతంలో రాగులు, సజ్జలు, జొన్నలు, కొర్రలు తినేవాళ్లం. పాలిష్ రైస్ తిని చాలామంది షుగర్ వ్యాధి తెచ్చుకుంటున్నారు. ఇప్పుడంతా ఆరోగ్యంపై దృష్టి పెడుతున్నారు.. చిరుధాన్యాలు తింటున్నారు. కూరగాయలు, పండ్ల వినియోగం క్రమంగా పెరుగుతోంది. అన్ని రకాల పండ్లు పండే ప్రాంతం రాయలసీమ. కొప్పర్తి, ఓర్వకల్లు.. పారిశ్రామిక హబ్‌లుగా మారుతున్నాయని చంద్రబాబు అన్నారు. ప్రపంచంలోనే నెంబర్ వన్‌గా తెలుగు జాతి ఉండాలని ఆయన ఆకాంక్షించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి పోలవరం ప్రాజెక్ట్ ఒక పెద్ద వరం అని అభివర్ణించారు. గోదావరిలో 2 వేల టీ-ఎంసీల నీరు సముద్రంలోకి వృథాగా పోతున్నాయన్నారు. బనకచర్లతో తెలంగాణకు ఎలాంటి నష్టం ఉండదని చెప్పారు. పోలవరం పూర్తయితే తెలుగు రాష్ట్రాలు సుభిక్షంగా ఉంటాయన్నారు. సముద్రంలోకి వృథాగా పోతున్న గోదావరి నీటినే వినియోగిస్తున్నామని ఆయన పునరుద్ఘాటించారు. రిజర్వాయర్లు.. ఆధునిక దేవాలయాల వంటివని అభివర్ణించారు. నీళ్లు ఇస్తే రైతులు బంగారం పండిస్తారన్నారు. సాగు బాగుండాలంటే నీళ్లు ఉండాలని చెప్పారు. సాగు నీటి ప్రాజెక్టులకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని స్పష్టం చేశారు. ఒక్క రాయలసీమలోనే రూ.12, 500 కోట్లు ఖర్చు చేశామని వివరించారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రూ. 2 వేల కోట్లు- మాత్రమే ఖర్చు చేశారని గుర్తు చేశారు. రాయలసీమలో అన్ని ప్రాజెక్టుల నిర్మాణం తెలుగుదేశం ప్రభుత్వ హయాంలోనే జరిగాయని సీఎం చంద్రబాబు వివరించారు. ఇరిగేషన్ ప్రాజెక్టులన్నింటినీ పూర్తి చేస్తామని ఈ సందర్భంగా ఆయన ప్రకటించారు. అనంతపురం జిల్లాలోని లేపాక్షి ఇండస్ట్రియల్ హబ్‌గా మారబోతోందని స్పష్టం చేశారు. శ్రీశైలం, తిరుపతి, ఒంటిమిట్ట, శ్రీకాళహస్తి, కాణిపాకం, అహోబిలం, పుట్టపర్తి, కడప దర్గా.. తదితర ప్రదేశాలు మనకు పవిత్రమైన ఆస్తులని సీఎం చంద్రబాబు అభివర్ణించారు. పోలవరం నుంచి బనకచర్లకు నీరు రావాలన్నారు. గోదావరి నీరు.. బనకచర్ల వరకు వస్తే కరవు అనే మాటే ఉండదని ఆయన పేర్కొన్నారు. ఏపీని విధ్వంసం నుంచి వికాసం వైపు తీసుకెళ్తున్నామని తెలిపారు. సూపర్ సిక్స్ హామీల అమలు చేసి తీరుతామని స్పష్టం చేశారు. సంపద సృష్టిస్తాం.. అభివృద్ధి చేస్తాం.. ఆదాయం పెంచుతామన్నారు. అభివృద్ధి, సంక్షేమం కూటమి ప్రభుత్వానికి రెండు కళ్లు అని చెప్పారు. వైసీపీ హయాంలో పెన్షన్లు రూ.2 వేల నుంచి రూ. 3 వేలు పెంచేందుకు ఐదేళ్లు పట్టిందని.. కానీ కూటమి అధికారంలోకి రాగానే ఆ పెన్షన్లు రూ.4 వేలు చేశామని సీఎం చంద్రబాబు గుర్తు చేశారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 203 అన్న క్యాంటీ-న్లు ప్రారంభించామని.. మరో 75 క్యాంటీన్లు ప్రారంభిస్తామని ప్రకటించారు. ఇచ్చిన మాట ప్రకారం తల్లికి వందనం అమలు చేశామన్నారు. ఎంత మంది పిల్లలు ఉంటే అంత మందికీ తల్లికి వందనం ఇస్తున్నామని వివరించారు. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ప్రారంభిస్తామని సీఎం చంద్రబాబు పునరుద్ఘాటించారు. ఉచిత బస్సుల ప్రయాణం కేవలం జిల్లాకే పరిమితం అన్నారు. ఆయా జిల్లాల్లో మాత్రమే మహిళలకు తిరిగే అవకాశం ఉంటుందని అన్నారు. ఈ సమావేశంలో మంత్రులు నిమ్మల రామానాయుడు, బీసీ జనార్ధన్‌రెడ్డితోపాటు- ఎమ్మెల్యేలు బుడ్డా రాజశేఖర్ రెడ్డి, అఖిల ప్రియ, ఎంపీ బైరెడ్డి శబరి పాల్గొన్నారు.

# సిలికాన్ వ్యాలీ తరహాలో క్వాంటమ్ వ్యాలీ

### సాంకేతిక విప్లవంలో ఇదో గేమ్ ఛేంజర్

### బిజినెస్ పార్కులో లోకేశ్ రోడ్ షో

**బెంగుళూరు,జూలై8(సమయజ్యోతి ):**

మరో ఆరు నెలల్లో సిలికాన్ వ్యాలీ తరహాలో అమరావతిలో క్వాంటమ్ వ్యాలీ ఏర్పాటు చేయనున్నట్టు ఏపీ ఐటిశాఖ మంత్రి నారా లోకేశ్ తెలిపారు. క్వాంటమ్ వ్యాలీ భారత్ సాంకేతిక విప్లవంలో గేమ్ ఛేంజర్‌గా నిలుస్తుందని ఉద్ఘాటించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, క్వాంటమ్ టెక్నాలజీ వంటి అధునాతన సాంకేతిక రంగాల్లో శరవేగంగా అభివృద్ధి చెందుతోన్న ఆంధ్రప్రదేశ్ లో గ్లోబల్ కేపబిలిటీ- సెంటర్లపై పెట్టుబడులు పెట్టాలని కోరారు. దేశంలో పేరెన్నికగన్న దిగ్గజ జీసీసీ సంస్థల ప్రతినిధులతో కలిసి మంత్రి లోకేశ్ బెంగుళూరు మాన్యత ఎంబసీ బిజినెస్ పార్కులో రోడ్ షో నిర్వహించారు. ఇప్పుడు ప్రపంచం మొత్తం ఆంధ్రప్రదేశ్ వైపు చూస్తోంది. రాష్ట్రంలో పెట్టుబడులకు ఇదే సరైన సమయం అన్నారు. టీసీఎస్, ఐబీఎం, ఎల్‌అండ్‌టీ వంటి దిగ్గజ సంస్థల భాగస్వామ్యంతో అమెరికాలోని సిలికాన్ వ్యాలీ తరహాలో దేశంలోనే తొలిసారిగా ఏపీ రాజధాని అమరావతిలో మరో ఆరు నెలల్లోనే క్వాంటమ్ వ్యాలీ ఆవిష్కృతం కాబోతోంది. ఇది భారత్ సాంకేతిక విప్లవంలో గేమ్ ఛేంజర్‌గా నిలుస్తుంది. మరోవైపు విశాఖ మహానగరం ఐటీ హబ్‌గా తయారవుతోంది. విజనరీ లీడర్ చంద్రబాబు నేతృత్వంలో ప్రస్తుతం ఏపీలో ఇన్వెస్టర్స్ ఫ్రెండ్లీ విధానాలు అమలు చేస్తున్నాం. దేశంలో మరే రాష్ట్రం ఇవ్వని విధంగా రాయితీలు అందజేస్తున్నాం. అధునాతన సాంకేతికతలకు నిలయంగా మారుతున్న ఏపీలో పెట్టుబడులు పెట్టాలని మంత్రి లోకేశ్ విజ్ఞప్తి చేశారు.

# ఎపి బ్రాండ్‌ను దెబ్బతీసేలా కుట్రలు

### పెట్టుబడులను అడ్డుకునేందుకు కుయుక్తులు

### జగన్ తీరుపై మండిపడ్డ మంత్రి పయ్యావుల

**అమరావతి,జూలై8(సమయజ్యోతి ):**

వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి భయంకర కుట్రలకు తెరలేపు తున్నారని ఏపీ ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. ఏపీ బ్రాండ్‌ను దెబ్బతీయాలని జగన్ కుట్ర చేస్తున్నారని పయ్యావుల ఆరోపించారు. ఓటమి తర్వాత కూడా జగన్ వైఖరిలో మార్పు లేదన్న పయ్యావుల.. ఓట్లు వేయలేదని ప్రజలపై అక్కసు వెళ్లగక్కుతున్నారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం ఏపీలో సమర్థవంతంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తుంటే జగన్ ఓర్వలేకపోతున్నారని ఎద్దేవా చేశారు.ఏపీకి పెట్టుబడులు వస్తుంటే వైసీపీ అధ్యక్షుడు జగన్మోహన్ రెడ్డి తట్టుకోలేకపోతున్నారని పయ్యావుల ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏపీలో పెట్టుబడులు పెట్టొద్దని పారిశ్రామికవేత్తలకు.. ఉదయ్‌భాస్కర్ అనే వ్యక్తితో 200 మెయిల్స్ పెట్టించారని మంత్రి పయ్యావుల చెప్పారు. ఆ తర్వాత లేళ్ల అప్పిరెడ్డిని తెరపైకి తీసుకొచ్చారని.. జగన్ ఎన్ని కుట్రలు పన్నినా ఏపీ బ్రాండ్ ఎక్కడా తగ్గలేదని పయ్యావుల అన్నారు. మేం పక్కా ఆధారాలతో మాట్లాడుతున్నామని మంత్రి పయ్యావుల అన్నారు.

# హైవేలపై నిత్యకృత్యంగా ప్రమాదాలు

### అతి వేగమే కారణమంటున్న అధికారులు

**విజయవాడ,జూలై8(సమయజ్యోతి ):**

ఈ మధ్యరోడ్డు ప్రమాదాలు ఆందోళన కలిగిస్తున్నాయి. నాలుగు వరసల రోడ్లపైనా ప్రమాదాలు తప్పడం లేదు. అతివేగంతో పాటు, మలుపులు, సరైన సూచికలు లేకపోవడం, రోడ్ల మరమ్మత్తుల చేపట్టక పోవడంకూడా కారణంగా చెప్పుకోవాలి. ఎపిలోని పలు రోడ్లు మృత్యు మార్గాలుగా మారుతున్నాయి. తిరుపతి. ప్రకాశం, విజయనగరం, నెల్లూరు ఇలా ప్రతిచోటా ప్రమాదాలు నిత్యకృత్య మయ్యాయి. వీటితో పాటు కర్నూలు హైవే మృత్యుమార్గమైంది. తరచూ హైవే ప్రమాదాలు జిల్లాలో మామూలయ్యాయి. తరచూ ఎక్కడో ఒక చోట ఘోర ప్రమాదాలు జరుగుతున్నాయి. ఘటన జరిగినప్పుడు తప్ప మళ్లీ అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శ ఉంది. ప్రమాదాలు జరిగినప్పుడు తప్ప మిగతా సమయాల్లో అధికారులు పట్టించుకోవడం లేదు. హైవేపై వేగం నియంత్రణ నిబంధనలు పాటించక పోవడమే దీనికి కారణం. దీంతో భద్రత లేమి స్పష్టంగా కనిపిస్తోంది. అంతులేని వేగంతో వాహనాలు దూసుకెళ్లి రోడ్డు పైన నెత్తురు చిందుతున్నాయి. రహదారి నిబంధనలేవీ అమలు కావడం లేదు. ప్రయాణికుల ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయి. వెల్దుర్తి, డోన్, ప్యాపిలి ప్రాంతాల్లోని హైవేలో ఉన్న రహదారుల కూడళ్ల మలుపులు డేంజర్ జోన్లుగా మారిపోయాయి. జిల్లాలో 85 కిలోమీటర్ల మేర ఎన్‌హెచ్-44 ఉంది. కర్నూలు నుంచి వెల్దుర్తి, డోన్, ప్యాపిలి మీదుగా పోదొడ్డి వరకు జిల్లా హైవే రహదారి ఉంది. ఈ ప్రాంతాల్లోని రహదారుల కూడళ్ల మలుపులు డేంజర్ జోన్లయ్యాయి. డోన్ పరిధిలో ఆరు హైవే కూడళ్లు ప్రమాదాల నిలయాలయ్యాయి. హైవేపై అతివేగంగా వాహనాలు దూసుకొస్తున్నాయి. నిబంధనల ప్రకారం హైవేపై వాహనాల వేగం 80 కిలోమీటర్లు మించరాదు. అయితే ఈ నిబంధనను వాహనాల డ్రైవర్లు అసలు పాటించడం లేదన్న విమర్శలున్నాయి. ముఖ్యంగా ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులు, వాహనాలు మితిమీరిన వేగంతో వస్తున్నాయి. హైవేపై వేగనియంత్రణ చేయాల్సిన ఎంవీఐ అధికారులు, హైవే అధికారులు మొద్దునిద్ర వీడటం లేదన్న విమర్శలున్నాయి. హైవేపై వాహనాల వేగాన్ని నియంత్రించడంలో అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. దీంతో ఎంతో మంది ప్రాణాలు కోల్పోవలసివస్తోంది. హైవే అధికారులు కనీస జాగ్రత్తలు తీసుకోవడం లేదన్న విమర్శలున్నాయి. హైవేపై పాటించాల్సిన నిబంధనలకు తూట్లు పొడుస్తున్నారు. హైవే మలుపుల వద్ద ప్రమాద సూచికబోర్డులు అసలు కనిపించడం లేదు. మలుపుల వద్ద వేగనియంత్రణ బోర్డులు అడ్రస్ లేవు. వీటికి తోడు హైవే జంక్షన్‌ల వద్ద స్పీడ్ బ్రేకర్లు కూడా లేకపోవడంతో.. వాహనాలు వేగంగా దూసుకొస్తున్నాయి. అదే విధంగా హైవే జంక్షన్‌ల వద్ద తప్పనిసరిగా లైటింగ్ ఏర్పాటు చేయాల్సి ఉన్నా.. అధికారులు పట్టించుకోవడం లేదు. రాత్రిళ్లు హైవే జంక్షన్‌ల వద్ద లైటింగ్ లేకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి.

# బుందేల్‌ఖండ్ తరహాలో ఏపీకి కేంద్రం అదనపు సాయం

### ఎపిలో మామిడి రైతులను ఆదుకోవాలి

### చిల్లీ, జీడిపప్పు, మామిడి బోర్డులు ఏర్పాటు చేయాలి

### కేంద్రవ్యవసాయ శాఖమంత్రి చౌహాన్‌తో అచ్చన్నా భేటీ

**న్యూఢిల్లీ,జూలై8(సమయజ్యోతి ):**

బుందేల్‌ఖండ్ తరహాలో ఏపీకి కేంద్రం అదనపు సాయం చేయాలని కేంద్రాన్ని అచ్చెన్నాయుడు కోరారు. గుంటూరులో చిల్లీ బోర్డ్, శ్రీకాకుళంలో జీడిపప్పు బోర్డ్, చిత్తూరులో మామిడి బోర్డ్‌ని ఏర్పాటు చేయాలని కోరారు. ఏపీ వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు దిల్లీ పర్యటనలో భాగంగా కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌ను కలిశారు. ఏపీలో రైతుల సమస్యలపై కేంద్రమంత్రితో చర్చించారు. విభజనచట్టం ప్రకారం శ్రీకాకుళం జిల్లాలో కేంద్ర వ్యవసాయ విశ్వవిద్యాల యం ఏర్పాటు చేయాలని సూచించారు. అచ్చెన్నాయుడితో పాటు కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు కూడా సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మామిడి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రత్యేకంగా ప్రస్తావించారు. తొతాపురి మామిడి ధర తగ్గడంతో రైతులకు నష్టం వాటిల్లు తోందన్నారు. కిలో ధర రూ.8కి పడిపోవడంతో ప్రభుత్వం జోక్యం చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ధరల లోటు-చెల్లింపు పథకం కింద మద్దతు ధరగా రూ.12 నిర్ణయించినట్టు- కేంద్ర మంత్రికి వివరించారు. 6.5లక్షల మెట్రిక్ టన్నుల తొతాపురి కొనుగోలు చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.260 కోట్లు- ఖర్చు చేస్తుందని, కేంద్ర భాగస్వామ్యం కోరారు. చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య జిల్లాల్లో కొనుగోలు పక్రియ ప్రారంభమైందన్నారు. వెనుకబడిన జిల్లాల కోసం మైక్రో ఇరిగేషన్ పథకానికి రాయితీ పెంపుపై విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో రైతుల సమస్యలపై కేంద్రమంత్రితో చర్చించారు. మంత్రి అచ్చెన్నా యుడు వినతులపై సానుకూలంగా కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ స్పందించారు.

# పెళ్లి పేరుతో నమ్మించి లైంగిక వేధింపులు



క్రికెటర్ యష్ దయాల్‌పై కేసు నమోదు చేశారు. ఘజియాబాద్‌కు చెందిన ఒక మహిళ చేసిన ఫిర్యాదు మేరకు పోలీసులు యశ్ దయాల్ పై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. యశ్ దయాల్ గత కొంతకాలం నుంచి తనను శారీరక, మానసికంగా వేధింపులకు గురిచేస్తున్నాడని ఆమె ఆరోపణలు చేసింది. ఆదివారం అర్ధరాత్రి ఇందిరాపురం పోలీస్ స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. బాధితురాలు ముఖ్యమంత్రి ఫిర్యాదుల పరిష్కార పోర్టల్‌లో ఈ విషయాన్ని లేవనెత్తడంతో పోలీసులు ప్రాథమికంగా వివరాలు సేకరించిన తరువాత బౌలర్ యశ్ దయాల్ పై చర్యలు చేపట్టారు. మహిళ యష్ దయాల్‌తో ఐదు సంవత్సరాలుగా సంబంధం కలిగి ఉంది. క్రికెటర్ పెళ్లి చేసుకుంటానని తనను నమ్మించి మోసం చేశాడని ఆరోపించారు. ప్రేమ పేరుతో మోసం చేసిన తను పెళ్లి చేసుకుంటానని నమ్మించి తనతో శారీరక సంబంధం పెట్టుకున్నాడని ఫిర్యాదులో పేర్కొంది. తాను యశ్ దయాల్ కుటుంబానికి తెలుసునని, క్రికెటర్ ను కూడా తన కుటుంబసభ్యులకు పరిచయం చేశానని చెప్పింది. యశ్ దయాల్ కుటుంబం సైతం తనను "కోడలిగా" అంగీకరించారని, దాంతో తన నమ్మకం రెట్టింపు అయిందని బాధితురాలు తన ఫిర్యాదులో పేర్కొంది. కానీ శారీరక అవసరాలు తీర్చుకున్నాక, పెళ్లి చేసుకోకుండా మోసం చేశాడని ఘజియాబాద్ కు చెందిన యువతి ఆరోపించింది..కొన్ని రోజుల కిందట బాధితురాలు ఫిర్యాదు చేయగా.. ఆమె నుంచి వివరాలు సేకరించిన పోలీసులు భారతీయ న్యాయ సంహిత సెక్షన్ 69 కింద యశ్ దయాల్ మీద ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. కుటుంబం తనను అంగీకరించడంతో పెళ్లి పేరుతో తనతో లైంగిక సంబంధం పెట్టుకుని.. ఇప్పుడు ముఖం చాటేస్తున్నాడని యశ్ దయాల్‌పై మహిళ సంచలన ఆరోపణలు చేసింది. బాధితురాలి ప్రకానం.. యశ్ దయాల్ పలువురు మహిళలతో సంబంధం కలిగి ఉన్నాడు. తనతో పాటు పలువురు యువతులను పెళ్లి పేరుతో యశ్ దయాల్ మోసం చేశాడు. సహాయం కోసం మహిళా హెల్ప్‌లైన్ 181కి ఫోన్ చేశానని ఆమె పేర్కొంది. పోలీస్ స్టేషన్ ఈ విషయం ముందుకు సాగలేదు. దాంతో తనకు న్యాయం చేయాలని ఆమె ముఖ్యమంత్రి కార్యాలయాన్ని సంప్రదించింది. తన వాదనలకు మద్దతుగా ఫోటోలు, కాల్ రికార్డులు, ఇతర ఆధారాలను పోలీసులతో పంచుకున్నానని మహిళ పేర్కొంది. తక్షణమే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సీఎంవో అధికారులను ఆదేశించింది. ప్రేమ, పెళ్లి పేరుతో ఇంకెంత మంది మహిళల జీవితాలతో యశ్ దయాల్ ఆడుకుంటున్నాడోనని బాధితురాలు అంటోంది..కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. మహిళ సాక్ష్యాలను, వాంగ్మూలాన్ని పరిశీలించిన తర్వాత ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు పోలీసులు ధృవీకరించారు. అయితే, యష్ దయాల్‌ను ఇప్పటివరకు అదుపులోకి తీసుకోలేదు. తదుపరి ధృవీకరణ, విధానపరమైన చర్యల తర్వాత ఏదైనా అరెస్టు చేస్తామని దర్యాప్తు అధికారులు తెలిపారు.న్యాయం కోసం, గౌరవం కోసం పోరాడటానికి తాను చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతున్నట్లు బాధితురాలు చెప్పారు. ఇది ప్రతీకారేచ్ఛతో చేసిన పని కాదని ఫిర్యాదుదారు స్పష్టం చేశారు. ఇలాంటి పరిస్థితులను ఎదుర్కొంటున్న ఇతర మహిళలకు ధైర్యాన్ని ఇవ్వాలని బయటకు వచ్చి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

# అభిమాన క్రికెటర్ కోసం త్యాగం

వియాన్ ముల్డర్.. ఇప్పుడు క్రికెట్ అభిమానుల్లో ఎక్కువగా వినిపిస్తున్న పేరు. దక్షిణాఫ్రికా తాత్కలిక కెప్టెన్‌గా వ్యవహరిస్తున్న ముల్డర్.. జింబాబ్వేపై అద్భుత ఇన్నింగ్స్ (367 నాటౌట్)తో ఆకట్టుకున్నాడు. మరో 34 పరుగులు చేస్తే.. టెస్టుల్లో బ్రియాన్ లారా (400) అత్యధిక పరుగుల రికార్డును బ్రేక్ చేసే అవకాశం ఉన్నా వద్దనుకున్నాడు. లారా మీద గౌరవంతో రికార్డుకు చేరువగా వచ్చినా ఆగిపోయాడు. క్వీన్స్ స్పోర్ట్స్ క్లబ్ వేదికగా జింబాబ్వేతో జరిగిన మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్‌లో 626 వద్ద డిక్లేర్ చేసిన సంగతి తెలిసిందే.బ్రియాన్ లారా అంటే తనకు ఎంతో ఇష్టమని.. ఆయనపై ఉన్న గౌరవం తనకు డిక్లేర్ చేయాలని అనిపించిందని వియాన్ ముల్డర్ ఇన్నింగ్స్ అనంతరం చెప్పాడు. "బ్రియాన్ లారా ఒక లెజెండ్. అతను ఇంగ్లాండ్‌పై 400 పరుగులు చేశారు. ఈ రికార్డు లారా వంటి గొప్ప బ్యాటర్‌పైనే ఉండాలి. ఆయనే నాకు స్ఫూర్తి. ఆ స్థాయి ఉన్న వ్యక్తి రికార్డును నిలబెట్టుకోవడానికి అర్హులు. నాకు మరో అవకాశం వచ్చినా ఆ రికార్డును దాటే ప్రయత్నం చేయను" అంటూ ముల్డర్ చెప్పుకొచ్చాడు. దక్షిణాఫ్రికా తరుపున అత్యధిక పరుగులు చేసిన బ్యాట్స్‌మెన్‌గా ముల్డర్ నిలవగా.. ఓవరాల్‌గా ఐదో స్థానంలో నిలిచాడు. ముల్డర్ నిర్ణయంత దక్షిణాఫ్రికా కోచ్ శుక్రీ కాన్రాడ్‌తో కూడా ఏకీభవించారు. "బ్రియాన్ లారా వంటి లెజెండ్ రికార్డును ఉంచనివ్వండని ముల్డర్ నాతో కూడా అన్నాడు. నా విధి ఎలా ఉంటుందో నాకు ఎప్పటికీ తెలియదని.. కానీ బ్రియాన్ లారా రికార్డు అంటే అలాగే ఉండాలని ముల్డర్ అన్నాడు." అని శుక్రీ కాన్రాడ్ తెలిపారు.ఈ ఇన్నింగ్స్‌లో 334 బంతులు ఎదుర్కొన్న ముల్డర్.. 49 ఫోర్లు, నాలుగు సిక్సర్ల సాయంతో 367 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. సరికొత్త రికార్డు సృష్టించే అవకాశం ఉన్నా.. తనకు స్ఫూర్తిగా నిలిచిన ప్లేయర్‌పై అభిమానంతో ఆగిపోయిన ముల్డర్‌పై నెట్టింట ప్రశంసల వర్షం కురుస్తోంది. అతడిని కలియుగంలో ఏకలవ్యుడు అంటూ పొగుడుతున్నారు. ఇక ఈ మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా 236 పరుగుల ఇన్నింగ్స్ తేడాతో విజయం సాధించింది. సఫారీ టీమ్ తొలి ఇన్నింగ్స్‌లో 626 పరుగుల చేయగా.. జింబాబ్వే మొదటి ఇన్నింగ్స్‌లో 170 పరుగులకే కుప్పకూలింది. అనంతరం ఫాలో ఆన్ ఆడిన జింబాబ్వే.. రెండో ఇన్నింగ్స్‌లో 220 పరుగులకు ఆలౌట్ అయింది. దీంతో సౌతాఫ్రికా వరుసగా రెండో టెస్ట్ మ్యాచ్‌లోనూ గెలుపొంది.. సిరీస్‌ను 2-0 తేడాతో క్లీన్ స్వీప్ చేసింది.



# ఓటమిపై స్టోక్స్ కుంటిసాకులు

ఇండియాతో జరిగిన రెండో టెస్టులో 336 పరుగుల భారీ తేడాతో ఇంగ్లాండ్ ఓడిపోయిన సంగతి తెలిసిందే. దీంతో బర్మింగ్ హామ్ వేదికపై తన ఫస్ట్ ఎవర్ విక్టరీని టీమిండియా నమోదు చేసింది. అయితే మ్యాచ్ ముగిశాక ఇంగ్లాండ్ కెప్టెన్ బెన్ స్టోక్స్ ఓటమిపై తన అక్కసును వెల్లగక్కాడు.



బర్మింగ్ హామ్ పిచ్ ఉపఖండపు పిచ్ ను పోలి ఉందని, అందుకే తాము ఓడిపోయామని సన్నాయి నొక్కులు నొక్కుతున్నాడు. ఉపఖండపు పిచ్ లపై రెగ్యులర్ గా టీమిండియా ప్లేయర్లు ఆడతారని, తమకు అంతగా అలవాటు లేకపోవడంతో తేలిపోయామని పేర్కొన్నాడు. నిజానికి తొలి టెస్టులో అనూహ్య విజయంతో రెండో టెస్టులో విజయగర్వంతో ఇంగ్లాండ్ బరిలోకి దిగింది. అయితే చక్కని ప్రణాళికతో బరిలోకి దిగిన భారత్ అద్భుత విజయం సాధించింది. తాజాగా ఇలా పిచ్ పై నిందలు వేసి, తమ తప్పు లేదని స్టోక్స్ చెప్పడంపై భారత ఫ్యాన్స్ మండి పడుతున్నారు. ఇండియాలో ఓడిపోయినా, ఇంగ్లాండ్ లో ఓడిపోయినా ఉపఖండపు పిచ్ ల వల్లే ఓడామని ఎలా చెబుతున్నారని విమర్శించారు. నిజానికి బ్యాటింగ్ వైఫల్యంతోనే ఈ టెస్టులో ఇంగ్లాండ్ ఓడిపోయింది. కొంతమంది ఆటగాళ్లపై అతిగా ఆధారపడటం, పరిస్థితులకు సంబంధం లేకుండా బజ్ బాల్ తరహా ఆటతీరుతో చతికిల పడింది. తొలి టెస్టులో అరడజనుకు పైగా క్యాచ్ లు జారవిడవడంతోనే ఇంగ్లాండ్ గెలిచింది. క్యాచ్ లు సరిగ్గా పట్టినట్లయితే ఆ మ్యాచ్ లోనూ ఓడిపోయేదని విశ్లేషకులు పేర్కొంటున్నారు. ఇక వ్యూహం ప్రకారమే బ్యాటింగ్ పిచ్ లు తయారు చేసి, ఇప్పుడు బొక్క బోర్లా పడటంతో ఆ పిచ్ లను విమర్శించడం సరికాదని హితవు పలుకుతున్నారు. నిజానికి ఎడ్జ్ బాస్టన్ పిచ్ బ్యాటింగ్ కు అనుకూలంగా చేసి, బౌండరీలైన్ ను కూడా 60 మీటర్లకు కుదించారు. భారత్ బలమైన బౌలింగ్ లైనప్ ను చూసి, ఇంగ్లాండ్ ఈ ఏర్పాట్లు చేసుకుంది. అయితే తమకు బలమైన బ్యాటింగ్ విఫలం కావడంతోనే ఇంగ్లాండ్ పరాజయం పాలైంది. ముఖ్యంగా ఓపెనర్లపై అధికంగా ఆధారపడటం ఆ జట్టు కొంపముంచుతోంది. అలాగే స్టోక్స్ కూడా ఫామ్ లో లేక పోవడం మైనస్ పాయింట్ గా మారింది. అలాగే కీలక బౌలర్లు మార్క్ వుడ్, అట్కిన్సన్ గాయాలతో దూరం కావడం, జోఫ్రా ఆర్చర్ అందుబాటులో ఉన్నా తొలి టెస్టు విజయగర్వంతో తనను వాడుకోకపోవడం ఆ జట్టు ఓటమికి కారణాలుగా చెప్పవచ్చు. ఇక ఉపఖండపు పిచ్ లపై స్పిన్నర్లు పండుగ చేసుకుంటారు. రెండు ఇన్నింగ్స్ లలో కలిపి భారత స్పిన్నర్లకు రెండు వికెట్లు మాత్రమే వచ్చాయి. మరోవైపు ఇంగ్లాండ్ స్పిన్నర్లే ఎక్కువ వికెట్లు తీయడం విశేషం. ఏదేమైనా ఆడలేక మద్దెల ఓడెను అన్నట్లు తమ బ్యాటింగ్ వైఫల్యంపై దృష్టి పెట్టకుండా, నిందను పిచ్ పైకి నెట్టడంపై పలువురు విమర్శిస్తున్నారు. ఇక ఈనెల 10 నుంచి లార్డ్స్ మైదానంలో మూడో టెస్టు ప్రారంభమవుతుండటంతో ఆ వేదికలో ఎలాంటి పిచ్ ను రూపొందిస్తారోనని పలువురు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.



### లార్డ్స్‌లో జూలై 10న ప్రారంభం
### లార్డ్ష్ పిచ్ పేసర్లకు అనుకూలం
### భారీ స్కోర్లు కష్టమేనంటున్న నిపుణులు?

భారత్, ఇంగ్లాండ్ టెస్ట్ సిరీస్?లో ఇప్పటివరకు బ్యాట్స్‌మెన్‌లే హవా కొనసాగించారు. రెండు మ్యాచ్‌ల్లోనూ పరుగుల వరద పారించారు. చాలా మంది ఆటగాళ్లు సెంచరీలు, హాఫ్ సెంచరీలు చేశారు. రెండు మ్యాచ్‌లు అయ్యాక సిరీస్ 1-1తో సమంగా ఉంది. ఇప్పుడు మూడో టెస్ట్ మ్యాచ్ లార్డ్స్ మైదానంలో ఆడాలి. మొదటి రెండు టెస్ట్ మ్యాచ్‌ల్లో భారీగా పరుగులు నమోదయ్యాయి. మరి మూడో మ్యాచ్‌కు ముందు లార్డ్స్ పిచ్ ఎలా ఉండబోతుందో వివరంగా ఈ కథనంలో తెలుసుకుందాం. మొదటి టెస్ట్ లీడ్స్ మైదానంలో జరిగింది. ఇందులో భారత్ మొదటి ఇన్నింగ్స్‌లో 471 పరుగులు చేసింది. దీనికి బదులుగా ఇంగ్లాండ్ 465 పరుగులు చేసింది. భారత్ రెండో ఇన్నింగ్స్ 364 పరుగులకే ముగిసింది. ఇంగ్లాండ్ 373 పరుగులు చేసి 5 వికెట్లతో మ్యాచ్ గెలిచింది. ఈ విధంగా మొదటి మ్యాచ్‌లో మొత్తం 1,673 పరుగులు నమోదయ్యాయి.రెండో మ్యాచ్‌లో టీమిండియా మొదటి ఇన్నింగ్స్‌లో 587 పరుగులు చేసింది. దీనికి బదులుగా ఇంగ్లాండ్ 407 పరుగులు చేసింది. టీమిండియా రెండో ఇన్నింగ్స్‌ను 427 పరుగుల వద్ద డిక్లేర్ చేసింది. 608 పరుగుల లక్ష్యాన్ని ఛేదిస్తూ ఇంగ్లాండ్ 271 పరుగులకే ఆలౌట్ అయింది. మొదటి టెస్ట్ మ్యాచ్‌లో మొత్తం 1,673 పరుగులు, రెండో మ్యాచ్‌లోని నాలుగు ఇన్నింగ్స్‌ల్లో మొత్తం 1,692 పరుగులు నమోదయ్యాయి. ఇలా ఇప్పటివరకు రెండు మ్యాచ్‌ల్లో కలిపి మొత్తం 3,365 పరుగులు వచ్చాయి. ఈ రెండు మ్యాచ్‌ల్లో ఇప్పటివరకు మొత్తం 11 సెంచరీలు నమోదయ్యాయి.మూడో టెస్ట్ కోసం లార్డ్స్ పిచ్‌పై మంచి మోతాదులో గడ్డి కనిపిస్తోంది. లార్డ్స్ మైదానం పిచ్‌పై గడ్డి ఉండడం వల్ల ఫాస్ట్ బౌలర్లకు మంచి స్వింగ్ లభిస్తుంది. పిచ్‌పై గడ్డి ఉండటం వల్ల అసాధారణమైన బౌన్స్ కూడా కనిపించవచ్చు. దీనివల్ల మ్యాచ్ ప్రారంభంలో బ్యాటింగ్ చేయడం చాలా కష్టంగా ఉంటుంది. అయితే, పిచ్ పాతబడుతున్న కొద్దీ బ్యాటింగ్ చేయడం ఈజీ అవుతుంది. ఇక్కడ మొదటి ఇన్నింగ్స్‌లో సగటు స్కోరు 310 పరుగులు. లార్డ్స్ చరిత్రలో ఇప్పటివరకు 344 పరుగుల కంటే ఎక్కువ లక్ష్యాన్ని ఏ జట్టు కూడా ఛేదించలేదు . అంటే, ఈ పిచ్ బౌలర్లకు ముఖ్యంగా పేసర్లకు కొంత అనుకూలంగా ఉండే అవకాశం ఉంది. అయినా, బ్యాట్స్‌మెన్‌లు నిలబడితే భారీ స్కోర్లు చేసే అవకాశం లేకపోలేదు.

# వింబుల్డన్‌లో మెరిసిన కోహ్లీ, అనుష్క



క్రికెట్ ప్రపంచంలో సంచలనం సృష్టిస్తున్న విరాట్ కోహ్లీ, బాలీవుడ్ స్టార్ అనుష్క శర్మ దంపతులు ఇప్పుడు టెన్నిస్ అభిమానులను కూడా ఆకట్టుకుంటున్నారు. ఇటీవల లండన్‌లోని వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ టోర్నమెంట్‌లో ప్రపంచ నంబర్ 1 టెన్నిస్ ప్లేయర్ నోవాక్ జొకోవిచ్ ఆడిన మ్యాచ్‌ను వీక్షించడానికి వారు హాజరయ్యారు. జొకోవిచ్‌కి మద్దతుగా రాయల్ బాక్స్‌లో కూర్చున్న విరుష్క దంపతుల ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.వింబుల్డన్ 2025లో భాగంగా జరిగిన రౌండ్ ఆఫ్ 16 మ్యాచ్‌లో నోవాక్ జొకోవిచ్ ఆస్ట్రేలియాకు చెందిన అలెక్స్ డి మినార్‌తో తలపడ్డాడు. ఈ మ్యాచ్ ఉత్కంఠభరితంగా సాగింది. జొకోవిచ్ మొదటి సెట్‌ను 1-6తో కోల్పోయినప్పటికీ, ఆ తర్వాత అద్భుతంగా పుంజుకుని తదుపరి మూడు సెట్లను 6-4, 6-4, 6-4తో గెలిచి క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకున్నాడు. ఈ అద్భుతమైన విజయాన్ని విరాట్ కోహ్లీ, అనుష్క శర్మ ఎంతో ఉత్సాహంగా వీక్షించారు.విరాట్ కోహ్లీ, అనుష్క శర్మ వారి స్టైలిష్ లుక్‌తో అందరి దృష్టిని ఆకర్షించారు. కోహ్లీ టాన్ బ్రౌన్ బ్లేజర్, తెల్ల షర్ట్, నమూనా గ్రే టైతో డ్యాపర్‌గా కనిపించాడు. అనుష్క శర్మ తెల్లటి బ్లేజర్‌తో, సింపుల్ మేకప్‌తో ఎలిగెంట్‌గా మెరిసింది. వారిద్దరూ వింబుల్డన్ వాతావరణానికి తగ్గట్టుగా సాంప్రదాయ దుస్తులలో వచ్చి అందరి ప్రశంసలు పొందారు. జొకోవిచ్ విజయం పట్ల విరాట్ కోహ్లీ తన సంతోషాన్ని వ్యక్తం చేస్తూ ఇన్‌స్టాగ్రామ్‌లో ఒక పోస్ట్ కూడా పెట్టాడు. "ఎంత అద్భుతమైన మ్యాచ్. గ్లాడియేటర్‌కు ఎప్పటిలాగే ఇది సులభమైన పని" అని జొకోవిచ్‌ను ఉద్దేశించి రాశాడు. ఈ వ్యాఖ్యలు జొకోవిచ్‌తో కోహ్లీకి ఉన్న స్నేహబంధాన్ని, అతని ఆట పట్ల ఉన్న అభిమానాన్ని తెలియజేస్తున్నాయి. కాగా, విరాట్ కోహ్లీ, అనుష్క శర్మ వింబుల్డన్‌కు రావడం ఇదే మొదటిసారి కాదు. పదేళ్ల క్రితం 2015లో కూడా ఈ జంట ఈ ప్రతిష్టాత్మక టోర్నమెంట్‌ను వీక్షించారు. అప్పటి, ఇప్పటి ఫోటోలను పోలుస్తూ అభిమానులు సోషల్ మీడియాలో కామెంట్లు పెడుతున్నారు. విరాట్ కోహ్లీ టెస్ట్ క్రికెట్ నుండి రిటైర్మెంట్ ప్రకటించిన తర్వాత, తన కుటుంబంతో ఎక్కువ సమయం గడపడానికి లండన్‌లో ఉంటున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఈ వింబుల్డన్ పర్యటన కూడా అందులో భాగమే. క్రికెట్, బాలీవుడ్ రంగాలకు చెందిన ఈ ప్రముఖ జంట వింబుల్డన్‌లో సందడి చేయడంతో, టెన్నిస్ ప్రపంచంలో కూడా వీరు హాట్ టాపిక్‌గా మారారు.

# మూడో టెస్ట్‌పై సర్వత్రా ఉత్కంఠ! లార్డ్స్‌లో శుభమన్ గిల్ చరిత్ర సృష్టిస్తారా ?



భారత్, ఇంగ్లాండ్ మధ్య జరిగే మూడో టెస్ట్ మ్యాచ్ జూలై 10న మొదలవుతుంది. ఈ మ్యాచ్ క్రికెట్ మక్కాగా పిలుచుకునే లార్డ్స్ మైదానంలో జరుగుతుంది. ఈ మ్యాచ్ గెలిచిన జట్టు సిరీస్‌లో పైచేయి సాధిస్తుంది కాబట్టి, రెండు జట్లకు ఈ మ్యాచ్ చాలా ముఖ్యం. మొదటి టెస్ట్‌లో ఇంగ్లాండ్ 5 వికెట్లతో గెలిచింది. కానీ రెండో టెస్ట్‌లో టీమిండియా ఇంగ్లాండ్‌ను 336 పరుగుల భారీ తేడాతో ఓడించి కొత్త రికార్డు సృష్టించింది. ఇప్పుడు రెండు జట్లు మూడో మ్యాచ్ కోసం రెడీ అవుతున్నాయి. లార్డ్స్‌లో మ్యాచ్ జరుగుతుంది కాబట్టి తామే గెలుస్తామని ఇంగ్లాండ్ టీమ్ నమ్మకంతో ఉంది. ఎందుకంటే, ఈ మైదానంలో టీమిండియా ఇప్పటివరకు కేవలం మూడు సార్లు మాత్రమే గెలిచింది. 1932 నుంచి లార్డ్స్‌లో టెస్ట్ మ్యాచ్‌లు ఆడుతున్నా ఇప్పటివరకు మూడు విజయాలే వచ్చాయి.లార్డ్స్ మైదానంలో టీమిండియా ఇప్పటివరకు 19 మ్యాచ్‌లు ఆడింది. ఇందులో 3 మ్యాచ్‌లలో గెలిచింది, 4 మ్యాచ్‌లు డ్రా అయ్యాయి. మిగిలిన 12 మ్యాచ్‌లలో భారత జట్టు ఓడిపోయింది. ఈ గణాంకాలను చూస్తే లార్డ్స్ మైదానంలో ఇంగ్లాండ్ గెలవడానికి ఎక్కువ అవకాశాలు ఉన్నట్లు అనిపిస్తుంది. అయితే లార్డ్స్ మైదానంలో ఆడిన చివరి మూడు టెస్ట్ మ్యాచ్‌లలో టీమిండియా 2 మ్యాచ్‌లలో గెలిచింది. కాబట్టి ఈసారి కూడా భారత జట్టు నుంచి మంచి ప్రదర్శనను ఆశించవచ్చు. ముఖ్యంగా 2021లో లార్డ్స్ మైదానంలో ఇంగ్లాండ్ జట్టును 151 పరుగుల తేడాతో ఓడించి టీమిండియా చరిత్ర సృష్టించింది.2021లో జరిగిన ఆ మ్యాచ్‌లో టీమిండియా తరపున కేఎల్ రాహుల్, మహ్మద్ సిరాజ్ అద్భుతంగా ఆడారు. రాహుల్ 134 పరుగులు చేయగా, మహ్మద్ సిరాజ్ 8 వికెట్లు తీసి ఆ గొప్ప విజయాన్ని అందించారు. ఇప్పుడు రాహుల్, సిరాజ్ ఇద్దరూ మంచి ఫామ్‌లో ఉన్నారు. ఈ సిరీస్‌లోని మొదటి మ్యాచ్‌లో రాహుల్ సెంచరీ చేసి మెరిస్తే, మహ్మద్ సిరాజ్ ఎడ్జ్‌బాస్టన్ టెస్ట్‌లో 7 వికెట్లు పడగొట్టాడు. కాబట్టి వీరిద్దరి నుంచి లార్డ్స్ మైదానంలో మంచి ఆటను ఆశించవచ్చు. దీని ద్వారా మరోసారి క్రికెట్ కాశీలో మన టీమిండియా విజయ పతాకాన్ని ఎగురవేస్తుందని ఆశిస్తున్నారు. 1986: కపిల్ దేవ్ కెప్టెన్సీలో టీమిండియా ఇంగ్లాండ్ జట్టును 5 వికెట్ల తేడాతో ఓడించి లార్డ్స్ మైదానంలో మొదటి విజయాన్ని నమోదు చేసింది. లి 2014: మహేంద్ర సింగ్ ధోని కెప్టెన్సీలో భారత జట్టు ఇంగ్లాండ్‌ను 95 పరుగుల తేడాతో ఓడించింది. లి 2021: విరాట్ కోహ్లీ నాయకత్వంలోని టీమిండియా అద్భుతమైన ఆటతీరుతో ఇంగ్లాండ్ జట్టును 151 పరుగుల తేడాతో ఘోరంగా ఓడించింది.ఇప్పుడు శుభమన్ గిల్ నాయకత్వంలో యువ భారత జట్టు లార్డ్స్ మైదానంలో ఆడేందుకు సిద్ధంగా ఉంది. దీని ద్వారా క్రికెట్ మక్కాలో భారత జట్టుకు నాలుగో విజయాన్ని అందిస్తారా అనేది వేచి చూడాలి.

# యూఎస్‌లో అట్లీ, అల్లు అర్జున్ సినిమా

## విలన్‌గా హాలీవుడ్ నటుడువిల్ స్మిత్ అంటూ ప్రచారం



పుష్ప 2 ది రూల్ వంటి బ్లాక్ బస్టర్ తర్వాత అల్లు అర్జున్ ఎలాంటి సినిమా చేస్తున్నాడా అని ఎదురు చూస్తున్న అభిమానులకు బన్నీ సూపర్ అప్‌డేట్‌ను ప్రకటించిన విషయం తెలిసిందే. తమిళ దర్శకుడు అట్లీతో తన తదుపరి సినిమా చేస్తున్నాడు అల్లు అర్జున్. ఈ సినిమాకు సన్ పిక్చర్స్ అధినేత కళానిధి మారన్ నిర్మిస్తుండగా.. అల్లు అర్జున్ 22వ సినిమాగా ఈ చిత్రం తెరకెక్కుతుంది. ఈ మూవీ షూటింగ్ దాదాపు అమెరికాలో జరుపుకోబోతుంది. ఇప్పటికే అల్లు అర్జున్‌తో పాటు దర్శకుడు అట్లీ-చిత్రయూనిట్ మొత్తం అమెరికాకు చేరుకుంది. ఈ సినిమాలో దీపికా పదుకొనే కథానాయికగా నటిస్తుండగా.. విలన్ రోల్‌కి సంబంధించి ఆసక్తికర విషయం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ సినిమాలో హాలీవుడ్ స్టార్ నటుడు విల్ స్మిత్‌ను విలన్‌గా తీసుకుబోతున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఒకవేళ ఇదే నిజమైతే అల్లు అర్జున్ సినిమా పాన్ ఇండియా నుంచి ఇంటర్‌నేషనల్ వరకు వెళు తుంది. కాగా ఈ విషయంపై చిత్రబృందం నుంచి ప్రకటన రావాల్సి ఉంది. ఈ చిత్రంలో అల్లు అర్జున్ మూడు విభిన్న పాత్రల్లో కనిపించనున్నారని సమాచారం.

# నటి విద్యాబాలన్ ఆరోగ్య సీక్రెట్

## డైట్ ప్లాన్ అనుసరించి బరువు తగ్గా



ప్రతి ఒక్క హీరోయిన్ శరీర ఆకృతి విషయంలో చాలా అంటే చాలా జాగ్రత్తలు తీసుకుంటారు. అందంగా కనిపించడం కోసం జిమ్‌లో గంటల తరబడి వర్కౌంట్‌లు చేస్తారు. అయితే బరువు తగ్గాలంటే జిమ్, వ్యాయామం, కఠినమైన డైట్‌లు తప్పనిసరి అన్న భావనకు బాలీవుడ్ నటి విద్యా బాలన్ ఓ కొత్త కోణాన్ని చూపించారు. 46 ఏళ్ల విద్యా ఇటీవల ఓ ఇంటర్వ్యూలో చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు చర్చనీయాంశ మవుతున్నాయి. కెరీర్ ఆరంభం నుంచి తన శరీర తీరుపై విమర్శలు ఎదుర్కొన్న విద్యా, ఎన్నో డైట్‌లు, జిమ్ సెషన్లు -ట్రై చేసినా అవి తాత్కాలిక ఫలితాలే ఇచ్చాయని గుర్తుచేశారు. కానీ ఆమె అసలు మార్పు మాత్రం జిమ్ మానేశాకే వచ్చిందని వెల్లడించారు. 'నాకు బరువు పెరగడానికి అసలు కారణం కొవ్వు కాదు. అది ఇన్‌ఫ్లమేషన్ (శరీరంలోని వాపు) అని చెన్నైకి చెందిన 'అముర' అనే న్యూట్రిషన్ గ్రూప్ చెప్పారు. ఆ సంస్థ సూచించిన విశిష్టమైన డైట్ ప్లాన్ అనుసరించడంతో, బరువు క్రమంగా తగ్గిపోయింది. అంతేకాదు, ఈ డైట్‌తోపాటు- నన్ను ఏడాది పాటు వ్యాయామం చేయొద్దని సూచించారు. నేను వర్కౌట్ చేయకుండా, జిమ్‌కి కూడా వెళ్లకుండా బరువు తగ్గాను. ఇప్పుడు ఎవరైనా నన్ను చూస్తే.. ఎంత స్లిమ్ అయిపోయావ్ అంటు-న్నారు. నేను పాటించిన డైట్ విధానం అందరికీ సరిపోదు. ఒక్కొక్కరి శరీరం ఒక్కోలా ఉంటు-ంది. అందుకే శరీర అవసరాలు గౌరవించాలి' అంటూ తన అనుభవాన్ని పంచుకుంది.

# రాజమౌళి..మహేశ్ బాబు కాంబో

## సినిమాపై కనిపించని ప్రచారం



రాజమౌళితో సినిమా చేస్తున్న హీరోలు మధ్యలో మరో ప్రాజెక్ట్ చేయకూడదు. ఇది జక్కన్న మొదటి రూల్. బాహుబలి సమయంలో ప్రభాస్, ఆర్‌ఆర్‌ఆర్ సినిమా చేస్తున్నప్పుడు ఎన్టీఆర్, రామ్ చరణ్ మరో సినిమా చేయలేదు. కాకపోతే గెస్ట్ రోల్ అని చెప్పి జక్కన్న దగ్గర స్పెషల్ పర్మిషన్ తీసుకొని ఆచార్య చేశాడు చరణ్. ఇప్పుడు ఎస్ఎస్ఎంబి29 కోసం మహేశ్ బాబు బల్క్ డేట్స్ ఇచ్చేశాడు. ఈ సినిమా తప్పితే మరో సినిమా చేయడం లేదు. అంతే కాకుండా ఈ సినిమాకు సంబంధించి బయట ఒక్క మాట కూడా మాట్లాడడం లేదు మహేశ్ బాబు. కానీ మిగతా స్టార్స్ మాత్రం రాజమౌళి రూల్స్ బ్రేక్ చేస్తున్నట్టే కనిపిస్తోంది. మహేశ్‌బాబు తప్ప ప్రియాంక చోప్రా, పృధ్వీరాజ్ సుకుమారన్ సమయం వచ్చినప్పుడల్లా మూవీ మాట్లాడుతునే ఉన్నారు. తాజాగా ప్రియాంక చోప్రా మహేశ్‌బాబు సినిమా గురించి ఓ ఇంటర్వ్యూలో చేసిన కామెంట్స్ వైరల్ అవుతున్నాయి. 'ప్రస్తుతం హాలీవుడ్ సినిమాలతో తీరిక లేకుండా గడుపుతున్నా. కానీ ఇండియాను, హిందీ సినిమాలను చాలా మిస్ అవుతున్నాను. అప్పుడప్పుడు నా సొంత ఇంటికి దూరమయ్యాననే భావన కలుగుతుంటుంది. కానీ ఇప్పుడు ఓ ఇండియన్ ప్రాజెక్ట్ చేస్తున్నాను. ఆ సినిమా కోసం ఆసక్తిగా ఎదురు చూస్తున్నాను' అంటూ చెప్పుకొచ్చారు. గతంలో పృథ్వీరాజ్ సుకుమారన్ కూడా పలు సందర్భాల్లో ఎస్ఎస్ఎంబీ 29 గురించి మాట్లాడారు. రాజమౌళి సినిమా ప్రస్తుతం చిత్రీకరణ దశలో ఉంది. దాని గురించి ఇప్పుడేం మాట్లాడలేనని అన్నారు. కానీ తాను ఈ సినిమాలో ఏడాది క్రితమే భాగమయ్యాను. అప్పటినుంచి ఈ ప్రాజెక్ట్ కోసం వర్క్ చేస్తున్నానని తెలిపారు. కానీ మహేశ్ బాబు మాత్రం జక్కన్న గీసిన గీత దాటడం లేదు. ఎస్ఎస్ఎంబీ 29 గురించి బాబు మాట్లాడిన సందర్భాలు లేవు. లుక్ విషయంలోను లీక్ కాకుండా చాలా జాగ్రత్తగా వ్యవహరించాడు. విదేశాల్లో -ట్రైనింగ్‌కు వెళ్లినా కూడా ఎలాంటి లీకేజీ బయటికి రానివ్వలేదు. పూజా కార్యక్రమాలు జరుపుకున్నా, షూటింగ్ మొదలైనా కూడా ఎక్కడా ఒక్క మాట కూడా మాట్లాడలేదు. ఈ ప్రాజెక్ట్ గురించి ఏం చెప్పిన రాజమౌళినే చెప్పాలి అన్నట్టు-గా.. ఫుల్ స్ట్రిక్ట్‌గా ఉంటున్నాడు మహేష్. కానీ ప్రియాంక చోప్రా, పృథ్వీరాజ్ సుకుమారన్ ఈ సినిమా షూటింగ్ మొదలైనప్పటి నుంచి.. ఏదో ఓ రకంగా ఇండైరెక్ట్‌గా పోస్ట్‌లు పెడుతునే ఉన్నారు, మాట్లాడుతునే ఉన్నారు. దానికి తోడు లీకేజీలు వదలడం లేదు. ఇప్పటి వరకు రాజమౌళి ఈ ప్రాజెక్ట్ గురించి చెప్పింది ఏమైనా ఉందా అంటే? ఆ మధ్య సింహాన్ని బోనులో బంధించానని, మహేష్ బాబు పాస్‌పోర్ట్ లాక్కున్నాను అంటూ పోస్ట్‌లు చేశాడు.



# గుమ్మడి నటనకు ఎవరైనా ఫిదా కావాల్సిందే

## నేడు జయంతి సందర్భంగా సంస్మరణ




చిన్న వయసులోనే బరువైన పాత్రలు పోషించారు. పాజిటివ్, నెగిటివ్ క్యారెక్టర్ ఏదైనా అందులో జీవించాల్సిందే. లీడ్ రోల్ అయినా అతిథి పాత్రైనా.. ఆ సినిమాపై తనదైన ముద్ర వేయాల్సిందే. అతను ఎవరో కాదు గుమ్మడి వెంకటేశ్వర్ రావు. ఏ పాత్ర అయినా అలవోకగా చేసే గుమ్మడి నటన అందరికీ గుర్తుండిపోయింది. ఇవాళ గుమ్మడి జయంతి సందర్భంగా ఆయనను ఓసారి గుర్తు చేసుకుందాం.గుమ్మడి వెంకటేశ్వరరావు 1927 జూలై 9న గుంటూరు జిల్లా తెనాలి తాలూకా రావికంపాడు గ్రామంలో ఓ సాధారణ రైతు కుటుంబంలో జన్మించారు. గుమ్మడి వెంకటేశ్వరరావుకు బాల్యం నుంచీ ఏదో ఒక వైవిధ్యం ప్రదర్శించాలనే తపన ఉండేది.యన్టీఆర్ తమ ఎన్.ఏ.టి. సంస్థ నిర్మించిన చిత్రాలలో మంచి పాత్రలు ఇచ్చి ప్రోత్సహించారు. అలా రామారావు సొంత చిత్రాలు పిచ్చి పుల్లయ్య, తోడుదొంగలు, జయసింహ లో గుమ్మడి కీలక పాత్రలు పోషించారు. ఆ తరువాత గుమ్మడి మరి వెనుదిరిగి చూసుకోలేదు. 'తోడుదొంగలు'లో గుమ్మడి వయసు మీరిన పాత్ర ధరించడం చూసిన పి.పుల్లయ్య తన 'అర్ధాంగి' చిత్రంలో ఏయన్నార్, జగ్గయ్యకు తండ్రిగా నటించే పాత్రను ఇచ్చారు. తన కన్నా వయసులో పెద్దవారయిన నటులకు తండ్రిగా నటించడంతో అప్పటి నుంచీ గుమ్మడికి అధికంగా తండ్రి పాత్రలే పలకరించసాగాయి. ఒకే రకం పాత్రలు ధరించినా, వాటిలో తనదైన బాణీ ప్రదర్శించడానికి గుమ్మడి ప్రయత్నించేవారు. అనేక విలక్షణమైన పాత్రల్లో సలక్షణంగా నటించిన గుమ్మడికి 'మహామంత్రి తిమ్మరుసు' చిత్రం ఎనలేని పేరు సంపాదించి పెట్టింది. ఈ చిత్రం ద్వారా ఆయనకు రాష్ట్రపతి బహుమతి కూడా లభించింది. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఆయనను 'కళాప్రపూర్ణ' గౌరవ డాక్టరేట్ తో సత్కరించింది. రాష్ట్రప్రభుత్వం 'రఘుపతి వెంకయ్య అవార్డు'తో గౌరవించింది. సాత్వికాభినయంలో తనకు తానే సాటి అనిపించుకున్న గుమ్మడి పేరు తలచుకోగానే ఆయన ధరించిన అనేక వైవిధ్యమైన పాత్రలు మన కళ్ళ ముందు కదలాడుతూ ఉంటాయి. గుమ్మడి తన చివరి రోజుల్లో చిత్రసీమలో తన అనుభవాలను తీపి జ్ఞాపకాలు- చేదు గుర్తులు' పేరుతో రాసుకున్నారు. 2010 జనవరి 26న గుమ్మడి తుదిశ్వాస విడిచారు. తెలుగు చిత్రసీమ చూసిన మహానటుల్లో గుమ్మడి పేరు శాశ్వతంగా నిలచిపోతుంది. నవతరం ప్రేక్షకులు సైతం గుమ్మడి మెథడ్ యాక్టింగ్ చూసి ముగ్ధులవుతున్నారు..

# కీరవాణి కి పితృ వియోగం

## తండ్రి శివశక్తి దత్తా కన్నుమూత

ప్రముఖ సంగీత దర్శకుడు ఎంఎం కీరవాణి ఇంట విషాదం చోటుచేసుకుంది. ఆయన తండ్రి కోడూరి శివశక్తి దత్త మణికొండలోని తన నివాసంలో సోమవారం రాత్రి కన్నుమూశారు. గేయ రచయిత, స్క్రీన్ రైటర్‌గా టాలీవుడ్‌లో మంచి గుర్తింపు పొందారు. శివశక్తి దత్త అసలు పేరు కోడూరి సుబ్బారావు, అక్టోబర్ 8 1932లో కొవ్వూరులో జన్మించారు. టాలీవుడ్ టాప్ డైరెక్టర్ ఎస్ఎస్ రాజమౌళికి శివశక్తి దత్త పెదనాన్న అవుతారు. కళలపై ఆసక్తి ఉన్న ఆయన.. ఇంటి నుంచి వెళ్లిపోయి ముంబయిలోని ఓ ఆర్ట్స్ కాలేజీలో చేరారు. రెండేళ్ల తర్వాత కొవ్వూరుకు తిరిగొచ్చారు. కమలేశ్ అనే కలం పేరుతో చిత్రకారుడిగా పనిచేశారు. ఆ తర్వాత సంగీతంపై ఇష్టంతో గిటార్, సితార్, హార్మోనియం నేర్చుకున్నారు. నాగార్జున నటించిన జానికి రాముడు చిత్రానికి పనిచేశారు. నల్లా నల్లాని కళ్ల' పాట నుంచి ఛత్రపతి మన్నేల తింటివిరా, రాజన్న అమ్మా అవని గతేడాది వచ్చిన హనుమాన్ థీమ్ సాంగ్ వరకూ ఎన్నో హిట్ పాటలకు సాహిత్యం అందించారు. బాహుబలి 1 మమతల తల్లి, ధీవర, బాహుబలి 2 సాహోరే బాహుబలి, ఎన్టీఆర్: కథానాయకుడు కథా నాయక, ఆర్‌ఆర్‌ఆర్ రామం రాఘవమ్, హనుమాన్ అంజనాద్రి థీమ్, పాటలను ఆయనే రాశారు. శివశక్తి దత్తాకు ముగ్గురు సంతానం. కీరవాణి, కల్యాణి మాలిక్, శివశ్రీ కంచి. ఆయనకు ఒక అన్న, అక్క, నలుగురు తమ్ముళు ఉన్నారు. సినీ రచయిత విజయేంద్ర ప్రసాద్ ఆయన తమ్ముడు. శివశక్తి దత్త మరణంతో చిత్ర పరిశ్రమ తీవ్ర దిగ్భ్రాంతికి లోనైంది. చిరంజీవి సహా సినీ ప్రముఖులు ఆయనకు సోషల్ మీడియా వేదికగా నివాళులు అర్పిస్తున్నారు. ఆయన అంత్యక్రియలు మంగళవారం మధ్యాహ్నం మహా ప్రస్తానంలో నిర్వహించారు.



# బాలీవుడ్ ఎంట్రీ ఇస్తున్న సాయిపల్లవి

బాలీవుడ్ స్టార్ హీరో ఆమిర్‌ఖాన్ కుమారుడు జునైద్ ఖాన్ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం ఏక్ దిన్. ఈ సినిమాతో స్టార్ నటి సాయి పల్లవి బాలీవుడ్ ఎంట్రీ-ఇస్తుండగా.. సునీల్ పాండే దర్శకత్వం వహిస్తున్నాడు. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం ప్రస్తుతం పోస్ట్ ప్రోడక్షన్ పనుల్లో బిజీగా ఉంది. అయితే ఈ సినిమాను నవంబర్ 7న ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నట్లు- చిత్రబృందం ప్రకటించింది.ఈ సినిమాను ఆమిర్‌ఖాన్‌తో పాటు- బాలీవుడ్ అగ్ర నిర్మాత మన్సూర్ ఖాన్ నిర్మిస్తున్నాడు. ఆమిర్‌ఖాన్ - మన్సూర్ ఖాన్ దాదాపు 17 ఏండ్ల తర్వాత ఈ సినిమాతో మళ్లీ కలుస్తున్నారు. వీరిద్దరి కలయికలో 2008లో వచ్చిన 'జానే తూ... యా జానే నా' చిత్రం సూపర్ హిట్‌ను అందుకుంది.

EDITED, PRINTED AND PUBLISHED BY FAISAL KHAN PRINTED AT UJALA PRESS, LIG, 211 APHB COLONY ADILABAD, TELANGANA.
PUBLISHED FROM H.NO.4-4-120/C/3, SANJAY NAGAR COLONY, ADILABAD, TELANGANA STATE. EDITOR : FAISAL KHAN, RNI : APTEL/2013/53323, CELL : 94400 62685